త్వరలో రానున్నది!

# కినీమా

(సినిమా మాస పత్రిక)

★

పత్రికా ప్రచురణలో నూతనాధ్యాయం ప్రారంభించిన

## చందమామ పబ్లికేషన్స్

నుంచి

ఈ మాసపత్రిక

అందమైన ఫొటోలతో, ఆకర్షవంతమైన శీర్షికలతో, ముచ్చటైన ముద్రణతో సర్వాంగసుందరంగా వెలువడి

## సినిమా పాఠకలోకాన్ని రంజింపజేయనున్నది

తొలిసంచికకోసం వేచివుండండి

---

## చందమామ పబ్లికేషన్స్


వడపళని :: మదరాసు - 26.

## ఈ సంచికలో కొందరు రచయితలు

★

- ★ వేలూరి సహజానందం
- ★ దాసరి సుబ్రహ్మణ్యం
- ★ వి. ఎస్. అవధాని
- ★ టేకుమళ్ల కామేశ్వరరావు
- ★ ఎన్. ఆర్. చందూర్
- ★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి
- ★ కొమ్మూరి ఉషారాణి
- ★ 'చాణక్య'


# నిరంతర
# సహవాసి



మీరు మకాం చేస్తున్నా, లేక ఇంటి
లోనే ఉన్నా, ఇటియల్ మీకు
నిరంతర సహవాసిగా ఉంటుంది.
దానిని నమ్మకంగా మీరు వాడవచ్చును.

సెప్టిక్ కానివ్వదు, క్రిమివిధ్వంసిని, ఆహ్లాదకరమైనది, విషంకాదు.

ఉత్పత్తిదారులు:

ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిడ్.,

మల్లేశ్వరం, బెంగుళూరు.




సెల్లింగ్ ఏజెంట్లు:

బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్,

పోస్ట్ బాక్సు నం. 63, మద్రాసు.


త్వరలో
వస్తుంది
ఈస్టిండియా ఫిలిం కంపెనీ వారి
సంక్రాంతి
డైరెక్టర్ :
సి. పుల్లయ్య









ఆరోగ్యప్రదాయిని
సంతానకల్పవల్లి

# లోధ్ర

కేసరీ కుటీరం లిమిటెడ్,
రాయపేట :: మద్రాసు 14



డోంగ్రేగారి

## బాలామృతం

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను. పళ్ల మొలిచేటప్పుడు అయ్యే విరేచనములు నిలిపి. బలమును. ఆరోగ్యము నిచ్చును.

K. T. Dongre & Co. BOMBAY-4

## హృదయములో నుంచండి

ఈ బోధ నిజమనుకొండి
చర్మమును మృదువుగా సుందరపరచే
రకములలో ఎక్లా టాయిలెట స్నో
ఇదే సర్వోత్తమైనది

# ఎక్లా

టాయిలెట స్నో



★

నోవా కంపని
మాహిమ్, బొంబాయి


అన్ని ముఖ్య కేంద్రాలలో విజయ వంతంగా
ప్రదర్శింపబడుచున్నది
ఆబాల గోపాలు
ఆనందిస్తున్న చిత్రం!
రాగిణీ వారి
ధర్మదేవత
శాంతకుమారి · లలిత · గిరిజ · లింగమూర్తి · ముక్కామల · బి.యస్.ఆర్.
రేలంగి · రామమూర్తి · వంగర · లక్ష్మీప్రభ · పద్మిని · వేదసరస్వతి · మాస్టర్ మోహన్.
డిస్ట్రిబ్యూటర్లు.
ఆంధ్ర. రాజశ్రీ
మైసూర్. తల్లం

# పది - సంవత్సరాల

# ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్ సర్టిఫికేట్లు

## (ప్రతిఫలం 3½%-పన్ను ఉండదు)

ప్రస్తుతం ఈ క్రింది పార్ట్ "ఏ" రాష్ట్రాలలో కూడా అన్ని
సబ్ ట్రెజరీలనుండి లభిస్తాయి.

**అస్సామ్, బీహార్ | మద్రాసు, ఒరిస్సా**
**బొంబాయి, మధ్యప్రదేశ్ | పంజాబ్, ఉత్తర ప్రదేశ్**
**పశ్చిమ బెంగాల్**

**డిపాజిట్లు స్వీకరించే కార్యాలయాల పూర్తి జాబితా :**

(1) కలకత్తా, బొంబాయి, మద్రాసు, ఢిల్లీలలోని రిజర్వు బ్యాంకు కార్యాలయాలు; ఇతర ప్రదేశాలలో ప్రభుత్వ ట్రెజరీ వ్యవహారాలు నిర్వహిస్తున్న ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు.

(2) పార్ట్ "ఏ" రాష్ట్రాలలో ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారు ట్రెజరీ వ్యవహారాలు నిర్వహించని ప్రదేశాలలో అన్ని జిల్లా ట్రెజరీలు.

(3) పార్ట్ "ఏ" రాష్ట్రాలలో అన్ని సబ్ ట్రెజరీలు.

(4) భుజ్ (కచ్), ఇంఫాల్ (మణిపూర్) కూర్గ్ - మెర్కారా (కూర్గ్)లలోని ట్రెజరీలు.

## రు. 100/-కు ఎన్నిరెట్లకైనా సర్టిఫికేట్లు జారీ చేయబడుతాయి.

పెట్టుబడికి పరిమితులు :

| | | |
|---|---|---|
| వ్యక్తులకు .... | .... | రు. 25,000/- |
| ఇద్దరు చేరినప్పుడు | .... | రు. 50,000/- |
| సంస్థలకు .... | .... | రు. 50,000/- |
| ధర్మ సంస్థలకు | .... | రు. 1,00,000/- |

ఈ పెట్టుబడిని గురించిన నిబంధనలు గాని, మరికొన్ని వివరాలు గాని తెలుసుకోదలచినవారు నేషనల్ సేవింగ్స్ కమిషనర్, గోర్టన్ కాజిల్, సిమ్లా-3 విలాసానికి దరఖాస్తు చేసుకోవచ్చును.

A. C. 377 Telugu

"లక్స్ టాయిలెట్ సబ్బు
నా చర్మమును అందముగా నుంచుచున్నది"
అని ఎ.ఆర్. శకుంతల
చెప్పుచున్నది







మనోహరమైన సువా
సనతోగూడిన ఈ తెల్లటి
శుద్ధ సబ్బుతో మీ చర్మ
మును మనోహరముగా
నుంచుకొనండి!

సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు

LTS. 332-50 TL


ఆంధ్రదేశమంతటా ఇప్పుడు
జయప్రదముగా ప్రదర్శింపబడుచున్నది...
పక్షిరాజావారి
కాంచన
(తెలుగు)




బాదకుండగనే బట్టలను తెల్లగాను ప్రకాశవంతముగాను ఉతుకును:

S. 184-50 TL

# గ్రంథ స్వీకారం

ఈ దిగువ పుస్తకాలు మా కార్యాలయం చేరినవి—సం॥

★

**1. తత్వ సందేశము (కీర్తనలు) :**

కర్త: శ్రీ ఉమర్ అలీషా మహాకవి. డెమీ ⅛ సైజు 56 పుటలు. వెల : రు. 1-8-0 లు. ప్రతులకు: శ్రీ ఎమ్. కబీర్‌షా, బి.ఏ.,బి.ఎల్., ఉమర్ అలీషా కవి గ్రంథమండలి, ఏలూరు (పశ్చిమ గోదావరిజిల్లా).

**2. పానశాల (పద్యకావ్యం) :**

ఉమ్రఖయ్యాము పారసీ రుబాయీలకు అనువాదం. గ్రంథకర్త: శ్రీ కవికోకిల దువ్వూరి రామిరెడ్డి. క్రౌను ⅛ సైజు 94 పుటలు. వెల: రు. 2-0-0 లు. ప్రతులకు : వి. డి. మూర్తి, ట్రంకురోడ్డు, నెల్లూరు.

**3. కృషీవలుడు (పద్యకావ్యం)**

క్రౌను ⅛ సైజున 35 పేజీలు. మూల్యం : ఒక రూపాయి.

**4. యువకస్వప్నము (పద్యకావ్యం) :**

క్రౌన్ ⅛ సైజు 40 పేజీలు. మూల్యం: 12 అణాలు.

**5. కడపటివీడుకోలు (పద్యకావ్యం) :**

క్రౌన్ ⅛ సైజున 38 పేజీలు. మూల్యం : 12 అణాలు.

**6. మిత్రార్థశతకము (పద్యకావ్యం) :**

పాకెట్‌సైజున 32 పుటలు. వెల : నాలుగణాలు. ఈ నాలుగు పుస్తకాలూ శ్రీ కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారి రచనలే. ప్రతులకు : వి. డి. మూర్తి ట్రంకురోడ్డు, నెల్లూరు.

**7. పేదపడుచు (నాటకం) :**

రచన : శ్రీ సీతంరాజు వేంకటేశ్వర రావు. క్రౌన్ ⅛ సైజు 94 పేజీలు. వెల : రు. 1-8-0 లు. ప్రతులకు : విజయ పబ్లికేషన్స్, సీతన్నపేట, విజయవాడ - 2.

**8. నసీబ్ (నాటకం) :**

రచన: శ్రీ వైద్యుల శ్రీనివాసరావు. క్రౌన్ ⅛ సైజు 39 పేజీలు. వెల : 8 అణాలు. ఇదీ విజయ పబ్లికేషన్స్‌వారి ప్రచురణే.

**9. శ్రీ ఆచార్య శ్రీ :**

(శంకరుల జీవితచరిత్ర) కర్త : డాక్టర్ శ్రీ పురాణపండ రామమూర్తి, క్రౌన్ ⅛ సైజు 20 పేజీలు. వెల : పావలా. ప్రచురణ : ఆధ్యాత్మ ప్రచారకసంఘము, ఆలమూరు (తూర్పుగోదావరి).

# ఇండియాయొక్క ఏర్పాటు ననుసరించిన

# గృహనిర్మాణాభివృద్ధిలోను




**ది సిమెంట్ మార్కెటింగ్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్**

సల్సు మేనేజర్స్ ఆఫ్

## ది ఎసోసియేటెడ్ సిమెంట్ కంపెనీస్ లిమిటెడ్

SISTA'S - CMI - 7 - Telu



# అతిథి సత్కారానికి అమోఘమైనది

హేమ:—ఏమిటి పిన్నీ, నిన్న మీ యింటికి వచ్చిన పెద్ద మనిషిని కేవలం కుశల ప్రశ్నలు వేసి పంపించావు? కాస్త కూర్చో పెట్టి కొంచెం ఫలహారం గాని పానీయం గాని ఇవ్వలేక పోయావా?

ప్రేమ:—వస్తువుల ధరలు ఇలా మండి పోతూంటే ఏం ఫలహారాలు పెట్టగలమమ్మా? పైగా అతడు ఓ ఘడియ కూర్చుందుకైనా టైము లేదంటూంటే ఏం పానీయం ఇవ్వగలను?

హేమ:—అదేమిటండీ, ఓగ్లాసుడు 'టీ' తయారు చేసి ఇవ్వ వచ్చునే... మీకు తెలుసు గదా—'టీ'...అతి చవకగా అతి త్వరగా శ్రమ లేకుండా తయారు చేయవచ్చునే!

ప్రేమ:—అవును నిజమే. సమయానికి తోచలేదు. ఎంత మంద బుద్ధి నాది! అతిథి సత్కారానికి నిజంగా 'టీ' అమోఘమైనది.

## మంత్ర శక్తి నిచ్చే పానీయం
## "టీ" త్రాగండి



సెంట్రల్ "టీ" బోర్డువారివల్ల ప్రచురింపబడినది.

CTB 70

ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపుటి 16 ] జూలై 1952 [ సంచిక 7

# జరుగుతున్న చరిత్ర

ఈమధ్య మద్రాస్‌రాష్ట్రంలో జరిగిన విషయాలలో ఆహారధరలపై, పంపకాలపై కంట్రోల్ తొలగించడం; ఆహారధాన్యాలు విరివిగా అమ్ముకోటానికి, అమ్మబడటానికి సదుపాయం చేయడం—ఈ నిర్ణయం చేయడంలో రాజాజీమంత్రివర్గం ధైర్యంతోను దూరదృష్టితోను ప్రవర్తించారనటంలో అతిశయోక్తిలేదు. అందులోనూ ఆహారకొరత వలన తొమ్మిది సంవత్సరాలనుంచి ఈ రాష్ట్రప్రజలు అనుభవిస్తూన్న కష్టాలను ఆలోచిస్తే వారి నిర్ణయం ప్రజామోదం పొందించడంలోకూడ అతిశయోక్తిలేదు.

ఈ నిర్ణయం చేయడంలో ప్రభుత్వవిధానం జయప్రదంకావడానికి కొన్ని ముఖ్యావసరాలున్నాయి. మొదటిది: రాష్ట్రంలో, మిగులుజిల్లాలలోను ఇతరజిల్లాలలోకూడా అదనంగా ఉన్న ధాన్యాలను భూస్వాములు, వ్యవసాయదారులు సరసమైన ధరలకు విక్రయించడానికి పూనుకోవాలి. రెండు: ప్రజలలో డబ్బుఉన్నవారు వారి అవసరాలకు మించి అనవసరంగా అదనపుధాన్యం కొని నిల్వచేసుకోవడం మానేయాలి. మూడు: రాష్ట్రం మొత్తంమీద ఏర్పాటుకాబడ్డ ఆరు "జోను"లలో, ఆయా జోన్‌లలో ఉన్న జిల్లాలమధ్య విరివిగా ధాన్యం ఒకచోటనుండి ఇంకొకచోటికి తీసుకుపోవటానికి వర్తకులకు, ఇతరులకుకూడ సదుపాయాలు ఏర్పాటుకావాలి. అంటే ధాన్యంసరఫరాకు రైల్వేవాగనులు, లారీలు, మొదలైనవి విరివిగా ప్రభుత్వం ఏర్పాటుచేయాలన్నమాట. ఇవన్నీకాక బీదజనానికి ధాన్యం సరసమైన ధరలకు దొరికేటట్టుగా 'సరసపుధర

దుకాణాలు' ఎక్కడ అవసరమైతే అక్కడ ఏర్పాటుచేయడం, వాటిపైన ప్రభుత్వం సరియైన అజ్మాయిషీచేయడం జరగాలి. ఈ విధమైన కట్టుదిట్టాలు చేయబడ్డట్టయితే "డి కంట్రోల్" పద్ధతి జయప్రదంగా కొనసాగడానికి అభ్యంతరం ఉండదు.

మన దేశ ఆర్థికసౌష్టవం పెంపొందడానికి విదేశాలనుంచి తిండిగింజల దిగుమతులు ఎంతవరకు వీలైతే అంతవరకు తగ్గించవలసిన అవసరంఉంది. కంట్రోల్ ఉన్నంత వరకు, దేశంలో ఎంత ధాన్యం, ఇతర తిండిగింజలు పండుతున్నాయో, ఆహారకొరత ఎంతవరకు నిజంగాఉందో నిర్ణయించడం కష్టంగాఉండేది. ఇప్పుడు ఆ విధమైన సరియైన అంచనాలకు ఎక్కువ అవకాశాలు ఏర్పడవచ్చును. దానినిబట్టి ఎంతఎక్కువ ఆహారధాన్యాలను పండించడం అవసరమో తెల్సుకోడానికీ, దానికనుకూలంగా ఉండే విధానం నిర్ణయించడానికి వీలుంటుంది.

పైన చెప్పబడ్డ షరతులన్నీ చాలవరకు ఆచరణలోకి వస్తాయని అనుకోడానికి అవకాశాలు ఎక్కువగా కన్పిస్తూండడం సంతోషకరం. ఇంకోముఖ్యవిషయం ఏమి టంటే: మద్రాస్ ప్రభుత్వం చేసిన నిర్ణయానికి కేంద్రప్రభుత్వంవారి పూర్తిఆమోదం ఉండటం. అంటే ఏవిధమైన క్లిష్టపరిస్థితులు కంట్రోళ్ళ ఎత్తివేతవల్ల ఏర్పడ్డప్పటికీ, వాటిని ఎదుర్కోవడంలో రాష్ట్రప్రభుత్వానికి కేంద్రంయొక్క పూర్తిసహాయం ఉంటుం దని అనుకోవచ్చు. కేంద్ర ఆహారమంత్రి శ్రీ రఫీ అహమ్మద్‌కిద్వాయ్ రాజాజీ మంత్రి వర్గనిర్ణయాన్ని ఆమోదిస్తూ రెండువిషయాలలో ఆ మంత్రివర్గం ఇచ్చిన హామీలను బట్టి తాము కంట్రోళ్ళ ఎత్తివేతకు అంగీకరించామని చెప్పారు. మొదటిది: రాష్ట్రంలో ధాన్య సేకరణ సిబ్బందిని కొంతకాలందాకా ఉంచడానికి అంగీకరించడం; రెండవది: తిరిగి ఏ పరిస్థితులలోనైనా ధాన్యసేకరణ అవసరమైతే ఇంతవరకు ధాన్యానికి ఇస్తూ ఉండిన ధరకంటె ఎక్కువ ధర ఈయుమని హామీ ఇవ్వడం. ఈ రెండు షరతులకు రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకంగా ప్రవర్తించకుండా ఉండేటట్లు చూసే బాధ్యత రాష్ట్ర ప్రజలందరిపైనా ఉంది. ముఖ్యంగా భూస్వాములపైన, వర్తకులపైన ఈబాధ్యత ఎక్కువగాఉందని చెప్పవలసి వస్తూంది. ఇప్పటికి కంట్రోళ్ళుఎత్తివేసి మూడువారాలు కావస్తూన్నవి. ఈ కాలంలో కొంతవరకు ఆహారధరలు హెచ్చటం, విరివిగా బియ్యం దొరక్కపోవడం అక్కడక్కడ చూస్తూన్నప్పటికి, మొత్తంమీద ప్రజలు ఆ నిర్ణయాన్ని

పాల్గొనుటకు అంగీకరించినట్లు, వార్తలవలన తెలుస్తూంది. మద్రాస్‌రాష్ట్రంలో కంట్రోళ్ళుఎత్తివేసిన 15 రోజులతరువాత బీహారులోకూడ ఆ విధానం ప్రవేశపెట్టబడింది.

* * *

కొరియాయుద్ధ విరమణసమస్య ఇప్పటికి ఆరునెలలకుపైగా తెగుతెంపు లేకుండా సాగుతోంది. సంధిరాయబారాలలో ఉత్తరకొరియా, అమెరికా లేక సంయుక్త రాజ్యసభ ప్రతినిధులమధ్య వాగ్యుద్ధముతప్ప సంధి ఏర్పాటుచేయుటకు సరియైన వాతావరణం ఇంతవరకు ఏర్పడిఉండలేదు. ఈ స్థంభనకు ప్రస్తుతం రెండు ముఖ్య కారణాలు కన్పిస్తున్నాయి. మొదటిది: యుద్ధఖైదీల విడుదలలో సంయుక్తరాజ్యసభ ప్రతినిధులు పెట్టిన షరతులు. వాటిప్రకారం సంయుక్తరాజ్యసభ సైన్యముల చేతులలో ఖైదీలుగాయున్న 170000 కమ్యూనిస్టు యుద్ధఖైదీలలో సుమారు ఒక లక్షమంది తమ తమ దేశాలకు పోవటానికి ఇష్టపడడంలేదు. కాబట్టి వారిని విడుదలచేయుటకు తాము నిరాకరిస్తున్నామని, తక్కిన 70000 ఖైదీలను 12000 సంయుక్తరాజ్య సమితి సైనికఖైదీలకు బదులుగా విడుదలచేయుటకు సిద్ధంగా యున్నామని. ఈ షరతు కమ్యూనిష్టుపక్షమువారు అంగీకరించక మొత్తం కమ్యూనిస్టుఖైదీలనందరిని తమకు వాపసుచేయమని పట్టుపట్టుకుకూర్చున్నారు. ఈ విషయంలో రెండుపక్షాలకు ఎట్టి, ఏవిధమైన అంగీకారం కుదురునో చెప్పడం కష్టంగాఉంది. అట్టి అంగీకారం కుదరక పోతే ఇప్పటి ప్రతిష్టంభన చిరకాలం ఉండిపోవచ్చు.

ఇంక రెండవది: కమ్యూనిష్టుపక్షంవారు అమెరికాపై కొరియాలో విషక్రిమిబాంబులను ప్రయోగించారనే అభియోగం తీసుకురావడం. ఈ అభియోగం కేవలం నిరాధారమైనదనీ, తామెప్పుడును క్రిమిబాంబులను ప్రయోగించియుండలేదనిన్నీ,కమ్యూనిస్టులు క్రిమిబాంబులను ప్రయోగించడానికి ఉద్యమించి, దానికి ఆధారంగా ఉండటానికి ఈ అభియోగం తీసుకువచ్చారనీ అమెరికా వాదన.

ఈ రెండుపక్షాల పరస్పర విరుద్ధవాదనలలో ఏది నిజమో, ఏది నిజముకాదో నిర్ణయించడం అవసరం. దానికై అమెరికా అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంఘమువారి యాజమాన్యాన పర్యాప్తుచేయించడానికి తాను అంగీకరించుతున్నానని ప్రచురించింది. అదీకాక నిజంగా ఉత్తరకొరియాలో క్రిమిబాంబుల ప్రయోగంవలన ప్రజలలో జబ్బులు ప్రబలియున్నట్లయితే వారికి వైద్యసహాయం చేయడానికి, అసలు క్రిమిబాంబుల

ప్రయోగంవలన ఆ జబ్బులుకలిగాయో లేదో పరీక్షచేయడానికి సంయుక్తరాజ్యసమితి ఉపసంఘం ఆయిన ప్రపంచ ఆరోగ్యసమితివారు బాధ్యత వహించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

ఈ విధంగా నిష్పాక్షికమైన పరిశోధనకు కమ్యూనిష్టుపక్షం ఎందుకు అంగీకరించటం లేదో దురూహ్యం. ఒకవిషయమై ఒక దేశంపైన అభియోగం తెచ్చినప్పుడు దాని నిజానిజాలను నిష్పాక్షికంగా విచారించడం, ఫలితాన్ని ప్రపంచానికి వెల్లడించడం చాల అవసరమని వేరే చెప్పనవసరంలేదు. ఈ విషయంలో ఏర్పడ్డ ప్రతిష్టంభనవలన ఏ పక్షానికిచెందని ఇండియావంటి దేశం దానినిగురించి ఒక ఇదమిద్ధమనే నిర్ణయానికి రావడం కష్టమవుతుంది. ఇదికాక వివిధదేశాలకు చెందిన 20 మంది నోబెల్ బహుమానం పొందిన డాక్టర్లు, శాస్త్రపరిశోధకులు ఉత్తరకొరియాలో క్రిమిబాంబుల ప్రయోగం గురించి తమ అనుమానాన్ని స్పష్టంగా వ్యక్తీకరించడంతో, ఈ సమస్య మరింత క్లిష్టమౌతోంది.

పోగా కోజీయుద్ధఖైదీల క్యాంపులో జరిగిన విషయాలనుగురించి, ప్రపంచమంతటా ఆందోళన బయలుదేరటమేకాక, బ్రిటిష్ రక్షణశాఖామంత్రి అలెగ్జాండర్ ప్రభువు ప్రత్యేకంగా పరిస్థితులను చూడ్డానికి కొరియా,జపాన్‌దేశాలకు వెళ్ళాడు. అతని అభిప్రాయంలో అక్కడ జరిగిన దుర్ఘటనలలో అమెరికాకెట్టి బాధ్యతలేనట్లు ప్రకటించబడ్డది. కమ్యూనిస్టుఖైదీలు తమలో కొంతమందిని బలవంతంగా చంపినట్లు ప్రచురింపబడిన వార్తలలో ఎంతవరకు నిజముందో తెలియదుకాని, కమ్యూనిస్టుఖైదీలలో చాలామంది తమతమ దేశాలకి పోవటానికి ఇష్టపడటంలేనట్లుమాత్రం స్పష్టమౌతోంది. ఈలోగా సంయుక్తరాజ్యసమితివారి చేతులలో ఉన్న యుద్ధఖైదీల క్యాంపులలో పరిస్థితులు గమనించడానికి నిష్పాక్షికమైన మధ్యవర్తులను అమెరికా ప్రెసిడెంట్ ట్రూమన్ ఆహ్వానించాడు. ఈ ఆహ్వానము చేయబడ్డ దేశాలలో ఇండియా, పాకిస్తాన్ దేశాలుకూడా ఉన్నాయి. ఇండియాప్రభుత్వం ఈ విధమైన మధ్యవర్తిత్వంకు అంగీకరించేదీ, లేనిదీ ఇంకా నిర్ణయం అవలేదు.

కొరియాయుద్ధం ఎంత త్వరలో ముగిస్తే అంత అందరికీ సంతోషంగా ఉంటుంది. కాని, అట్టి అవకాశం ఎక్కువగా ఉన్నట్లు కన్పించదు. పేరుకు ఉత్తరకొరియా,

సంయుక్తరాజ్యసమితుల మధ్య ఈ యుద్ధం జరుగుతున్నప్పటికీ, నిజానికి అమెరికా, బ్రిటన్ మొదలైన కొన్ని ముఖ్యదేశాలకూ, రష్యా, చైనాలకుమధ్య ఈ యుద్ధం జరుగుతోందని చెప్పవచ్చును. ప్రపంచంలో వివిధదేశాలమధ్య ఏర్పడ్డ కక్షలు, వాటి విధానాలు కొరియాయుద్ధ సందర్భంలో స్పష్టంగా కన్పిస్తున్నాయి.

* * *


ప్రపంచంలో వివిధప్రాంతాల్లో వలనసామ్రాజ్య సిద్ధాంతానికి, దేశజాతీయ స్వాతంత్ర్య సిద్ధాంతానికిమధ్య పోరాటంజరుగుతున్నట్లు ఈజిప్టులోను, ఇరాన్‌లోను, టునీసియాలోను వియట్‌నామ్‌లోను జరిగేసంఘటనలనుబట్టి అర్థమౌతోంది. వియట్‌నామ్‌లో ఫ్రెంచ్ సామ్రాజ్యవాదులు ఆ దేశ జాతీయవాదుల స్వాతంత్ర్యపోరాటాన్ని అరికట్టడానికి ఇప్పటికి 3, 4 ఏండ్లనుండి తీవ్రప్రయత్నం చేస్తున్నారు. వియట్‌నామ్‌లో ఏర్పడ్డ పరిస్థితులను పురస్కరించుకొని కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాన్ని, ఆదేశాల్ని ఆ దేశంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. మేము వియట్‌నామ్‌జాతీయ స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి అణచడానికి ప్రయత్నించడంలేదు, కాని కమ్యూనిస్టు ప్రాబల్యాన్ని అణచడానికిమాత్రమే చూస్తున్నామని ఫ్రెంచివారు తమ మిలిటరీ విధానాన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

దీని నిజానిజాలు ఎట్లాఉన్నప్పటికీ ఆ దేశంలో చెలరేగుతున్న యుద్ధంమాత్రం త్వరలో ఒకదరికి వచ్చే అవకాశం కన్పించదు. ఈ యుద్ధంలో ఎక్కువడబ్బు ఖర్చు పడడంవలన ఫ్రాన్స్‌దేశప్రభుత్వం సంకటస్థితిలోపడింది. వారిప్రతినిధి ఒకరు ఈమధ్య అమెరికాదేశంకుపోయి, ఆదేశప్రభుత్వాన్ని డబ్బుసహాయం, ఇతరవిధములైన మిలిటరీ సహాయం చేయవలసినదని అర్థించాడు. ఇట్టిసహాయం అమెరికా ఎంతవరకు చేయగలదో, చేస్తుందో చెప్పడం కష్టం. ఆ సహాయంకాని త్వరలో రాకపోతే ఫ్రాన్స్, వియట్‌నామ్‌లో తన విధానాన్ని పూర్తిగా మార్చుకోవలసిఉంటుంది.

ఇది ఒకవిధంగా సంతోషించవలసిన విషయమేకాని, దానిఫలితంగా వియట్‌నామ్‌లో కమ్యూనిస్టు ప్రాబల్యం హెచ్చినట్లయితే, అది దక్షిణఏసియాప్రాంతానికి ముందు ముందు ముప్పుగా పరిణమిస్తుందనే భయంమాత్రం లేకపోలేదు. దీనికి విరుగుడు అమెరికావంటి గొప్పదేశాలు ఫ్రాన్స్‌కు వెంటనే వియట్‌నామ్‌కు స్వాతంత్ర్యమునిచ్చి

ఆ దేశంనుంచి వెళ్ళిపోవడం మంచిది, శ్రేయస్కరముఅని సలహానీయడమే. వియట్‌నామ్‌కాని స్వాతంత్రదేశమైనట్లయితే, ఆ దేశంలోని జాతీయవాదులకు బలంచేకూరి, వారు తమదేశాన్ని రక్షించుకోవడానికి అన్నివిధాల తీవ్రప్రయత్నాలు చేసుకోడానికి సంసిద్ధులౌతారు. ఇప్పుడు వియట్‌నామ్‌లో 10 లక్షలకుపైగా బలంగల ఫ్రాన్స్ తయారుచేసిన సైన్యం సిద్ధంగా ఉంది. ఆ సైన్యం జాతీయనాయకుల అధికారం క్రిందకు వచ్చేఎడల ఆ దేశాన్ని కమ్యూనిష్టుముప్పునుండి తొలగించడానికి వారు తమ శాయశక్తులా పోరాడి విజయంపొందడానికి చాల అవకాశాలున్నాయి.

కలోనియల్ పద్ధతిలో ఉండే పరిస్థితులకీ, జాతీయావేశంతో నిండిన స్వదేశభక్తి సిద్ధాంతానికీ ఉండే ఈ భేదం సామ్రాజ్యకాంక్షగల దేశాలు గ్రహించడం చాల అవసరం. ఇట్టిదేశాలు, ఈమధ్య పండిట్ నెహ్రూ సంయుక్తరాజ్యసమితి పనినిగురించి వ్యాఖ్యానిస్తూ చెప్పినమాటలు జ్ఞాపకముంచుకోవాలి. ఆయన చెప్పిందేమిటంటే: ఇప్పటి మోస్తరుగా కొన్ని పెద్ద బలమైనరాజ్యాలు కమ్యూనిజమ్‌ను అణచే పేరిట తమ సామ్రాజ్యాలను బలపర్చుకోడానికి ప్రయత్నిస్తూ ఉంటే, సామ్రాజ్యసిద్ధాంతానికి వ్యతిరేకంగా ఉండే ఇండియావంటి దేశాలకి సంయుక్తరాజ్యసమితిలో సభ్యులుగా ఉండటం కష్టమౌతుందని. సంయుక్తరాజ్యసమితి ఒకవంక శాంతిని, ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తూన్నదని ప్రకటిస్తూ వేరొకవంక దానిద్వారా సామ్రాజ్యతత్వాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించడం దానిలో సభ్యులగు కొన్ని ముఖ్యరాజ్యాలకు తగనిపని. అమెరికాదేశంకూడా, ఫ్రాన్స్, వియట్‌నామ్‌లో కమ్యూనిజమ్‌ను ప్రతిఘటిస్తోందనే వాదనపై ఆ దేశచర్యలన్నింటిని సమర్థించడానికి పూనుకోకుండాఉండటం అవసరం. తన సహాయం అర్థిస్తూన్నఫ్రాన్స్‌తో ప్రజాపరిపాలనాసూత్రంకు వ్యతిరేకంగా ఏ కార్యక్రమం చేయరాదని అమెరికా స్పష్టంచేయవలసి ఉంది. —చాణక్య






"అమ్మా....అమ్మా...."

"..............."

"అమ్మా....ఏంటే ఆ మంట?"

దొడ్లోనుంచి వచ్చిన తల్లి, కిటికీలో కూర్చొని దూరంగాఉన్న శ్మశానంలోని మంటను తెప్పలువాల్చకుండా చూస్తున్న కొడుకును చూసి తెల్లపోయింది.

"ఛా....పద...." అని వాడి చెయ్యి పుచ్చుకుంది.

"అబ్బ....ఉండవే....ఏంటే....ఆ...."

"ఉహు....ఏమిట్రా....నీకెందుకీ గొడవ....పద....మామ్మ దొడ్లో జపం చేస్తున్నారు....బెల్లంపెడతారు పద...."

"అబ్బ....నేను....రాను....చెప్పవే.... అదిగో ఎలా లేస్తోందో మంట...."అనివాడు కిటికీ చువ్వలకు అంటిపెట్టుకొని ఉన్నాడు.

సంధ్యచీకట్లో నెత్తురు చిమ్మినట్లు భగ్గుమంటున్న జ్వాలలనుచూచి తల్లి "రా....నాయనా....రా" అంది.

"వస్తాగా....మరి చెప్పు...."

"మరి ఆ వీధిలో అబ్బాయి చచ్చిపోయాడు గదూ...."

"చచ్చిపోయాడా....అయితే మంటెందుకే?"

"నా ప్రాణం తీయకురా...అతను స్వర్గానికి వెళ్ళాడు."

"ఎక్కడే అమ్మా....స్వర్గం...."

"ఎక్కడో....ఎందుకురా ఈపాడు ప్రశ్నలన్నీ...."

"స్వర్గానికివెళ్తే ఈ మంటెందుకే.... చూడు... పోలాయ్‌వేసే చలిమంటకన్న ఎంతపెద్దదో...."అని మధు, చేతిమీదికి వచ్చిన చీమను చిటుక్కున నలిపేశాడు. తల్లి మరొకసారి బతిమాలింది. ఉహు. వాడు కదలనన్నాడు.

"ఒక తోయిలంపెట్తాగా....మానాయన నే చెప్పినమాట చక్కగా వింటాడు" అని బుజ్జగించింది తల్లి.

"ఏమిటే....అమ్మా....ఆ ఏడుపులు...."

---

వేలూరి సహజానందం

---

ఉండి, ఉండి ఆవతలవీధి నుంచి పొంగుకుంటూ వస్తున్న ఏడుపు కూడా కుర్రాడి చెవినపడింది. ఏమిటీ ఈనాటి సాయంకాలం వీడికీ జిజ్ఞాస?

"పులుసులో బాగా బెల్లంవేశాను.... రా....చక్కగా.... కలిపి పెట్టా...."

"ఊహు....ఎందుకే ఏడుస్తున్నారు?"

"మీ మామ్మ జపమైనట్టుంది.... ఉండు....ఆవిడనే పంపిస్తాను" అంటూ వెళ్ళిపోయింది తల్లి.

ఎగురుతూ కిటికీదగ్గరకు వచ్చిసతూనీ గను పట్టుకొని,కుర్రాడు కిటికీచువ్వల్లోంచి శ్రద్ధగా చూస్తున్నాడు జ్వాలలకేసి.

"మధూ....మధూ....లే...."

"మామ్మా....మామ్మా...."

"ఇదిగో నాయనా....బెల్లం....ఇవ్వాళ తులసికోటదగ్గరకు వచ్చి బెల్లం తీసుకో లేదేం?"

మామ్మ ఇవ్వబోయిన బెల్లపుముక్కను చటుక్కున నోట్లో వేసుకున్నాడు. తూనీగ రెక్కలువిరిగి కిందపడింది.

"మామ్మా....ఏంటే....ఆ మంట...."

"..........."

"మామ్మా....మామ్మా....ఏంటే ఆ మంట...."

"ఏమిట్రా పాడు ప్రశ్నలు....పద అన్నానికి...." అని గదమాయించింది.

మామ్మ స్వరం ఒక్కమాటుగా పెటుకుగా మారటం మధు గమనించాడు. ఆవిడ నడుముకు చుట్టేసుకొని, "ఎందుకే వాళ్ళు ఏడుస్తున్నారు?" అని అడిగాడు.

"వాళ్ల అబ్బాయి చచ్చిపోయాడు కదూ!" అంది మామ్మ.

"అబ్బాయిలు చచ్చిపోతారా? ఏం మామ్మా!"

"..........."

"అయితే నేనూ చచ్చిపోతానా?"

వాడేదో కొత్తవస్తువును అకస్మాత్తుగా చూసినట్టు, కళ్ళు పెద్దవిచేసి, ఈ ప్రశ్న అడిగాడు.

"అయితే నేనూ చచ్చిపోతానా? చెప్పు మామ్మా!"

"ఏమిట్రా....బాబూ!" అని తటాలున మధును ఎత్తుకొని తల్లి గుండెకు అదుముకుంది.

దొడ్లో పనిచేసుకుంటున్న తల్లి అక్కడకు ఎప్పుడు వచ్చిందో ముత్తవతల్లి చూడలేదు.

"ఎందుకే....అమ్మా....ఏడుస్తావ్.... నేనూ చచ్చిపోతానా?"

వాడినోటపై చెయ్యి గట్టిగా పెట్టి, తల్లి దుఃఖాన్నంతా మింగుకుంటూ దొడ్లోకి వెళ్లింది.

"ఏమిటో...వాడు జడుసుకుంటాడు.... ఏమిటా ఏడుపు....ఎందుకు....కుర్రకుంక తెలియక ఏదో పిచ్చిప్రశ్న అడిగితే...."

అత్తగారు మాట్లాడుకుపోతున్న ఈ ఓదార్పు సందేశం మధుతల్లికేమీ వినబడ లేదు.

ఆమెకు ఆ బాలుడి ప్రశ్నలే వినబడుతున్నయ్. గింగురుమని ప్రతిధ్వనిస్తున్నయ్.

"అల్లపుపచ్చడి బాబూ....నాయనగా నీ కిష్టమైన పచ్చడేగా...." అని బామాలు కుంది తల్లి.

"ఊహు...."

"పోనీ కందిపొడి వేస్తా...."

"ఊహు...."

"పోనీ పెరుగు పోయించుకో...."

ఏవో నాలుగుమెతుకులు నోట్లో వేసుకొని, కంచంఅంతా చిందరవందరచేసి లేచాడు మధు. రంయ్‌మని పరుగెత్తుకుపోయి కిటికీలో కూర్చున్నాడు.

గబగబా కంచం ఎత్తేసివచ్చి, తల్లి పక్క వేసింది.

"పక్కవేశా....నాన్నా....రా...."

"జవాబులేదు.

"రా....బాబూ....పడుకో...."

జవాబులేదు.

తల్లి వెళ్ళేప్పటికి వాడింకా చువ్వలను పట్టుకొనే చూస్తున్నాడు.

"మంటలేచేం అమ్మా...."

తల్లి వాడిని బలవంతంగా ఎత్తుకొని తీసుకువచ్చి పడుకోబెట్టింది. వాడేం మారాం చేయలేదు. ఏం ప్రశ్నలు అడగలేదు.

"అదేమిట్రా....అలాచూస్తావ్?" అంది తల్లి.

అంతే....అదేచూపు....మాటలేదు....

భగ్గుమని ఆకర్షించిన జ్వాలలు మళ్లీ అంధకారమవటం మధుకు ఏం అర్థం కాలేదు. ఆ జ్వాలలను గురించి అన్ని ప్రశ్నలు అడగాలనిపించి, అడిగినా, ఈ చీకటిగురించి ఏదో అయోమయం తప్ప, ప్రశ్న వేయాలనిపించలేదు. ఎదురుగుండా తల్లే కూర్చునిఉన్నా, వాడికి అక్కడ జ్వాలలుమండి, చల్లారి చీకటైనట్టు ఎందుకో తెల్లపోయి చూస్తున్నాడు.

"ఏం నాయనా అలా చూస్తున్నావు"

"..............."

"భయంగా ఉందా బాబూ!"

"......."

అదే చూపు.

"అత్తగారూ....మధుకు కొంచెం దిష్టి విభూతి పెట్టండి...."

"ఏమిటే నీకంగారు...నిక్షేపంగా పడుకుంటాడు....వుండు...."

తల్లి తప్పుకుంది....ముత్తవతల్లి వచ్చి, కూర్చుంది. వాడిమీద చెయ్యివేసేప్పటికి, వాడు వులిక్కిపడ్డాడు.

"నేను....నాయనా....మామ్మను...."

వాడు కొత్తవాళ్ళను చూసినట్టు చూశాడు.

"ఒసే.... ఒసే....నువ్వురా .... నేదిష్టి విభూతి పెట్టా....జడుసుకున్నాడు కుర్రవాడు" అని పిలిచింది కోడల్ని అత్తగారు.

గుప్పిట్లో వుప్పుతెచ్చి, తల్లి వాడికి దిష్టితీసింది. అప్పటికే వాడికళ్లు మూతలు పడ్డయ్.

కిర్రుకిర్రు చెప్పులమోత వినబడగానే, "అబ్బాయి పొలంనుంచి వస్తున్నట్టున్నాడు....కంగారుపడకు" అని అత్తగారు కోడలికి ధైర్యంచెప్పింది.

"ఏమిటి?" అని అడిగాడు రామయ్య

జరిగిందంతా చెప్పింది భార్య.

"సరేలే....వాడి కుర్రాడి ప్రశ్నలకు నీ భయమేమిటి.... వెళ్ళి పనిచేసుకోండి. హాయిగా పడుకుంటాడు."

మధు మంచి నిద్రపోతున్నాడు.

భోజనమయాక, రామయ్యవచ్చి కొడుకును చూసుకున్నాడు. వాడు నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

"తాపీమేస్త్రి వచ్చాడా?"అని అడిగాడు.

భార్యకు వంటింట్లోకి ఈప్రశ్న విన బడిందిగాని జవాబురాలేదు.

"నాగన్నవచ్చి కూలీలవిషయం చెప్పాడా?"

ఊహు....దీనికీ జవాబులేదు.

"రేపు డాబాకుపునాదులుకట్టటంఆరం భించాలి. తాపీమేస్త్రి పొరుగూరునుంచి వస్తాడు. పునాదిగోతులు తయారైనయ్."

"ఒసే....నిన్నే....కొబ్బరికాయలు తెప్పించావా ?"

అప్పుడే దేవుడ్ని తలుచుకొని, తులసి కోటముందు తల్లి కొబ్బరికాయ కొట్టింది.

అతను విసుక్కున్నాడు.

భార్య వచ్చింది.

దగ్ధగృహంలా ఉంది ఆమెముఖం.... కళ్ళలో ఎక్కడా జీవంలేదు.

"ఛా....ఏమిటి...నీ కేమైనా మతి పోయిందా ?" అన్నాడు.

ఆమె కళ్ళుతుడుచుకొని, "మీరు వెళ్ళి శాస్తుర్లుగారిని పిలుచుకురండి...." అంది.

"అబ్బాయి....దానికి భయంగాఉంది. పోనీ వెళ్ళి పిలుచుకురా ఒకసారి "అంది తల్లి. అతనికేమీ అర్థంకాలేదు.

"కాస్సేపు, కాస్సేపటికి ఉలిక్కిపడు తున్నాడు....పిలిస్తే పలకడు"అంది భార్య. అతనువెళ్ళి మధుచెయ్యిచూశాడు.

"వాళ్లబ్బాయి పోయిన నక్షత్రం మంచిదికాదు...." అని మూల్గింది భార్య.

"జ్వరంలేదు....ఏంలేదు...." అని అతను వైద్యుడిని పిలుచుకొనిరావడానికి వెళ్లాడు. వైద్యుడింత దిష్టివిభూతి ఇచ్చాడు. కాలికి, చేతికి తారాలు కట్టాడు. నిద్రభంగమై, మధు కాలితో ఆయన్ని తన్నాడు. మళ్ళీ నిద్రపోయాడు. వైద్యుడు వెళ్లిపోయాడు.

"ఏమిటండీ....ఇంత బండనిద్ర పోయాట్టండీ ఎప్పుడైనా ?" అంది భార్య

"చాలులే....వెళ్ళిపడుకో...."అన్నాడు భర్త.

తెల్లవారింది. తల్లివచ్చి మూడు, నాలుగుసార్లు చూసింది. మధు ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. కోడెదూడలు అంబాఅని దొడ్లో గంతులువేస్తున్నాయ్. తమ నేస్తంరాకపోయేప్పటికి అవి పెండం దాకా వచ్చి, గోలచేస్తున్నాయ్.

"మధూ....మధూ...పున్నాగపూలు తెచ్చుకుందాంరా" అని పిలిచాడు ఒడి స్నేహితుడు, సుధాకర్.

కళ్లునలుపుకుంటూ లేస్తున్న మధుకి కేక వినబడి, దుప్పటితోసేసి, రంయ్‌మని

వాడివెంట గుడిలోకి పరుగెత్తాడు. వాడి ముఖం పూర్ణిమా కాశంలా సంతోషంతో కలకలలాడిపోతోంది.

"ఒరే...ఒరే....నాయనా.... నెమ్మదిగా వెళ్లు. పరుగెత్తకు....'' అని తల్లి అరిచినా మధు విన్పించుకోలేదు.

తల్లి యెంతో సంతోషంతో పరుగెత్తుతున్న కొడుకును చూస్తూ వసారాలో నిలబడిపోయింది.

"నేను చెప్పలేదూ....నీభయంగాని'' అన్నాడు చుట్ట ముట్టిస్తూ రామయ్య.

ఆలస్యంగా వచ్చిన పనిమనిషి, "రత్తయ్య కొడుకు పండంటి కుర్రాడమ్మా.. ఉన్నవాడున్నట్టు కొయ్యబారిపోయాడు... తెల్లార్లు జాగారంచేశాం'' అని ఆలస్యంగా వచ్చినందుకు విన్నవించుకుంది.

రామయ్య తల్లికి గుండెమీంచి బరువు దింపినట్టుంది. ఆ చెడునక్షత్రపు మబ్బు మరొక యింటిమీంచి వెళ్లినందుకు ఆవిడ చాలా తృప్తిచెందింది. ఈ సంగతే కోడలకు చెప్పింది.

కాని కోడలు విన్పించుకున్నట్టులేదు. ఇందాకటి సంతోషమా ముఖంలో చిహ్నమాత్రంగాకూడా లేదు. అత్తగారు పనిదాని మీద గుమికీలుతీస్తోంది.

"వెధవచుట్ట'' అని పారేసి మరో చుట్ట ముట్టించిన రామయ్య, "అదేమిటే అలావున్నావ్?'' అన్నాడు భార్యకేసిచూసి.

చొక్కానిండా పున్నాగపూలు తెచ్చిన మధు, తల్లిముఖంలో సంతోషం లేకపోవటంతో నడుంకు చుట్టేసుకొని "అమ్మా...అమ్మా....'' అని మారాం చేస్తున్నాడు.

కాని ఆమెలో చలనంలేదు. ఒకే వొక కొడుకు వచ్చి కాళ్లకు చుట్టేసుకున్నా, కదలిక లేదు. ఆ ముఖంలో దిగులు, కళ్ళలో దుఃఖం పోలేదు.

భర్త అన్నాడు: "వాడు హాయిగా ఆటపాటల్లో కేరింతలుకొట్టుంటే,యింకానువ్వా రాత్రిలాగానే....ఏమిటే....ఆదిగులు''

మధు కోడెదూడను చూసి, పరుగెత్తబోయాడు. కాని తల్లి వాడిని బలవంతంగా చేతుల్లోకి తీసుకొని గుండెకు అదుముకుంది.

"ఎందుకమ్మా .... యేడుస్తున్నావ్ ?'' అని తల్లికళ్లలోకి చూశాడు. వాడికా కళ్లలో ఏం అగపడిందో మనకుతెలియదు. కుప్పిగంతులువేస్తున్న కోడెదూడ అతనికి కన్పించలేదు. పున్నాగపూలు గాలికి యెగిరిపోతున్నా, అవి గుర్తురాలేదు. వీధిలోని యేడ్పులూ వినబడలేదు. వాడి కళ్లలోకూడా నీరుబికింది. మెల్లగా తల ఆమె భుజంపై వాల్చుకుని, చేతులతో తల్లిని గట్టిగా పట్టుకున్నాడు.

"ఇంకా కూలీలు రాలేదు'' అనుకుంటూ ఇంటిఖామందు, డాబాపునాదుల తనిఖీకి వెళ్లాడు. ఓపక్కన పనిదాన్ని శాపనార్థాలుపెట్టూ, మరొకపక్కన జపమాల తిప్పుతూ తులసికోటముందు కూర్చుంది ముసిలావిడ.






"ఏంచేయమంటావేఅత్తయ్యా ?" అన్నది కాంతం. సుందరమ్మ యీజీచైర్లో విసుగ్గా అటూ—యిటూ కదిలింది. చదువుతూన్న భక్తవిజయాన్ని అయిష్టంగా మూసి, పక్కనవున్న ముక్కాలిపీట మీద పెట్టింది. కళ్లజోడు ముక్కుమీదకు లాక్కుంటూ కోడలివంక సాభిప్రాయంగా చూసింది.

కాంతం అదేప్రశ్నను కొంచెంగామార్చి అడిగింది. 'ఏంచేస్తే బావుంటుందే అత్తయ్యా?' అని. మళ్ళీ సుందరమ్మకు వొంటిమీద చీమలు పాకినట్టయింది. సంసార సాగరంలో తప్పకుండా తటస్థించే ఆయా సమస్యల్నుంచి తనకు విముక్తి ఎప్పుడా అనుకున్నది. కాంతాన్ని పెంచి పెద్దదాన్ని చేసిన మమకారం యిప్పట్లో తననుంచి దూరమైయ్యేట్టుగా లేదు. యీ వృద్ధాప్యంలో అయినా కృష్ణా రామా అనుకుంటూ కాలం వెళ్ళబుచ్చుదామంటే అన్నీ అభ్యంతరాలే ఎదురౌతున్నయ్. వండవలసిన కూరదగ్గరనుంచీ అందులో వేయవలసిన వుప్పు కారాల వరకూ; అన్నిటికీ కాంతం తనసలహాలు అడుగుతుంది.

"ఏవిఁటేఅత్తయ్యా,ఏవిఁటీ? "అన్నది కాంతం; యీసారి స్వరం కాస్తహెచ్చిస్తూ.

"నీయిష్టంవొచ్చిన దేదో వండు, నన్ను చంపక....!" అన్నది సుందరమ్మ, ఎంతో బాధ పడుతూన్నట్టు.

"నా తలకాయలా వుండి, నువ్వు చెప్పేది!" అన్నది కాంతం, కోస్తూన్న బీరకాయ ముక్కల్ని దబ్బాగిన్నెలోవేస్తూ.

సుందరమ్మ అప్పుడే నిద్రనుంచి లేచినట్టు పెద్దగా ఆవులించింది. "ఏమిటో నామోహం" అనుకున్నది స్వగతంలా.

"నేనడిగేది అక్కయ్య రమ్మంటూ రాసినసంగతి!" అన్నది కాంతం. సుందరమ్మ కళావెళపడింది. తను అనుమానిస్తున్నట్టుగానే, వున్నకొందికీ తనకు జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది. కూరకీ, కమలం రాసిన వుత్తరానికీ తను ముడిపెట్టింది. అంతా, పైపైపడుతున్న పెద్దతనం కలిగిస్తూన్న అపభ్రంశం!

"ఐతే మీఆయన వెళ్ళమన్నాడా? వొద్దన్నాడా?" అని అడిగింది సుందరమ్మ అదోలాంటి గొంతుతో తాపీగా.

"నిన్నే అడగమన్నారు!" అంటూ కాంతం మాటల్ని సాగదీసింది.

దాసరి సుబ్రహ్మణ్యం

"నన్నే అడగమన్నాడా! ఆఁ!" అంటూ ఆశ్చర్యాన్నీ, విసుగునీ వ్యక్త పరిచి "అయినా నేను తెలియక అడుగుతాను; నేనెవర్నే మీభార్యా — భర్తల మధ్య సలహాలిచ్చేందుకు?" అంటూ మాటల్ని పూర్తిచేసింది సుందరమ్మ.

"నువ్వెవరివో నాకేంతెలుసు? వెళ్ళిపోదడుగు!" అంటూ కత్తిపీటను పక్కకు నెట్టి, ద్రాక్షగిన్నెను చేతిలోకి తీసుకుని లేచి నిలబడింది కాంతం.

సుందరమ్మ మనస్సు చివుక్కుమన్నది. కాంతానికి అకారణంగా బాధకలిగించానని బాధ ఆమెను తృటిలో శాంతపరిచింది. నవ్వుతూ కాంతాన్ని సమీపించి, ముంగురులు దువ్వుతూ "మా చిట్టికి యింతలోనే ఎంతకోపం వొచ్చింది!" అంటూ అనునయించింది.

ఆనందంతో కాంతంమొహం విప్పారింది. చిలిపిగా మేనత్త చెవులు రెండూ పట్టుకొని "యిప్పటికైనా తెలిసిందా నువ్వెవరివో?" అంటూ సాగదీసింది.

"ఇక చాల్లే వదలవే....నువ్వు మరీ చిన్నపిల్లవౌతున్నావ్!" అంటూ సుందరమ్మ ముసిముసినవ్వులు నవ్వింది.

"ఐతే, యిప్పుడు చెప్పు; వెళ్ళమంటావా? వద్దంటావా?" అని ప్రశ్నించింది కాంతం. సుందరమ్మ తడబడింది.

'అదికాదే కాంతం, యిలాంటివన్నీ నన్నడిగితే ఎలా? మీరుమీరు ఆలోచించుకోవాలిగాని....' అన్నది.

"మీరుమీరు ఎవరూ?"

"నీకంతా ఎగతాళి! నువ్వూ మీ ఆయనానూ!"

"ఆయన నిన్నడగమంటూంటే...." అంటూ లేనికోపం నటించింది కాంతం.

సుందరమ్మకు వెంటనే ఏమిచెప్పేందుకూ పాలుపోలేదు. ఎంత అవసరమని తోచినా, భార్యాభర్తలు నిర్ణయించుకోవలసిన సందర్భాల్లో, బయటివారు కల్పించుకోవడం ఏమాత్రం మంచిది కాదనేదే ఆమె విశ్వాసం. తను కాపరానికి వచ్చిన రెండో సంవత్సరంలోనే తన, సాంసారిక జీవితం భగ్నంకావడానికి, తన అత్తగారి అనవసరపు ప్రమేయాలేనని ఆమెకు గట్టినమ్మకం.

"అబ్బాయిని ఆఫీసునుంచిరానీ మాట్లాడదాం" అన్నది సుందరమ్మ ఎటూ తేల్చి చెప్పలేక.

కాంతానికి యీపద్ధతంతా గందరగోళంగా కనబడింది. తన అక్కకు అంత పెద్ద ఆపరేషన్ జరిగి, ఏదోబ్రతికి బయటపడి, ఓ నెలరోజులు తోడుగా వుండిపొమ్మని రాస్తే, యిటు భర్తా, అటు మేనత్తా యీ విధంగా ఎటూ తేల్చకుండా కాలయాపన చేయడం సహించరానిదిగా కనబడింది.

"నేను రేపు పదిగంటల ప్యాసింజరుకు వెళ్తున్నాను. నువ్వూ — మీ అబ్బాయీ స్వతంగా వొండుకోవడమో, లేక ఏదైనా హొటల్లో చేరడమో చేయండి!" అన్నది కాంతం విసురుగా.

సుందరమ్మ కోడలిపంక బెదురు చూపులు చూసింది.

"నాదేంలేదనుకో, ఓవేళ మీ ఆయనకు కోపంవస్తే...." అంటూ ప్రారంభించింది సుందరమ్మ.

కాంతం మాటలమధ్యే అందుకుని "అంతకోపంవస్తే ధూపంవెయ్యి! సాంబ్రాణీ గుగ్గిలాలు పడమటింటిగూట్లో వున్నయ్" అంటూ ఓ విసురు విసిరింది.

మేనత్తా—మేనకోడళ్ల సంవాదం అప్పటికి అంతటితో ఆగిపోయింది.

*　　*　　*

సాయంత్రం ఆరు గంటలకు వాసుదేవరావు ఆఫీసునుంచి వచ్చాడు. వచ్చీరావడంతోటే సుందరమ్మా—కాంతం అతన్ని చుట్టుముట్టి ప్రశ్నలవర్షం కురిపించారు.

"యింతకీ, నువ్వు వెళ్లమంటావా వొద్దంటావా?" అన్నది సుందరమ్మ, "వెళ్లడమంటూ జరిగితే, నెలోరెండు నెల్లోవుండడమంటూ జరగొచ్చు. బాగా ఆలోచించి మరీచెప్పు!" అనికూడా హెచ్చరించింది.

వాసుదేవరావు ప్రశ్నార్థకంగా భార్యవైపు చూశాడు. కాంతం నొసలు చిట్లించి, పెదాలు అదోలా తిప్పుతూ "ఊహుఁ!" అంటూ తల మరోవైపుకు తిప్పుకున్నది.

"ఐతే కాంతానికి వెళ్లాలనే వుంది పిన్నీ!" అన్నాడు వాసుదేవరావు నవ్వుతూ.

"అక్కకు అంత జబ్బుచేసి నయమైరమ్మంటూ రాస్తే వెళ్ళాలని ఎవరికి వుండదు? ఎంత చోద్యమైన మనుషులండీ మీయిద్దరూ!" అన్నది కాంతం.

సుందరమ్మ హృదయానికి ఆ మాటలు ములుకుల్లా తగిలినై. పట్టరాని కోపంతో బుస్సుమంటూ లేచింది.

"నాకు నువ్వొహటీ, కమలం మరోటీ నేమే? అసలు ప్రథమంలో దాన్నే పెంచుకునేందుకడిగితే, మా అన్నయ్య నిన్ను నా నెత్తిమీది కెక్కించాడు. మీరెవరూ వెళ్ళనవసరంలేదు; నేనే వెళ్తా. నా అన్న కూతురు నాకేం పరాయిదా!" అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

వాసుదేవరావు ఎటూ తేల్చుకోలేక ఉక్కిరిబిక్కిరయాడు. కాంతానికి నిజంగానే తనమీద కోపంవచ్చిందనీ, సుందరమ్మకు యిదంతా తలనొప్పిగా పరిణమించిందనీ అనుకున్నాడు. తిండీ తిప్పల విషయంలో కొంత శ్రమపడవలసి వచ్చినా—కాంతాన్ని పంపడమే వుత్తమ పద్ధతని అతడు నిర్ణయించుకున్నాడు.

రాత్రి భోజనాలదగ్గిర వాసుదేవరావే ఆ విషయం కదిలించాడు. సుంధరమ్మ మౌనంగా వుండిపోయింది. కాంతం కాసేపు 'ఊ' కొట్టి—

"ఐతే, ఓ నెలరోజులపాటు వంటమనిషినెవర్నన్నా పిలవండి!" అన్నది.

వాసుదేవరావు, సుందరమ్మవైపు సాభిప్రాయంగా చూశాడు. సుందరమ్మ వెంటనే గ్రహించినట్టు తలవూపి—

"వంటమనిషెందుకే నేనుండగా?" అన్నది.

"నువ్వూ, మీ అబ్బాయీ భోంచేసేందుకు వున్నారనుకో; మరి....వంటచేసేందుకు వంటమనిషి కావొద్దా?" అన్నది కాంతం నవ్వుతూ.

వాసుదేవరావు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వాడు. "చూడు పిన్నీ! నిన్ను మూడు కాళ్ళ ముసలికింద కట్టేసింది కాంతం!" అన్నాడు.

"అవునబ్బాయ్, అవును! అదెన్నటికీ ముసల్దికాదులే! దేవుడిదగ్గిర్నుంచి వరం తెచ్చుకుంది" అంటూ కనుబొమలు ఎగరేసింది సుందరమ్మ.

ఆ రాత్రిరాత్రే అన్ని నిర్ణయాలూ జరిగి పోయినై. కాంతం తెల్లవారి పదిగంటల ప్యాసెంజరుకు ప్రయాణమయ్యేట్టూ, సాధ్యమైనంత తొందరగా తిరిగివచ్చేట్టూ, అందరూ అంగీకరించారు.

తెల్లవారి, భర్త వాసుదేవరావు ఆఫీసుకు వెళ్ళేందుకు తయారౌతూండగా, కాంతం ఆ యీ జాగర్తలన్నీ చెప్పింది.

"ఆరోగ్యం విషయంలో జాగర్తగా వుండండి! నేను లేనని ఏమీ దిగులు పడకండి! త్వరలోనే తిరిగివస్తాను.' అంటూ ప్రారంభించింది.

"నీవులేవని నాకేం దిగులూ! యిష్టం వచ్చినన్నాళ్ళు వుండిరా" అన్నాడు వాసుదేవరావు అదోలా గొంతుపెట్టి. కాంతం ఆ మాటలకు చుర్రుమంటూ లేచింది.

"అవున్లెండి! నేనులేనని మీకేం దిగులూ! సిగరెట్‌పెట్టా, పక్కన అగ్గిపెట్టా వుంటే అన్నీ వున్నట్టే" అంది.

"నిన్ను చేసుకున్న తరవాత సిగరెట్లు తాగడం ఎంత తగ్గించానో తెలుసా కాంతం! నాలుగు పెట్టెలు రోజూ కాల్చేవాణ్ణి, యిప్పుడు రెండున్నర పెట్టెలకంటే ఎక్కువ కాల్చుడంలేదు" అన్నాడు వాసుదేవరావు.

"ఆహా! ఎంత త్యాగంచేశారండీ నాకోసం. భార్యకోసం ఒకటిన్నర సిగరెట్టుపెట్టె త్యాగంచేశారంటే మాటలా! అందుకే ఐచ్చే జన్మలోకూడా మీకే భార్యను కావాలని ముక్కోటి దేవుళ్ళకు మొక్కుకుంటున్నాను."

కాంతంమాటలకు సుందరమ్మ కడుపుబ్బేలా నవ్వింది. కాని వాసుదేవరావు మాత్రం కాంతంమాటలకు చిన్నబుచ్చుకున్నాడు.

"చూడు పిన్నీ! తనకోసం యిన్ని చేస్తున్నా, ఎలా నిష్టూరాలు పలుకుతుందో!" అంటూ సుందరమ్మ సానుభూతికోసం అర్థించాడు.

"అంతేలే నాయనా! యీకాలపు పిల్లలకు భర్తంటే ఏమిటో సరిగా తెలీదు. నావరకు నన్ను, పడకగదిలో చుట్ట కాలుస్తూ వుమ్మొయ్యొద్దన్నందుకు, నా పళ్ళు చితకకొట్టారు దీని మామయ్య."

"ఆ రోజులు ఎప్పుడో పోయినైలేవే అత్తయ్యా! మీరంతా పూర్వకాలపు మనుషులు!" అన్నది కాంతం.

"మగాడు తల్చుకోవాలిగాని, ఆ పూర్వపురోజులు రావడం ఎంతసేపు!" సుందరమ్మ సాలోచనగా అన్నది.

"ఊహుఁ!" అంటూ వాసుదేవరావు, కాంతంవంక చూశాడు; నేనే గెలిచానన్నట్టు. "నాలుగైదురోజుల కోమారు వుత్తరంమాత్రం రాస్తూవుండు!" అంటూ నవ్వి బయటికి వెళ్ళాడు.

కాంతం గబగబా బట్టలూ అవీ సర్దుకోసాగింది. ఓ వైపున హడావిడిగా సామాను సర్దుకుంటూనే; అత్తతో యింటి విషయంలో, వాసుదేవరావునుగురించీ తీసుకోవలసిన జాగర్తలూ, శ్రద్ధలూ ఏకరువు పెడుతోంది.

"వంటచేసేందుకు పార్వతమ్మ వస్తే సరే వుంది; లేక ఎవరైనా ఐతే నువ్వు ఓ కంట కనిపెట్టి వుండాలత్తయ్యా" అంటూ సుందరమ్మను హెచ్చరించింది.

"వారికి ఆఫీసుటైము తప్పకుండా భోజనం అయ్యేట్టు చూస్తూండు; పాపం! నేను లేనని దిగులుపడతారు!"

"ఐతే, నన్నేం చేయమంటావే చిట్టీ?" అని నవ్వుతూ అడిగింది సుందరమ్మ.

"నువ్వు చేసేదేముందిలే అత్తయ్యా! ఒహటిమాత్రం చూశావూ!" అన్నది స్థాయి తగ్గించి కాంతం.

"ఏమిటే అది?" అంటూ కోడలి పక్కగా కూర్చుంది సుందరమ్మ. ఏదో రహస్యం చెప్పమన్నట్టు.

"ఏమీలేదే అత్తయ్యా! వారు మరీ దిగులుపడుతూన్నట్టు కనబడితే నాకు వెంటనే రాయి. వీలుకలిగించుకుని బయలుదేరి వచ్చేస్తాను."

"చూశావే కాంతం! నాకో, సందర్భం గుర్తుకొస్తోంది" సుందరమ్మ ఏదో పూర్వ స్మృతి కలిగినదానిలా పలికింది.

"ఏం సందర్భం?"

"యిప్పుడాలోచిస్తే, మీ మావయ్య సన్యాసుల్లో కలిసిపోవడానికి నేనే కారణ మేమో అనుకుంటున్నాను."

"ఎన్నడూ లేంది యిప్పుడెందు కొచ్చిందీ ఆ ఆలోచన నీకు?" కాంతం అనుమానిస్తూ అడిగింది.

"మీ అయన్నిగురించి నీకు కలిగిన సందేహాల్లాంటివి మీ మావయ్యనుగురించి నాకెన్నడూ కలగలేదు. ఓసారు రెండు నెలలు మీ మావయ్యనుంచి వేరుగా వుండవలసివచ్చింది; మీ అమ్మ కమలను కన్నప్పుడు. అప్పుడు మీ అమ్మకు బాగా జబ్బుచేసింది. తీరా రెండు నెలల తరవాత ఇంటికివచ్చేసరికి మీ మావయ్య యెలావున్నాడనుకున్నావ్?"

"ఏంజరిగింది అత్తయ్యా? అంతా కొత్తగా చెప్తున్నావ్?" అని అడిగింది కాంతం కౌతూహలంగా.

"అదేనే చెప్పాస్తున్నాను! నేను యింటికి వొచ్చేప్పటికల్లా మీ మావయ్య మరిద్దరితో కూర్చుని గంజాయిపడ్తున్నాడు. నన్నుచూసి తొణుకూ బెణుకూ లేకపోగా, పక్కనవున్న తాంబూరతీసుకుని 'ఏమిజన్మం బేమిజీవనమూ' అంటూ పాట ప్రారంభించాడు. అంతకాలం అక్కడా యిక్కడా వుండకుండా ఆయన పక్కనే వున్నట్టయితే, ఆ పాడు అలవాటు కలగడం, తరవాత సన్యాసుల్లో చేరి పోవడం జరిగేదేకాదేమో!"

"అంతా నీపిచ్చిలే అత్తయ్యా! మావయ్య అలా అయిపోవడానికి కారణం, మీ అత్త సాధింపుఅని లోగడ నువ్వు చెప్పావ్....యింకా చాలామంది కూడా అన్నారు."

కాంతం యీమాటలద్వారా అత్తను ఓదార్చడమేకాక, అవ్యక్తంగా తనలో తలలెత్తుతున్న అనుమానాలనూ, భయా లను దూరంచేసుకోవాలని ప్రయత్నిం చింది. కాని సుందరమ్మ మనస్సుమాత్రం ఏదో దుశ్శకునాన్ని పసికట్టినట్టుగా నానా యాతనా అనుభవిస్తూనేవుంది.

కాంతం ప్రయాణమై వెళ్ళిపోగానే, సుందరమ్మకు యిల్లంతా బావురు మన్నట్టుగా తోచింది. విషాదంగా పరిణ మించిన తన వైవాహికజీవితంలోని ఆ యా ఘట్టాలతాలూకు ఛాయలు మన స్సును చీకాకుపరచసాగినై. హృద యంలో యేదో ఆరాటం, అర్థంకాని భయాలూ, దుశ్శకునాలూ అల్లిబిల్లిగా అల్లుకుపోయినై. మనశ్శాంతికోసం, ఏకా గ్రత సాధించేందుకూ, 'భక్తవిజయం' చదవసాగింది.

సాయంకాలం ఆరింటికల్లా మామూలుగానే వాసుదేవరావు ఆఫీసునుంచి వచ్చాడు. బద్ధకంగావుందనీ, వొంట్లో బావోలేదనీ భోజనంచేయడం మానాడు.

ఆరాత్రి సుందరమ్మకు సరిగా నిద్ర పట్టలేదు. అన్నీ పీడకలలే. వాసుదేవరావు అచ్చుగా తనభర్తలాగానే గంజాయిదమ్ము లాగుతూ తంబురా మీటుతున్నాడు. పోతే పాటమాత్రం మరోటి. ఏదో యీమధ్య వచ్చిన సినీమా సన్యాసి పాడిన పాట.

నాలుగైదు రోజులు గడిచేప్పటికి వాసుదేవరావులో ఏదో మార్పు వచ్చినట్లు సుందరమ్మకు దృఢపడిపోయింది. ఎప్పుడూ కొరకొరలాడుతూ వుండడం, ప్రతిదానికీ విసుక్కోవడం స్పష్టంగా ఆమె గ్రహించగలిగింది. రాత్రి ఎనిమిది గంటలైనా కాకుండానే తలుపు గడివేసుకుని పడుకునేవాడు. లోగడలా రాత్రిళ్ళు అప్పుడప్పుడూ దగ్గడంకాని, సిగరెట్టు వెలిగించేందుకు అగ్గిపుల్ల గీయడంగాని సుందరమ్మకు వినబడడమే కరువైంది. అసలు రాత్రిళ్లు గదిలోవుంటున్నాడా లేక తనని నిద్రపోనిచ్చి ఎక్కడికైనా పోతున్నాడా అన్న అనుమానంకూడా సుందరమ్మకు కలిగింది.

కాంతానికి ఏమని వుత్తరంరాసేట్టు? ఇది సుందరమ్మకు చాలా గడ్డుసమస్యగా తయారైకూచుంది. ఓనాడు వుండబట్టలేకా, అనుమానరహితం చేసుకునేందుకూ వాసుదేవరావునే అడిగింది.

"అబ్బాయ్! కాంతానికి యేమని వుత్తరం రాయమంటావ్?"

"అందరూ బావున్నారని రాయండి!" అన్నాడు వాసుదేవరావు, నేలచూపులు చూస్తూ.

"వెంటనే బయలుదేరి రమ్మనమని రాయనా?"

"ఎందుకూ?" అంటూ వాసుదేవరావు మొహం చిట్లించాడు. సుందరమ్మకు పచ్చివెలక్కాయ గొంతున పడ్డట్టయింది. ఏదో వొహటి అనకతప్పదు గనక "నీకు వంట్లో బావుండడంలేదని రాస్తాను" అన్నది.

"నాకేం! దుక్కలా వుంటే!" అని నవ్వేశాడు. "నువ్వు రాసేదేదో రాయిపిన్నీ! నేనూ వీలైతే ఇవ్వాళే వుత్తరంరాస్తాను." అంటూ గదిలోకి వెళ్ళాడు.

మళసటిరోజున ఎంతో ఆలోచించి ఆలోచించి కాంతానికి వుత్తరంరాసింది సుందరమ్మ. ఎప్పుడూ దిగులుగావున్నట్టు కనబడుతున్నాడనీ, లోగడ యేనాడూలేని విసుగూ, చిరాకూ కూడా మామూలైపోయిందనీ, నువ్వే బాగా ఆలోచించుకోవలసిందనీ, అంతా నీయిష్టమనీ తెలియపరిచింది.

రెండోనాటికల్లా కాంతందగ్గిరనుంచి యింతపెద్ద వుత్తరం వచ్చింది. అక్క కమలం ఆరోగ్యవిషయంతోపాటు భర్త వాసుదేవరావును గురించికూడా చాలా చాలా రాసింది.

"నేను వచ్చేప్పుడే చెప్పానుగదా— ఆయన నేనులేకపోతే దిగులుపడతారని; అంతే జరిగింది! సరే, నేను ఓనెల రోజుల్లో వస్తాను. నువ్వుమాత్రం వేళకు

ఆయనగారికి తిండీ తిప్పలు అమరేట్టు చూడు. ఆరోగ్యవిషయంలో శ్రద్ధతీసుకో మనిచెప్పు...."వుత్తరమంతా ఇదేధోరణిలో నడిచింది.

సుందరమ్మకు మేనకోడలి తెలివి తేటలను సంతోషించాలో, యేడవాలో అర్థంకాలేదు. 'నేనే వెర్రిబాగులదాన్ననుకుంటే, నాకంటే వెర్రిబాగుల్ది' అనుకుని పూరటపడజూచింది.

సుందరమ్మ, వాసుదేవరావును వెయ్యి కళ్లతో కనిపెట్టి చూడసాగింది. రెండవ వారానికల్లా అతనిలో వచ్చిన పరివర్తన ఆమెను మరీ అనుమానాల్లో, అంతు తెలియని భయాల్లో మునకలు తీయించింది.

వాసుదేవరావు పూర్తిగా మారిపోసాగాడు. మందకొడిగా, దిగులుగా వుండడం పోయి, యిట్టే యీలలువేయడం, ఏవో సినిమాపాటలు పాడుతూండడం — అంతా హుషారు హుషారుమయంగా మారిపోతున్నాడు మనిషి.

ఈ కొత్తధోరణి సుందరమ్మకు గాభరా పుట్టించింది. తనుగాని, కాంతంగాని వూహించని సరిక్రొత్తధోరణి యిది. ఇప్పుడేం చేయాలి?

సుందరమ్మ అయోమయావస్థలో పడిపోయింది. తనకోడలి కాపరానికి యెవరో చిచ్చుపెట్టారనేది క్రమంగా ఆమె మనస్సులో దృఢపడసాగింది. లేకపోతే భార్య యింటిదగ్గరలేదనే దిగులుపోయి, యీ కేరింతాలూ, యీలపాటలూ ఏమిటి?

ఐనా అడిగిచూస్తే యేరకం జవాబు వస్తుందో అని వాసుదేవరావును ఓనాడు ఆఫీసునుంచిరాగానే అడిగింది "కాంతాన్ని రమ్మని రాద్దామా?"

"అంత తొందరేంవొచ్చె? అక్కడ అవసరంతీరితే అవే బయలుదేరివస్తుంది గదా!" అన్నాడు వాసుదేవరావు ఏమాత్రం తొణక్కుండా.

కొంపలంటుకున్నాయ్ అనుకున్నది సుందరమ్మ. తన అనుమానాలన్నీ నిజమైనట్టే భావించింది. కాపరానికి యెవరో చిచ్చుపెట్టినట్టే! లేకపోతే వాసుదేవరావు నుంచి అంత వుదాసీనమైన ధోరణిలో ప్రత్యుత్తరం వస్తుందా!

ఆరాత్రే వుత్తరం రాసింది సుందరమ్మ. తెల్లవారి పోస్టుచేయడానికి పంపేముందు మరోమారు చదివి మరీ చూసుకున్నది.

రెండోనాటికల్లా కాంతందగ్గిరనుంచి జవాబు వచ్చింది. తనకాపరం యెంత వొడిదుడుకుల్లో పడిందో గ్రహించానని అత్తకు తెలియపరిచింది. అంతగా తనని ప్రేమించినభర్త, తను యింటలేనందుకు దిగులుపడకపోగా, పుక్కిటిబంటి ఆనందంలో తలమున్కలయ్యేలా మునిగిపోతూ, మిడిసిపడుతున్నాడంటే యిక తన జీవితం భగ్నమైనట్టేననీ, భవిష్యత్తంతా మంటకలిసినట్టేననీ వాపోయింది. పరిస్థితి చెయిజారిపోకుండా చూడమనీ, తను ఆ రాత్రే బయలుదేరుతున్నాననీ, బహుశా వుత్తరంచేరేప్పటికే తనూ అక్కడికి రావొచ్చని తెలియపరిచింది.

కాని, ఆ పగలూ రాత్రిన్నూ దా కాంతం రాలేదు. సుందరమ్మ కడవ పోతగా యేడ్చింది. మేనకోడలు యిక యింటి ముఖం చూడలేక ఏ నుయ్యో గొయ్యో చూసుకుని వుంటుందని కుళ్ళి కుళ్ళి దుఃఖించింది.

మరనటిరోజు, యింకా చీకటి విడక ముందే యెవరో తలుపుతట్టిన శబ్దమై వులిక్కిపడి లేచింది సుందరమ్మ. తలుపు గడి తీసీతీయడంతోటే, బావురుమంటూ కాంతం అత్తను కావిలించుకుంది.

పడమటగదిలో పడుకున్న వాసుదేవ రావు ఆ యేడ్పుల ఢణగొణధ్వనికి కెవ్వు మంటూ లేచి వాకిట్లోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతణ్ణి చూసీచూడడంతోటే మూర్ఛపడబోయి, తెప్పరిల్లి అతనిపాదాల మీద పడిపోయింది కాంతం.


"అయ్యో! నన్నెంతో ప్రేమించారను కున్నాను! నా కాపరం....కాపరం...." అంటూ తల బాదుకోసాగింది.

"నాకేం తెలియడంలేదు కాంతం! యేమిటివంతా?" అని యెన్నిసార్లడిగినా వాసుదేవరావుకు, కాంతంనుంచి ఒకటే జవాబు "నాకాపరం....కాపరం!"

"ఏమైంది నీకాపరం? రైల్లో మర్చి పోయివచ్చావా?" అన్నాడు విసుగుపుట్టి వాసుదేవరావు.

"లేవండీ! యెవరో పాపిష్టిది మనిద్దరికీ యెడబాట్లు కలిగించాలని చూస్తోంది. నేను అడ్డంలేననేగదా మీకు అంత ఆనందం, ఆ యాలపాటలూను?"

యింత రాద్ధాంతానికీ, మూలకారణ మేదో ఆమాటలతో వాసుదేవరావుకు అర్థమై పోయింది. నవ్వుతూ సుందరమ్మకేసి



చూసి—"ఏంపిన్నీ! నే ననుకునేదేనా కాంతం అనుకునేది ?" అన్నాడు.

"ఏమోనాయనా! ఈ సంసారబాధల నుంచి యిక నాకు విముక్తికావాలి! నేనిక ఆట్టేకాలం బ్రతకను. ఏదో కృష్ణారామా అనుకుంటూ కళ్లు మూసుకుంటాను. ఇక అంతా మీరూ—మీరూ...." ఆపైన సుంద రమ్మకు మాటలు పెగలలేదు.

ఏడుస్తూ కాళ్లమీద పడివున్న కాంతాన్ని లేవనెత్తి బరబరా గదిలోకి యీడ్చుకు పోయాడు వాసుదేవరావు. "నీకు యీ అనుమానం యెవరు కలిగించారు?" అని నిలదీసినట్టు అడిగాడు.

"మీరే!" అంటూ కాంతం మళ్ళీకాళ్ల మీద పడబోయింది. వాసుదేవరావు గది ప్రతిధ్వనించేలా నవ్వి "నీకు మతి పోయింది కాంతం!" అన్నాడు. "అవు నండీ! అవును!" అంటూ తలవూపి, కళ్ల నీళ్ళు తుడుచుకున్నది కాంతం.

"నువ్వు యిక్కడ లేవనే దిగులులేక పోగా, పైపెచ్చు సంతోషపడుతున్నాననే గదా మీ యిద్దరూ యింత రాద్ధాంతం చేసింది? నా సంతోషానికి మూలకారణ మేమిటో నీకు తెలియాలంటే, గది అన్ని మూలలూ జాగ్రత్తగా చూడు!"

"గదిమూలల్లో కత్తులూ, కఠార్లూ లేవంటారు! అంతేనా?" అన్నది కాంతం.

"అదికాదు; సిగరెట్ పీకలు లేవం టాను! నీకోసం పెట్టెన్నరసిగరెట్లు త్యాగం చేశానంటూ, నువ్వు వెళ్ళేప్పుడు నన్ను అపహాస్యంచేశావ్. కాని యిప్పుడు పూర్తిగా త్యాగంచేశాను. నువ్వు వెళ్ళింతరవాత సిగరెట్ ముట్టితే వొట్టు. యింతా, నిన్ను సంతోషపెట్టేందుకు! అందుకే అంత సంతోషపడుతున్నది!!"


వాసుదేవరావు మాట పూర్తిచేసీ చెయ్యకముందే కాంతం గదిలోనుంచి బయటకు చెంగున దూకి

"అత్తయ్యా! అత్తయ్యా!" అని కేకలుపెట్టింది.

"విన్నానమ్మా!" అన్నది సుందరమ్మ నవ్వుతూ.

"ఏమిటీ?"

"నీకోసం మీ ఆయన చేసిన మహా త్యాగం సంగతి!"






ఏడుకొండలస్వామి దర్శనార్థం గోపుర ద్వారం మొదలు గర్భాలయంవరకూ భక్తులు శ్రేణిలో నిలబడ్డారు. స్వామి సమక్షాన చేరుకున్న ఒక్కొక్క భక్తుడూ తన్మయుడై వెనకాలవాళ్లసంగతి మరచి పోవటంచేత కాబోలు ఆ 'క్యూ' త్వరగా జరగటం అంటూ లేదు. అర్చకుడు తొందర చెయ్యటంబట్టి కాని, లేకపోతే ముందువాళ్ళు కదలక, వెనకవాళ్ళు వెనకనే పొద్దస్తమానం నిలిచిపోవలసి వుండేది. కాళ్లపీకుడుబాధ మరిచిపోవటంకోసం. మధ్య మధ్య, 'గోయిందా, గోయిందా' అని అరుస్తూ వాళ్ళు ఒక్కొక్క అంగుళమే ముందుకు జరుగుతున్నారు. జడ్జీ పురుషోత్తంగారూ, ఆయన బావమరిది వెంకట్రావూ ఆ శ్రేణిలోనే కొసని ఉన్నారు.

ఉన్నట్టుండి భక్తకోటిలో కలకలం బయల్దేరింది. 'కనకలత! కనకలత!' అన్నమాట ప్రతినోటా వెలువడి, జడ్జీగారూ, వెంకట్రావూ వెనక్కి చూశారు. వెంకట్రావు, 'ఔనయ్యోయ్ బావా, కనకలతే!' అంటూ ముఖం చేటంత చేసుకున్నాడు.

ఆ సినిమాతార రావటంతోనే ఆ 'క్యూ' చెదిరిపోయింది. మూడు ఝాములవరకూ స్వామిదర్శనం కాదనుకున్న పురుషోత్తంగారికి, ముందంతా ఖాళీ ఐపోయింది. 'రావోయ్ వెంకట్రావ్! అంతా అటుపోయారు గనక ఇప్పుడు మనం దేవుణ్ణి సావుకాశంగా చూసి రావచ్చు' అన్నారాయన. కాని వెంకట్రావు, 'ఇదుగో వస్తున్నాను' అంటూనే నిలబడిపోయాడు. దేవు డెక్కడికి పోతాడు గనక! తనకు వీలైనప్పుడు యెప్పుడో సావుకాశంగా వచ్చి చూచిపోయే వాళ్లందరికీ దర్శనం ఇవ్వటానికని ఆయన అక్కడే ఎంతకాలమైనా నిలిచివుంటాడు.

కనకలత అలాకాకుండా తటిల్లతలాగ ఇట్టే మాయంకావచ్చు! తెరమీదా గోడమీద బొమ్మల్లోనూ చూడ్డమేగాని ఇలాగ ముఖాముఖిని చూడటం పడుతుందా మళ్ళీని? కనుక, వెంకట్రావు మెల్లిగా, 'నలుగురుతోబాటు నారాయణా' అన్నట్లు తారవైపే పరుగెత్తేడు.

కనకలతచుట్టూ జనంమూగేరు. ఒక స్టూడెంటుకామోసు తన నోట్‌బుక్కు తీసి చొరవగా అందిస్తూ, 'ఆటోగ్రాఫ్ ప్లీజ్'

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

అన్నాడు. ఆమె ముసిముసి నవ్వులతో తన సంతకంచేసి ఇచ్చింది. దానితో తక్కిన విద్యార్థులందరికీ ధైర్యంవచ్చి ఆమె సంతకాన్ని అర్థించారు. ఆమె శ్రద్ధగా తన చేవ్రాళ్ళను వారికి దానం చేసింది. ఆమె కదిలి పోబోయేసరికి ఎవడో 'ప్లీజ్, ప్లీజ్ వన్‌మినిట్' అంటూ ప్రాధేయపడేసరికి ఆమె వెనక్కి తిరిగింది. వాడు చటుక్కుమని కెమెరాస్విచ్ నొక్కి 'థ్యాంక్స్' అన్నాడు. ముప్పదేళ్ళ యువకుడొకడు ఎనిమిదేళ్ల వయస్సుగల తన కుమారుణ్ణి భుజాలపైకి ఎక్కించుకుని చూపిస్తో, 'కనపడిందా?' అన్నాడు. మరొక్క భక్తుడు, ముందున్నవాళ్లన్ని కొంచెం తప్పుకోవలసిందని ప్రార్థించి, భార్యను, 'అదుగోనే; చూడు!' అన్నాడు.

జడ్జీగారు ఆ గుంపుదగ్గిరసా వెళ్లలేదు గాని, ఆ అదునులో దేవుణ్ణి చూసేసివద్దా మనుకున్నవాడల్లా ఆటువెళ్లక అక్కడే నిలపడిపోయి ఆ దృశ్యాన్నంతనీ ఆశ్చర్యంతో తిలకిస్తున్నారు. వెనకనుంచి ఎవరో పరుగెత్తి వస్తూన్నట్లు చప్పడై ఆయన అటు తిరిగేసరికి గర్భగుడిలోంచి తెల్లటి నామాలూ తిరుచూర్ణం ధరించిన నల్లటిమనిషి ఒకడు ఆ గుంపువైపే పరుగెత్తిపోతూ కనపడ్డాడు. 'ఎవరీతడు? వెంకటరమణమూర్తి కాడుగదా? ఏమో!' అనిపించింది జడ్జీగారికి. ఆయన మెల్లిగా గర్భగుడివైపు వెళ్ళాడు. దేవుడక్కడే వున్నాడు కాని అర్చకుడు కనపడలేదు!

కొండదిగి వచ్చేటప్పుడు బస్సులోనూ తర్వాత క్రిందితిరుపతిలో బసలోనూ వెంకట్రావు కనకలతమాటే చెప్పేడు.

'అర్చకుడు ఆమెకు శఠగోపం ఎంత సేపుపెట్టేడో తెలుసా? ఆమెకు మెడనొప్పి పెట్టి 'ఇంక తీసెయ్యండి!' అనేదాకా అలాగే ఉంచాడు. స్వామితీర్థం ఉద్ధరిణెల తరబడిని జుర్రించేశాడు మరొక అర్చకుడు! ఒకళ్ళమీద ఒకళ్లు పోటీగా ఆమెకు మర్యాదచేశారు తెలుసా? హుండీలోంచి తీసిన ముడుపులు వేటికవి వేరుచేసి తీస్తోన్నప్పుడు పారిపత్యాదారు ఆవిణ్ణి అక్కడకు తీసుకెళ్ళి అన్నీ స్వయంగా చూపించి వివరించారు! ఆవిడకి, నా తలకాయంత పెద్ద మిఠాయివుండ— నేతితో చేసినది—ప్రసాదం ఇచ్చారు' అని చెప్పుకుపోతూంటే పురుషోత్తం అడ్డుతగిలి, 'నువ్వు నాకుమళ్ళీ కనపడ్డావుకావు! దాని కూడానే ఉన్నావనుకుంటాను' అన్నాడు.

'ఉండక మరి! నేనొక లెక్కా? మహా మహావాళ్ళే ఉన్నారు. అమంత్రణోత్సవం, కల్యాణోత్సవం చేయించిందావిడ తెలుసా? ఆ అభిషేకం పేరేదో మరిచిపోయాను—అదికూడా చేయించింది. ముష్టివాళ్ళకే ఎలాగలేదన్నా ఇరవైరూపాయల చిల్లరదాకా పంచిపెట్టింది! ఈ ముష్టి కేంగాని, రాయలసీమ క్షామనిధికి వెయ్యినూటపదహార్లిచ్చిందిట, తెలుసా?'

'అలాగా? మొత్తంమీద నీకీతార బాగా నచ్చింది.'

'నాకు నచ్చుటమేమిటయ్యా? కళారాధకులలో ఆవిడకి జోహారు చెయ్యనిదెవరో చెప్పు?'

వెంకట్రావు గుక్కతిప్పుకోడానికి ఒక్క క్షణం ఆగి "'బలవంతపు పెళ్ళి'లో ఏక్టు చేసినతర్వాత ఈవిడ కీర్తి దిగంతాల

వరకూ వ్యాపించిపోయిందిలే. అందుకే ఫిలిం బ్యాలెట్టులో వస్తు బహుమానం కొట్టేసింది! నబ్బులవాళ్ళూ, తలనూనెల వాళ్ళూ ఆమె గుమ్మంముందు పడిగాపులు పడివుంటున్నారు తెలుసా, యిప్పుడు?" అన్నాడు.

'ఎందుకు ?'

'ఎందుకా? సర్టిఫికెట్లకోసం. "నే నెప్పుడూ ఫలానా సబ్బునే వాడతాను" "ఫలానా హెయిరాయిలే రాసుకుంటాను" 'ఫలానా స్నోయే పూసుకొంటాను'— అని ఆమెచేత రాయించుకుపోయి, ఎడ్వ టైజుమెంట్లో వేసుకుంటే ఆ సబ్బులూ, నూనెలూ, స్నోలూ వేడిపకోడీలకుమల్లే అమ్ముడైపోతాయి! తస్సాదియ్యా, జన్మ యెత్తినందుకు అలాంటి పలుకుబడి ఉండాలనుకో! ఎందుకూ, నువ్వూ పెద్ద చదువులు చదివి జడ్జీ ననిపించుకున్నావు కాని ఒక్క 'స్నో'వాడుగాని, ఫేసుపౌడరు వాడుగాని యోగ్యతాపత్రాలకోసం నీదగ్గ రికి వస్తున్నాడా ?'

'నేను ఫేసుపౌడర్లూ స్నోలూ వాడ నుగా ?'

'నువ్వు వాడే సరుకులే తీసుకుందాం. రోజూ జడ్జిమెంట్లు రాయటానికని బండెడు కాగితాలూ, కుంచెడు సిరా ఖర్చుపెడ తావు! ఆ కాగితాలవాళ్ళూ, సిరాలవాళ్లూ, కలాలవాళ్ళూఐనా సర్టిఫికెట్లకోసం నిన్ను యాచిస్తున్నారా అంటాను.'

జడ్జీగారు కొంచెం చికాగ్గా 'ఒక తుక్కోజీతారకీ నాకూ సామ్యమా?' అన్నారు. ఈమాటు వెంకట్రావుకి కోపం వచ్చి, 'ఏమన్నావ్? తుక్కోజీతారా! అసలు ఆ సమాసమే తప్పంటాను! అటు వంటి విశేషణం 'తార' శబ్దానికి ముందు పెట్టటానికి వీలేలేదు. మిక్కిలి ప్రకాశ వంతమైన వేగుజుక్కా, కొంచెం మినుకు మినుకుమనే చిన్న నక్షత్రం వున్నట్లే ఈ తారలలోనూ తర తమ భేదం వుండొచ్చు గాని వాళ్ళెవరనికూడా 'తుక్కోజీలు' అనటానికి వీల్లేదు. అందులో వెళ్ళిన చోటల్లా స్వర్ణకంకణాలు వేయించు కుంటూన్న కనకలతనా 'తుక్కోజీ' అనేశావ్. పాపం శమించుగాక!....అన్నట్టు ఈమధ్య 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ'లో ఆమెను గురించి ఒకస్కెచ్చి పడింది చదివేవా?... చదివివుండవులే. అస్తమానూ, 'లావీక్లీ! లతో ముంచెత్తుకుపోయే నీకు ఈ భాగ్యం యెక్కడ కలుగుతుంది?....యెందుకు చెప్పేనంటే, నువ్వు 'తుక్కోజీ' అను కునే ఈ తార పట్టుపూర్వోత్తరాలన్నీ ఆ వ్యాసంలో పడ్డాయి. ఆవిడ తండ్రి మీ నాయనకుమల్లేనే ఒక ప్లీడరుట...అన్నట్టు యిప్పుడు తోస్తోంది....ఆయన పేరూ మీ నాయన పేరుకూడా ఒకటే—బాపిరాజు గారే! మీ అమ్మపేరు వెంకమ్మకదూ. పతి వెంకమ్మ! వెంకమాంబ ఐనా కాదు? కనకలత తల్లిపేరెవరో తెలుసా ?'

'తెలియదు.'

'శ్యమంతకమణి!'

ఆ పేరు వినేసరికి పురుషోత్తంగారికి నిద్రలోంచి అకాత్తుగా మెలకువ వచ్చినట్ల యింది. 'శ్యమంతకమణి! ఔను. ఆపేరే!' ఆయనకు పదిసంవత్సరాలక్రితం జరిగిన ఒక సంఘటన మనోవీథిలో ప్రత్యక్షమైంది. ఆకాలంలో ఆయన రాజమండ్రీలో సబ్

జడ్జీగా వుంటూండేవాడు. ఒక రాత్రి యెనిమిది గంటల వేళప్పుడు నలభై యేళ్ళు దాటిన ఒక స్త్రీ వచ్చి ఆయనలో ఒక గాలిదుమారాన్ని లేవనెత్తింది. 'అబ్బాయిగారూ, నన్ను మీరెరగరనుకుంటాను. నాపేరు శ్యమంతకమణి. మీ నాయనగారి వుంపుడుగత్తెను' అని ఆగింది. ఆయన సిగ్గుతో చిమిడిపోయాడు. వళ్ళంతా చెమటలుగమ్మేయి. చీమలూ, జెఱ్ఱిలూ పాకుతోన్నట్లయింది. ఆమె, 'అబ్బాయిగారూ, నాకు పదిహేనేళ్ల కూతురొకర్తె వుంది. మీ చెల్లెలన్నమాట. మీ నాయనగారి తెలివితేటలన్నీ దానిలో కనపడుతున్నాయప్పుడే. దాన్ని మద్రాసులో కళాక్షేత్రానికి పంపించి కొత్తఫక్కీ డ్యాన్సు నేర్పించమంటున్నారంతా. నేనిప్పుడు పేదరికంలో వున్నాను. మామీద కొంచెం అభిమానం కనపరిచి ఆపిల్ల విద్యకు యేదైనా సాయంచెయ్యవలసిందని అడగటానికొచ్చాను' అంది. ఆయనకప్పుడు అదంతా అవమానకరంగా తోచింది. 'పెద్దఉద్యోగం చేస్తో నలుగురిలోనూ తలెత్తుకు తిరుగుతూన్న సమయంలో పీడకలలాగ ఈ గొడవయేమిటి?' ఎంతమందికో 'చదువుకుంటున్నా'మంటూవచ్చినవాళ్ళ కాయన ధనసాయం చేస్తూనేవచ్చాడు. కాని ఆనాడు ఆ వేశ్య వచ్చి, 'మీచెల్లెలన్నమాట. దీనికి సాయం చెయ్యండి' అనేసరికి ఆయనకేమీ చెయ్య బుద్ధివేసిందికాదు. ఆమె చిన్నబుచ్చుకు వెళ్ళిపోయింది. ఆమె వెళ్లేక, 'ఏమైనా ఇచ్చిపంపుతే తీరిపోనేమో' అనిపించింది మళ్లీ. కాని 'అదినిష్ఠూరమే మేలు' అని మనస్సు సమాధానపరుచుకున్నాడు క్రమంగా ఆ సంఘటన మరచిపోయాడు. ఆ శ్యమంతకమణియేనా యీమె? ● 'చెల్లెలే'నా ఈ కనకలత?

'ఏమిటి బావా ఆలోచిస్తున్నావు?' అన్నాడు వెంకట్రావు. పురుషోత్తంగారు 'ఏంలేదోయ్' అన్నాడు పరధ్యానంగా. 'కనకలత జడ్జీలకంటే గొప్పదన్నాననా కోపం?' అన్నాడు వెంకట్రావు చిరునవ్వుతో. జడ్జీగారు జవాబుచెప్పకుండానే వెంకట్రావుకి టౌనుహాలుమాట జ్ఞాపకానికొచ్చింది. 'అరరె. ఆమాటే మరిచిపోయాను! ఫిలింఫాన్సు అసోసియేషన్ వాళ్ళు నాలుగ్గంటలకి టౌనుహాల్లో కనకలతకి రిసెప్షను ఇస్తున్నారు. వెళ్ళాలి.... బావా, ఇక్కడొక్కడవూ కూర్చుని తపస్సు చెయ్యకపోతే నువ్వుకూడా రాకూడదూ?' అన్నాడు.

'మంగాపురం వెళ్లటం ఎప్పుడుమరి? ఇంతకీ ఈ పిలవని పేరంటానికి వెళ్లటం యేమిటి?'

'పిలవని పేరంటమేమిటోయ్? దేముడి పెళ్ళికంతా పెద్దలే! నేను ఫిలుస్తున్నాను కదూ. రా. బయల్దేరు. అలమేలుమంగను రేపు చూడొచ్చులే.'

పురుషోత్తం అలాంటి సభలకెప్పుడూ వెళ్ళలేదు. కాని వెంకట్రావు ప్రోత్సాహం వల్లనో మరెందుకనో ఆరోజు వెడదామనిపించి, లేచాడు.

వాళ్లు టౌన్‌హాలు చేరుకునేసరికి జనం కిటకిటలాడుతున్నారు. వెంకట్రావు ఎలాగైనా ముందువరసలోకిపోయి ఇరకాలనుకున్నాడు కాని, పురుషోత్తంగారు వప్పుగో



లేదు. 'కాస్సేపు వెనకాల నిలపడి, పోదాం' అన్నారు.


వేదికమీద టేబులు వెనుక మూడు కుర్చీలు వున్నాయి. కనకలత అప్సరస లాగ అలంకరించుకుని వచ్చి సభవారికి ఒక్క నమస్కారంచేసి, మధ్య కుర్చీలో కూర్చుంది. ఆమెవెంటనే శ్యమంతకమణి వచ్చి కుడివైపు కుర్చీలో కూర్చుంది. కనకలతకు తమ సంతోషం వెల్లడిస్తో సభ్యులు చాలాసేపు చప్పట్లుకొట్టేరు. పెద్ద రోజామాలలు రెండుతెచ్చి, ఒకటి కనకలతకూ, రెండవది ఆమె తల్లియైనందుకు శ్యమంతమణికీ వేశారు. మళ్ళీ చప్పట్లు! వెంకట్రావు, 'బావా, నీకు ఏ మీటింగులోనైనా ఇంత పెద్దదండ వేశారుటోయ్?' అన్నాడు.

జడ్జీగారు కనకలత తల్లివైపే చూశారు. ఆమెయే ఈమె! అప్పటికన్న ఇప్పుడు పదేళ్ల వయసు మళ్ళినా, మాంచి తీవివచ్చింది మనిషిలో. ఆంధ్ర తమిళుల ఏకైక అభిమానతారయొక్క తల్లిలాగే వుంది!

సూటువేసుకొన్నాయన ఒకడు స్వాగత పత్రం చదివేడు. తర్వాత ఎందరో కనకలతనూ, ఆమె నటనాకౌశల్యాన్ని మెచ్చుకుంటూ ఉపన్యాసాలిచ్చారు. 'ఇంకా ఉపన్యాసకులు చాలామంది వున్నారు గనక, ఒక్కొక్కరు ఐదేసినిముషాలుకన్న మాట్లాడడానికి వీల్లేద'ని అధ్యక్షులు శాసించారు. క్రమంగా ఈ ఐదునిముషాలల్లా రెండేసినిముషాలుగా తగ్గింపబడింది. కాని, 'మాటలాడటానికి అవకాశం ఇవ్వవలసిందం'టూ చీటీలు వస్తూనేవున్నాయి.

వెంకట్రావుకూడా ఆసచీటీ పంపేడు. ఇంక ఉపన్యాసాలకు అంతు ఉన్నట్లే కనపడలేదు. కనకలత అధ్యక్షునితో ఏదో అంది. ఆయన లేచి 'కనకలతాదేవిగారు పనితొందరవల్ల ఇంక ఆగటానికి వీల్లేదు అంటున్నారు. వారిప్పుడు కొన్నిమాటలు చెబుతారు' అన్నాడు. కనకలత మాట్లాడటానికి లేచింది. అందరూ చప్పట్లు కొట్టేరు మళ్లీ. 'సైలెన్సు, సైలెన్సు' అని కేకలతో శబ్దమెక్కువైంది. ఐదునిముషాలయాక శబ్దం అణిగి, ఆమె మాట్లాడింది. 'నాయందు మీరు కనపరిచిన అభిమానానికి నే నెంతో కృతజ్ఞురాలను. మీ అభిమానానికి అర్హత కలిగిఉండటానికే ప్రయత్నిస్తాను. ఇంక మాకు సెలవిప్పించండి' అని కూర్చుంది. వెంకట్రావు, "'బలవంతపు పెళ్లి'లో 'పపపా పపపా పపాపపా' పాట పాడండి" అని అరిచాడు. 'పాడండి, పాడండి' అన్నకేకలు మిన్నుముట్టేయి. ఆమె పాడింది. సభంతా ఆనందసాగరంలో ఉక్కిరిబిక్కిరైంది.

సభముగిసి అంతా వెడుతోంటే వెంకట్రావు ఆమెతో మహపరిచయంవున్న వాడికి మల్లే 'రావోయ్ బావా, నిన్ను ఆమెకు ఇంట్రడ్యూస్ చేస్తాను!' అన్నాడు. పురుషోత్తంగారు 'నాన్‌సెన్సు!' అని చిరాకుపడ్డాడు. 'నీఖర్మం' అన్నట్టుగా వెంకట్రావు ఆయనను అక్కడ వదిలేసి, కనకలత కారువద్దకు పరుగెత్తేడు. పురుషోత్తంగారు మెల్లిగా బసచేరుకుని జంబుఖానామీద మేనువాల్చి, 'నేనేదో గొప్పవాణ్ణీ; ఆమె ఏదో తక్కువదీ అనే భావంతో వెంకట్రావుని కసిరేనేగాని నాగొప్ప ఏమిటి? ఇంతమంది అపారాభిమానాన్ని చూరగొన్న కనకలతముందు నే నెంత వాణ్ణి? నాజడ్జిమెంట్లు గొప్పవే కావచ్చు. కాని అవి ఓడినవాణ్ణి యేడిపిస్తాయి! సామ్యంచెప్పినట్లు కేసునెగ్గినవాణ్ణికూడా లోలోపల యేడిపించేవే మా తీర్పులు. ఆమె అందరికీ ఆనందాన్ని అందిస్తోంది! ఆ శ్యమంతకమణి ముఖంలో యెంత గర్వం కనపడుతోంది! "నేనుగూడా అంత గర్వించతగ్గవాణ్ణే. కాని ఆ అర్హత పోగొట్టుకున్నాను! 'నీచెల్లె'లంటూ నాడు శ్యమంతకమణి వచ్చినప్పుడు అవమానమనిపించి పొమ్మన్నాను!...."ఆయనకు కునుకుపట్టింది. కునుకులో కలవచ్చింది. కలలో ఆయనను వెంకట్రావు, 'కనకలతగారూ, ఈయన మీ బ్రదర్ తెలుసా!' అని ఇంట్రడ్యూస్‌చేశాడు. ఆమె ముఖం ముడుచుకుని 'సారీ, నాకు బ్రదర్సెవరూ లేరు!' అని తల్లికేసి చూసింది. తల్లి పురుషోత్తంకేసి చూడటం, ఆయన చిన్నబుచ్చుకోడం జరిగింది. పురుషోత్తంగారు, 'వెంకట్రావ్, వద్దంటే విన్నావుకాదు. చూశావా యేంజరిగిందో!' అంటూ నిద్రలోంచి మేల్కొన్నారు. 'యేమిటి బావా, పలవరిస్తున్నావు?' అంటూ వెంకట్రావు ప్రవేశించాడు.





# సమస్య

మానవులు రకరకాల దుస్తులు ధరిస్తున్నారు. విభిన్నరుచులకు అలవాటు పడుతున్నారు. ఇదివరకు కనీ వినీ ఎరుగని వాహనాలను వినియోగిస్తున్నారు. ఇదంతా చూచి అర్ధమయినంతవరకు వాటిని తెలుసుకొని, కాలం మారింది అంటున్నాం.

కాని, మూర్తిమాత్రం మారలేదు. ఆనాడు తప్పుచేసినప్పుడు ప్రిన్సిపాల్ యెదుట యెంత నిర్భయంగా, యెంత నిశ్చలంగా నిలబడ్డాడో ఈనాడు న్యాయస్థానంలో న్యాయమూర్తియెదుటకూడా అలాగే నిలబడ్డాడు. అకస్మాత్తుగా బోనులో మూర్తిని యెవరైనా చూచినట్లయితే అసలు ఆ మనిషిలో మానవునికి సహజంగా వుండాల్సిన లక్షణాలేమన్నా ఉన్నయ్యా అనే అనుమానంకూడా కలుగుతుంది.

మూర్తితరపున వాదించేందుకీనాడు న్యాయవాది లేడు. ఆనాడు కాలేజీలోనూ అంతే. ఆనాడు తప్పు చెయ్యలేదు అని చెప్పేవాళ్ళు అటు మాస్టర్లలోగానీ యిటు మాలోగానీ యెవరూ లేరు. ఆనాడు నవ్వుతూ కాలేజీకి స్వస్తిచెప్పాడు. మరి ఈనాడో....

తలవని తలంపుగా అన్నయ్యకోసం నేను కోర్టుకువెళ్ళాను. అన్నయ్య అప్పుడు యేదో పనిమీద కోర్టులో విచారణజరిగే హాలులోనే వున్నాడు. అనుకోకుండా న్యాయమూర్తిని చూచాను. పరధ్యాన్నంగా మూర్తిని చూచాను. ఇద్దరూ చిన్ననాటి స్నేహితులే. న్యాయమూర్తి అడుగుతున్నాడు....నేను—ఆదుర్దాగా కాదు; కుతూహలంతో వింటున్నాను.

"ఈ విషయంలో మీరేమైనా చెప్పుకుంటారా?"

"చెప్పుకోను. చెప్పుకోలేను. ఒకవేళ అలాచేద్దామని ప్రయత్నించినా, నా నేరంయింకా ధృవపడుతుందేకానితగ్గదు"

"లాయరునెందుకు పెట్టుకోలేదూ?"

"లాయరు....ఎందుకు! అదో ఖర్చు."

"మీరు చాలా ఆస్తి సంపాదించారు కదా?"

"అవును"

"అటువంటప్పుడు న్యాయవాదిని పెట్టుకుంటే...."

న్యాయమూర్తి ముఖం చిట్లించాడు. తల పంకించాడు. కొంచెంసేపాగి—

"హత్య అంటే యేమిటో మీకు తెలుసా?"

వి. ఎస్. అవధాని

"తెలియకనేమంటీ! చక్కగా తెలుసు తెలియకుండానే లీలను నేను చంపా నంటారా ?"

"హత్యా నేరమనీ, మీ వంటి విద్యా సంస్కారాలుగల మనిషి చెయ్యరాదనీ మీకు తెలుసా ?

"తెలుసు....కాదు....తెలిసీ తెలియ కుండావున్నది."

"లీల అనే యువతిని మీరు ప్రేమించే పెండ్లాడారుగదా ?"

"నేను సామాన్యఖైదీని. నేరస్థుణ్ణి.... హంతకుణ్ణి. ఆ దృష్టితోనే మీరు నన్ను విచారించాలి. మర్యాదగా "మీరు" అని నన్ను అనడం యేమంత బాగాలేదు. అది అలావుంచండి. ప్రేమించే పెండ్లిచేసు కున్నానో కామించే పెండ్లిచేసుకున్నానో నాకు తెలియదు. అది యీనాటి సంగతి కాదు. గుర్తుచేసుకుందామన్నా నాకిప్పుడు గుర్తురాదు. మా సంసారజీవితం ఫలి తంగా ముగ్గురు పిల్లలు పుట్టారు. అయి నప్పుడా పెండ్లి యెలాజరిగిందో చెప్ప వలసిన అవసరం ఏమీలేదనుకుంటాను."

"సరే....ఆస్తి సంపాదనకు మీరు అదేదో దేశం వెళ్ళినప్పుడు మీ భార్య కూడా మీవెంట వచ్చిందా ?"

"వచ్చింది"

"మీతో ఆమె అక్కడ యెంతకాలం వున్నది ?"

"రెండేళ్ళున్నది"

"ఆతరువాత ?"

"ఈవూళ్ళో నేను కొన్న....కాదు నా పేర ఆమె కొన్న మా యింట్లో, ఆమె పిల్లలతో కాపురముండేది."

"ఆ దేశంలో ఉండటం ఇష్టంలేదని ఆమె మీతో చెప్పిందా ?"

"చెప్పింది. నేను ఆమె సలహాలు వినలేదు. నాకు తోచినపని చెయ్యడమే అలవాటు. నేను ఈ వూళ్ళోనే చదువు కున్నాను. నా చిన్నతనమంతా ఈ వూళ్లోనే గడిచింది. ఈ వూళ్ళోనే లీలను నేను పెండ్లిచేసుకున్నాను. అటువంటి ఈ వూళ్లోనె ఒకానొకప్పుడు తినటానికి తిండి లేక మేమిద్దరం కొన్నాళ్ళు వుపవాసా లున్నాం. ఆ తరువాత అక్కడికి వెళ్ళి చాలా సంపాదించాను. అక్కడ ఖర్చులు తక్కువ. జీవితంలో ఆడంబరమనేది అక్కడలేదు. నాకు నేనుగా బీడు కొట్టి వేసి గింజలు చల్లాను. మొక్కలు నాటాను. ఆ నా కష్టమంతా అక్కడే ఫలి తానికి వచ్చింది...."

"అదంతా అలా ఉంచండి. అక్క డికి వెళ్ళేవిషయంలో మీ యిద్దరిమధ్యా అభిప్రాయభేదాలు వచ్చినయ్యా ?"

"నేను లీలకుచెప్పి అక్కడకు వెళ్ళ లేదు. అక్కడికి వెళ్ళినతరువాత లీల సంగతే నేను మరచిపోయినాను. నేను అక్కడ ఉంటున్నట్లు తెలుసుకొని ఆమే నా దగ్గరకు వచ్చింది. అందుకు చాలా సంతోషించాను. నాకు చేతయినట్లు ఆమెను సంతోషపెట్టాను. ఆమెతో ఇక్క డికి వచ్చి కొంతకాలం మా అత్తవారింట్లో ఉండి తిరిగి నేనొక్కణ్ణే వెళ్ళిపోయి నాను."

"ఆ విధంగా ఎన్ని సంవత్సరాలు గడిచినయ్ ?"

"పదిహేనేండ్లు."

"ఈ పదిహేనేండ్లలో అప్పుడప్పుడు మీరు ఇక్కడకు వచ్చిపోతూండేవారు. అప్పుడు మీ భార్య ప్రవర్తనలో మీకేమైనా అనుమానం కన్పించిందా?"

"లేదు."

"మరి ఇంత ఘోరంగా యీ హత్యకు మీరెందుకు పూనుకున్నారు?"

"నాకు తెలియదు. బహుశా ఈ సమస్యను ఎవ్వరూ పరిష్కరించలేరనుకుంటాను. మనం అనేక పుస్తకాలను చదువుతూంటాం. వాటిలో అనేక మంచివిషయాలుంటాయి. ముఖ్యంగా ఈ పని చెయ్యరాదు, ఈ పని చెయ్యవచ్చు అనే ధర్మసూత్రాలున్న గ్రంథాలు మనదేశంలో అనేకం వున్నాయి. ఇవన్నీ కాకపోయినా కొన్నయినా మనలో చాలామంది చదువుతూంటారు. వాటిలోని విషయాలు మీవంటి పెద్దలు చెపుతూండగా మరి కొందరు వింటూంటారు. కాని, ఏపని చెయ్యరాదో, ఆ పనినే మనలో చాలా మంది ఎందుకు చేస్తున్నామంటారు?"

"అది వేరేసంగతి. ఇది హత్యకదా? ఒక నిండుజీవి ప్రాణాలు తీసెయ్యడం. ఇది క్షమింపరాని నేరం. దీనికేదో పెద్ద కారణం వుండాలికదా?"

"చిన్నపనికి చిన్నకారణం ఉంటుంది. మీకు ఆ కారణాలు తెలుస్తున్నాయి కనుక అవి చిన్నవవుతున్నవి. కనీసం అలా అని మీరనుకుంటున్నారు. మనం చిన్నవి అనుకునేవాటిలో చాలా పెద్ద కారణాలు చాలా వుండొచ్చు. మనం చాలా పెద్దకారణాలు అనుకునేవాటిలో అంత పెద్దతనం ఏమీ లేకపోవచ్చుకూడా.

"ఈ గొడవంతా దేనికి?"

"నేను హత్యచేశాను. ఒక నిండు జీవి ప్రాణాలను నా యీ చేతులతోనే తీశాను. ఈ పని యితరు లెవ్వరూ చూడలేదు. నాకు నేనే యీకోర్టుకు పట్టుపడ్డాను. నా యీ నేరానికి తగినశిక్ష విధిస్తే సరిపోతుందిగా?"

"ఆ మాత్రం కోర్టువారికి తెలుసు! కాని న్యాయవిచారణ సక్రమంగా జరగాలి. మీరుచేసిన నేరానికిగల కారణాలను మీరు తెలియజేస్తే మీశిక్ష కొంచెం తగ్గవచ్చు."

నేను న్యాయమూర్తివంక చూచాను. ఆయన పడుతూన్నబాధ కోర్టులో ప్రతివాడికి స్పష్టంగా కనిపిస్తూంది. బాధ కాదూ, మరి. మూర్తి హత్యచేశాడంటే యెవరు నమ్ముతారు? ముఖ్యంగా వాడితో ఆడుకొని, వాడి కష్టసుఖాల్లో కొన్ని సంవత్సరాలపాటు పాల్గొన్నవాళ్ళం యెలా నమ్ముతాం? కానీ, తీరపోయింది "నేను హత్యచేశాను." అని మూర్తి న్యాయస్థానంలో బహిరంగంగా చెప్తుతూంటే నమ్మకపోవడమెలా?

మూర్తివంక చూచాను. శిలావిగ్రహంలాగా నిలబడివున్నాడు. ఆనాడు ఆటల్లో యెవరన్నా తప్పుచేస్తే, అన్యాయానికి పాల్పడితే వాళ్ళను చావగొట్టి యిలాగే విగ్రహంలా నిలబడేవాడు. కాలేజీలో ఫిలాసఫీ లెక్చరర్‌తో పోట్లాడి బయటికి వెళ్ళినప్పటి మూర్తిరూపం యిదే. కాకపోతే ఆనాడు యువకుడు. ఈనాడు వృద్ధాప్యం తొంగిచూస్తున్న మూర్తి. ఇంతే తేడా. కాని, మూర్తిలో అన్యాయానికి పాల్పడే లక్షణంలేదని వాణ్ణి యెరుగున్న

వాళ్ళందరూ అంగీకరిస్తారు. కోర్టుకు వెళ్ళినపని మరచిపోయి, అలాగే నిర్ఘాంత పడి వింటున్నానో, చూస్తున్నానో నాకే తెలియదు.

మళ్ళీ యేవో మాటలు వినిపిస్తున్నయ్.

"సరే ముద్దాయి నేరంచేశాడని రుజువు చెయ్యడానికి ప్రాసిక్యూషన్ వారికి సాక్షులు వున్నారా?"

ప్రాసిక్యూటర్ లేచాడు.

"ముద్దాయి మామగారు మొదటి సాక్షి."

"ఆయన్ను పిలవండి."

ఒక లావాటి శాస్త్రుల్లుగారు కోర్టులో హాజరయినాడు.

న్యాయమూర్తి అడుగుతున్నాడు;

"లీల, మీకుమార్తె యెప్పుడు హత్య చెయ్యబడ్డదో మీకుతెలుసా?"

"ఆ క్రిందటి రాత్రి"

"ఎన్ని గంటలకు?"

"తెలియదు".

"భార్యా భర్తలు ఒకే గదిలో పడు కున్నారా?"

"లేదు"

"మరి హత్యచేసిం దెవరంటారు?"

"శ్రీనివాసమూర్తి అనే నా అల్లుడు."

"ఆయనే హత్యచేశాడని మీ కెలా తెలుసు? ఆయన ఆమెను చంపుతుండగా మీరు చూచారా?"

"లేదు"

"పోనీ చూచినవాళ్ళెవరైనా మీకు అలా చెప్పారా?"

"లేదు. మూర్తే తెల్లవారుఝామున నాదగ్గరకు వచ్చి 'మామయ్యా నేను లీలను చంపాను' అని చెప్పాడు."

"ఆ సంగతి ముద్దాయి వాఙ్మూలం లోనే వున్నది. అంతకన్న మీరు యింకా యేమన్నా చెప్పగలరా?"

"చెప్పలేను"

"పోనీ....ఆరోజు రాత్రి వాళ్ళిద్దరూ యేమన్నా పోట్లాడుకున్నారా?"

"నాకు తెలియదు"

"మీ యింట్లో యెవరికైనా తెలుసా?"

"ఆయన చెప్పినతరువాతనే అందరికీ తెలిసింది."

"అంటే మీరెవరూ మూర్తి లీలను చంపుతూండగా చూడలేదు. ఆమెకు యిదివరకు యేమైనా జబ్బువున్నదా?"

"డాక్టరుపరీక్షలో అటువంటిదేమీ లేదని తేలింది"

* * *

విచారణ సెషన్సుకు పోయిందని విన్నాను. ఇంటికి వెళ్ళి ఇదేసంగతి ఆలోచించటం మొదలుపెట్టాను. ఆలో చించినకొందికీ చిన్ననాటి సంగతులన్నీ గుర్తుకొస్తున్నయ్.

మూర్తి ఇల్లు మా ఇంటిదగ్గరే ఉండేది. వాళ్ళు అంత భాగ్యవంతులుకారు. వాళ్ళ నాన్న చిన్నతనంలోనే పోయినాడు. మూర్తికి నలుగురన్నలున్నారు. వాళ్ళం దరూ ఏవో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకొంటున్నారు.

మూర్తికి చదువు చెప్పించే భారం వాళ్లు ఎట్లా నిర్వహించారో ఇప్పుడు నేను చెప్పలేను. కాని, మనకు కావలసింది ఆనాటి మూర్తి అలవాట్లు ఆలోచనలు. మేమిద్దరం ఫోర్తుఫారంనుంచి బి. యే దాకా కలసి చదువుకున్నాం. నేనంటె వాడికి గౌరవంలేదు. నేనంటేనే కాదు,

కొంచెం కలవారంటే వాడికి అసహ్యం, కోపం. వాళ్ళమీప కత్తికట్టినట్లుండేవాడు. క్లాసులో అన్నీ ఫస్టుమార్కులు వచ్చేవి కావు.

ప్యాసు మార్కులకంటే ఎక్కువే వచ్చేవి. అటు ఉపాధ్యాయులనుకానీ, ఇటు లెక్చరర్లనుగానీ, ఇంట్లో తల్లినికానీ ఏమీ లెక్కచేసేవాడుకాదు. బి. య్యే క్లాసులో ఫిలాసఫీ లెక్చరర్ ఎవరో ఒక అమ్మాయివంక అ్రదరకంగా చూస్తూ పాఠం దోవ తప్పించాడు.

మూర్తి కా సంగతి తెలిసి లెక్చరర్‌ను నానా మాటలు అన్నాడు. ఆయన ఆజ్ఞాపించకుండా తానే క్లాసులోనుంచి వెళ్లిపోయినాడు.

ఆతరువాత ఈ లీల తనను ప్రేమించి పెండ్లిచేసుకుందని ఎప్పుడో మూర్తి చెప్పాడు. ఆతరువాత ఈ పదిహేనేండ్లలో నేను మూర్తిని చూడలేదు. అన్యాయం చేసే లక్షణం అతనిలో లేదు. అన్యాయాన్ని క్షమించే తాహతు అంతకన్నా లేదతనికి.

అంతమాత్రంచేత విపరీత ప్రవృత్తి కలవాడనడానికీ వీలులేదు. సాధారణమయిన మనిషిగానే తయారయాడు మూర్తి. లీలతో అతని పెండ్లికూడా చాలా సహజంగానే జరిగింది. మూర్తి బీద వాడు. లీల భాగ్యవంతురాలు. అయితే చాలా చిన్నతనంలోనే వింతంతువయింది. ప్రేమకలాపాలు అవీ ఏం లేకుండానే చాలా సహజంగానే తాను లీలను చేసుకున్నట్లు మూర్తి చెప్పాడు. వాళ్ళిద్దరి మధ్య అభిప్రాయభేదాలేమున్నాయో ఏమి లేవో చెప్పగల తాహతు నాకులేదు. కాని మా అన్నయ్యకు మూర్తి సంగతంతా మొదటినుంచీ తెలుసు. వాడి మాటల ప్రకారం మాత్రం వాళ్ళసంసారం చాలా గుట్టుమట్టుగానే; అందరనుకున్నట్లు చాలా హాయిగానే గడచిపోయేదట.

* * *

మూర్తిమీద నేరాన్ని ఋజువుచెయ్యాలనే పట్టుదల వాడి మామగారికి యెక్కువైంది. అవును మరి కన్నకడుపాయెను! నిండు ప్రాణాన్ని నిలువునా తీస్తే యెవరు మటుకు యెలా సహిస్తారు?

అసలు నేరం చెయ్యలేదని మూర్తి అన్నాడు కనుకనా? కాకపోతే మూర్తి, లీలను యెందుకు చంపాడు? యెట్లా చంపాడు? అనే విషయాలు కొరకరాని గడ్డుసమస్యలయాయి. వాటిని పరిష్కరించాలనే పట్టుదల అటు సెషన్సు జడ్జిలోను, యిటు మూర్తి మామగారిలోను యెక్కువయినవి. ఈ సంగతంతా తెలుసుకుని నేనుకూడా సెషన్సుకు హాజరయాను.

ఎక్కడో డిటెక్టివ్ నవలల్లో యిలాంటి విషయాలు చదవటం జరిగింది. ఇప్పుడు కళ్ళారా ఆ సంగతంతా చూస్తున్నాను. మూర్తి నేరంచెయ్యలేదని నాలోని రెండోవాడంటాడు. ఒక చెంపచేశానని స్వయంగా మూర్తే చెప్పుతూంటే, నమ్మక పోవడం యెలాగో తెలియకుండావున్నది. కనుకనే సెషన్సు విచారణకు నేనుకూడా హాజరయాను.

* * *

విచారణ ప్రారంభమైంది.

మూర్తి అన్నలందరు వచ్చారు. మూర్తి హత్యచేశాడన్న నమ్మకం వాళ్ళకులేదు.

సెషన్సువారు క్రిందికోర్టుకన్న అదనంగా సేకరించకలిగిన సాక్ష్యం యేమీ లేక పోయింది. ముద్దాయి తన నేరాన్ని ఒప్పు కోటమే పెద్ద సాక్ష్యం.

వరుసగా రెండు రోజులు విచారణ జరిగింది. మూడోరోజున మూర్తి బోనులో నిలబడి చెప్పుతున్నాడు :

"హత్య అంటే మీకుతెలిసిన అర్థం తప్పు అని నా యీ నేరంవల్ల స్పష్ట మయింది.

"ఒక మనిషిని కత్తితో పొడిచిగాని, విషంపెట్టిగాని, లేక మరే ఆయుధంతో నైనా చంపతేనే హత్యచేసినట్లు మీ అభి ప్రాయం. అదృష్టితో అయితే నేను ఆమెను హత్యో చెయ్యలేదు.

"ఒక మనిషితో అభిప్రాయభేదం వచ్చినంతమాత్రాన బజారునపడి కొట్లాడు కోవాలని మీ అభిప్రాయం. అటువంటిది నేనేమీ చెయ్యలేదు. ఈ పురాతనదృష్టితో యేర్పరచుకున్న పడిరాళ్ళతో నానేరం రుజువుచెయ్యడానికి ప్రయత్నించి,పాపం అనవసరంగా మీ బుర్రల్ని పాడుచేసు కొన్నారు.


"అసలు సంగతేమిటంటే యిన్ని సంవత్సరాలు లీల నాతో సంసారం అనేది చెయ్యనేలేదు. ఏనాడయితే నేను ఆస్తి సంపాదనకు అక్కడికి వెళ్ళానో అప్ప ట్నుంచి ఆమె ఇష్టంవచ్చినట్లు ఆమె వుండటం ప్రారంభించింది. నాయిష్టం వచ్చినట్లు నేనుండేవాణ్ణి. నువ్విలా చేయ వద్దు అని నేనామెకు చెప్పలేదు. అప్పు డప్పుడామె నాదగ్గరకు వచ్చి యేడ్చేది. నేనుమాత్రం ఏమీ అనేవాణ్ణికాదు. ఆమెతో పాటు యేడ్చేవాణ్ణీకాదు. అంతమాత్రాన ఆవిడకు కావాల్సిన డబ్బు అవీ యివ్వక పోయేవాణ్ణీకాదు. ఆమె సుఖపడటానికి కావలసినవన్నీ యిచ్చేవాణ్ణి. ఇలా యెన్ని సంవత్సరాలని ఆడది బ్రతకగలదు ?

"ఎవరైనా బ్రతకగ్గలరేమో కాని నాకు తెలిసినంతమటుకు లీలవంటి మనిషిమాత్రం ఎంతోకాలం బ్రతకలేదు. అంచేత ఆమె ఈ నాటకానికి స్వస్తిచెప్ప తలచుకొని ఆరోజు రాత్రి నాకా సంగతి చెప్పింది. నే నా మాటలు నమ్మలేదు. కాని అర్ధరాత్రి ఎందుకో నే నామె మంచం దగ్గరకు వెళ్ళి చూస్తే ఆమెమాటలు నిజమేనని తెలిసింది. కాని, ఆమె తన ప్రాణాలు ఏవిధంగా పోగొట్టుకొన్నదో నాకు తెలియదు. డాక్టర్లకుకూడా ఆ సంగతి తెలియకపోవటం విచిత్రం. అంత కన్నా విచిత్రమేమిటంటే ఏమీ తెలియని మీ అందరూ ఈ విషయంలో ఏమిటో తెలిసినట్లు నటించటం.

"ఇక న్యాయస్థానం ఏమన్నా శిక్ష విధించవచ్చు. ఈ హత్య చేసింది నేనే!"

తరువాత మూర్తికి ఉరిశిక్ష విధించారు.

ఈ సమస్య యీనాటికీ పరిష్కారం కాలేదు....



# సంపెంగ పువ్వు



ఆ వాళ ఆదివారం అవటంవల్ల సులోచన తీరికగా వుంటుందని, కమల వాళ్ళింటికి వెళ్ళింది. సులోచనకీ, కమలకీ ఎక్కువ స్నేహంలేదు. స్నేహితుల పరిచయంవల్ల ఒకటి రెండుచోట్ల కలుసుకున్నా రంతే. లోకాభిరామాయణం మాట్లాడడం మొదలు పెట్టిన వాళ్ళిద్దరూ, క్రమంగా వారి స్వంత విషయాలనుగురించి చర్చ ప్రారంభించారు. మాటల సందర్భంలో సులోచన కథలు రాస్తుందని కమలకు తెలిసింది.

"అయితే ఏమండీ! మీరు కథలు రాస్తారు కదా! నేనొక తమాషాసంగతి చెపుతాను. అది మీరు కథవ్రాయడాని కేమైనా పనికివస్తుందేమో చూస్తారా?" అంది అమాయకంగా కమల.

సులోచన తెల్లబోయింది.

"తప్పకుండా చెప్పండి! వింటాను. కాని అది నేను కథగా వ్రాస్తేమటుకు ఏం బావుంటుంది! నేను కథ వ్రాసేనే అనుకోండి. అది మీరు చెప్పిందని మీకు తెలుసుగదా? కనుక ఆ కథ నేను వ్రాశాననే తృప్తి నాలో ఎలా వుంటుంది?" అంది సులోచన.

"అయితే వ్రాయవద్దులెండి! నేను చెప్పేది వినండి" అంటూ ప్రారంభించింది కమల:

"మా నాన్నగారు స్కూలుమాష్టరు పదవినుంచి రిటైరయిన కొత్తరోజులవి. మేము మద్రాసులో ఒక చిన్నయిల్లు అద్దెకుతీసుకుని ఉండేవాళ్ళం. మేము యిద్దరక్కచెల్లెళ్ళము. చిన్నప్పుడే తల్లి తండ్రులు పోయిన మా పెదనాన్నగారి కూతురు సావిత్రికూడా మాతోనే పెరిగింది. లోకమంతా సావిత్రి మా సొంత అక్క అనే అనుకొనేవారు. పెంచుకున్న కూతురనే కారణంచేత మా అమ్మా నాన్నా గూడ సావిత్రిని ఎక్కువ మురిపెంగా చూసేవారు. చీరలుకొన్నా, నగలు చేయించినా సావిత్రంటే ఎక్కువ శ్రద్ధ చూపించేది అమ్మ. దానిలాగ ఇంటిపనులు చేయడం మాకు చేతకాదని అమ్మ ఎప్పుడూ కోప్పడేది. 'దానిపనే బాగుంది;

కొమ్మూరి ఉషారాణి

మనకంటే' అనుకునేవాళ్లం, నేనూ, చెల్లాయి రమ.

"మేం ముగ్గురం మూడు రకాలుగా ఉండేవాళ్ళం. సావిత్రి మితభాషి. ఇంటికి ఎవరు వచ్చినా మాట్లాడేదికాదు. అందరూ దానికి గర్వమనుకునేవాళ్లు. మా ముగ్గురిలో సావిత్రే కొంచెం అందమయినదని చెప్పాలి. తను చాలా అందగత్తెనని దానికి గర్వంకూడా వుండేది. ఇరవై నాలుగుగంటలూ మంచి ఇస్త్రీబట్టలు కట్టుకుని చందనపుబొమ్మలా కూర్చునేది.

"నా తత్వం వేరు. ఏదో ఏదో వాగేదాన్ని. దాపరికం అన్నది నాలో అసలు లేదు. ఇంటికొచ్చినవాళ్ళందరితో తెగవాగుతానని అమ్మ నన్నెప్పుడూ మందలించేది. ఇంతకంటే నన్నుగురించి నేనేమీ చెప్పుకోలేను.

"మా చెల్లి రమ అనాకారికాదు. ఎప్పుడూ నవనాగరీకపు దుస్తులు ధరించేది. కాలమంతా పుస్తకాలు చదువుతోనో, ఆకాశానికేసి చూస్తోనో, బొమ్మలు గీస్తోనో గడిపేది. రూపం లేకపోయినా మా యిద్దరిలోకన్నా దానిలో ఆకర్షణ ఎక్కువ వుండేది.

"మా చిన్నయింటికి అతిథు లెక్కువ మంది వచ్చేవారుకాదు. స్నేహితులు యింటికి రాకపోవటం మా చేతకానితనమని అమ్మ తిడుతూవుండేది. మా నాన్నగారికోసరంమటుకు ఓ పెద్దమనిషి వచ్చేవాడు. అతనిపేరు సుధాకర్. నల్లగా, పొడుగ్గా ఉంటాడు. వయస్సు యిరవై ఎనిమిది సంవత్సరాలుండొచ్చు. మొత్తానికి అతన్ని అనాకారనే చెప్పాలి. తను బొమ్మలు గీస్తాననీ, ఆ బొమ్మలు పుస్తకంగా అచ్చువేయించమనీ నాన్నని అడుగుతూండేవాడు.

"అతను నాన్నతో మాట్లాడినంతసేపూ మేము ముగ్గురం ఆ గది చుట్టుపక్కలకి వెళ్లేవాళ్లంకాదు. అదేమి తమాషాయో గాని వెళ్ళేటప్పుడు రోజూ బల్లమీద ఒక సంపెంగపూవు పెట్టి వెళ్లిపోయేవాడతను. ఎందుకతను సంపెంగపూవు పెడుతున్నాడో, ఎవరికోసరం పెడుతున్నాడో మాకెవ్వరికీ తెలిసేదికాదు. ఎప్పుడూ వంటింట్లో పడివుండే మా అమ్మకుగాని, పురాణం చదువుకునే మా నాన్నకుగాని ఆ పువ్వుసంగతి పట్టేదికాదు. ఇంక ఆ యింట్లో మిగిలిన మా ముగ్గురికళ్లనీ ఆ పువ్వు ఆకర్షించింది.

"మొదట్లో ఒకళ్ళతో ఒకళ్లం ఆ పువ్వు సంగతి చెప్పుకోడానికి భయపడ్డాం. ఒకరు చూచినట్టు ఇంకొకరికి తెలియకూడదని తాపత్రయపడేవాళ్ళం. వారానికి ఒకసారైనా అతను మా యింటికి రావటం, బల్లమీద సంపెంగపూవు వదిలిపెట్టి వెళ్లటం జరిగేది. ఇహ ఉండబట్టలేక ఒకరోజు సావిత్రి నాతో యిలా అంది: "ఒసేయ్ కమలా! ఆ సంపెంగపూవు చూశావ్! ఎందుకలా అతను బల్లమీద పెట్టి వెళ్తాడు ?"

రమ అందుకుని "అదేనే నాకూ అర్థంకావడంలేదు! బహుశా మనలో ఎవ

రైనా ఆ పువ్వును పెట్టుకోవాలని అతని ఉద్దేశమేమో!" అంది. నేనూ, సావిత్రి ఫక్కున నవ్వాం.

"ఆ రోజునుంచి సంపెంగపూవు ఎవరికి ముందు దొరికితే వాళ్లు తల్లో పెట్టుకోవటం జరిగేది.

"అప్పటినుంచి ముగ్గురంకూడా అతను సంపెంగపూవు ఎవరికోసరం తెస్తున్నాడా అని ఆలోచించ మొదలుపెట్టాం. 'నా కోసమేనేమో!' అని ఎవరిమటుకు వాళ్లం లోపల అనుకున్నాం.

"అంత అంపమైనవాడు కాకపోయినా, సుధాకరుడిమీద మా ముగ్గురికీ ఒకవిధ మయిన ఆప్యాయత ఏర్పడింది. అతను వచ్చేవేళకి ముగ్గురం చక్కగా తయ్యా రయి, కాచుకునుండేవాళ్ళం.

"అదేమిటోగాని సుధాకరుడిమీద ప్రత్యే కంగా యిష్టమంటూ లేకపోయినా ఆ సంపెంగపూవు మిగతా యిద్దరికీ కాకుండా 'నా కోసరమే' అతను బల్లమీద పెడుతూ వుంటాడని నేననుకున్నాను. అప్రయ త్నంగానే అతన్ని ఆకర్షించడానికి, మేం ముగ్గురమూ ప్రయత్నించేవాళ్ళం.

"కాని పొరపాటునఅయినా మేము అతనున్న గదికి వెళ్ళితే, మమ్మల్ని చూడ కుండా తల దించుకునేవాడు. ఎంత పరికించి చూసినా అతని మొహంలో ఏ భావమూ కనుపించేదికాదు. చాలా వినయంగా నాన్నగారితో మాట్లాడి, మేము ఆ పక్కలకి వెళ్ళినప్పుడు తలవంచుకుని వెళ్ళిపోయేవాడు.

"మాకోసరం ఆ పువ్వు వదిలిపెట్టేవాడు! మాతో మాట్లాడాలనే కుతూహలం కనబర్చే వాడుకాదు!! కనీసం మంచినీళ్లు కావాలని అడిగిన పాపానైనా పోలేదు!!!

"కొన్నాళ్ళకి మా ముగ్గురికీ విసుగెత్తింది. "నీకోసరమంటే—నీకోసరమని" ఒకరి నొకరం ఏడిపించుకునేవాళ్ళం.

"పైకి లేదన్నా సావిత్రిమటుకు సావిత్రి, ఆ సంపెంగపూవు తనకోసమే నను కొనేది. ఉన్న ముగ్గురిలో కొంచెం చక్క నిది కాబట్టి అతను తననే మోహించా డనుకుంది! రమ పైకి అనకపోయినా అతను గీస్తున్న బొమ్మలన్నీ తనపోలిక లోనే వున్నాయనీ, తనమీదే అతనికిష్టమనీ అనుకునేది!

"నాకుమటుకు ఈ సమస్య అంతు యేమిటో కనుక్కుందామని బుద్ధిపుట్టింది. ఒకరోజున అతను నాన్నగారిదగ్గిర శెలవు పుచ్చుకుని వెళుతుంటే బల్లమీద పెట్టిన పూవుని చటుక్కున తల్లోపెట్టుకుని, నా తల అతనికి కనబడేటట్టు గుమ్మందగ్గిర వెనక్కితిరిగి నిల్చున్నాను.

"అడ్డంగా నిల్చున్న నన్నుచూసి, రాయి కాళ్లకు అడ్డంగా వుంటే ఎల్లా తప్పుకు పోతారో అల్లా తప్పుకుని, వంచినతలతో వెళ్ళిపోయాడు. ఎందుకో ఆ రోజంతా అతనిమీద నాకు కోపంగానే వుంది. వీడు తప్పకుండా, సావిత్రి మీదో, రమమీదో కన్నువేశాడనుకున్నాను.

"ఆ తరవాత చాలా రోజులకి మా మామయ్య మద్రాసు వచ్చాడు. మేమొక

రోజున బీచీకి షికారు వెళుతోంటే సుధాకర్ కనుపించాడు. అతను మామయ్యను పలకరించటం చూసి, అతనెవరని అడిగాను ఏమీ తెలియనట్టు."

"అతనా, సుధాకరని చాలా తెలివైన వాడు. బెజవాడలో నాతో చదువుకున్నాడు. పాపం బీదవాడు. ఏవో బొమ్మలు గీస్తాడు గాని డబ్బేమీ రాదు. దానికితోడు పెద్ద సంసారం. అతనికిప్పుడు ముగ్గురు పిల్లలు. భార్యను తీసుకుని ఒకసారి మనింటికి వస్తాడుట!" అన్నాడు.

నేను తెల్లబోయాను.

"ఇంటికి వెళ్ళగానే మిగతా యిద్దరికీ ఈ వార్త చెప్పాను. సావిత్రికి పెద్ద షాక్ యిచ్చినంత పనయింది!

"ఇదంతా జరిగి ఐదేళ్ళయింది. ఇప్పుడతనెక్కడున్నాడో మాకు తెలియదు. మా ముగ్గురికీ వివాహాలయి సంసారాలు చేస్తున్నాం. ఇప్పటికీ తలుచుకుంటే నవ్వొస్తుంది; ఆ నల్లవాడికోసరం ఎందుకు మేమంత తాపత్రయపడ్డామా అని.


"సావిత్రి మటుకు ఇంకా తనే అతని ప్రియురాలినని అనుకొనేటట్లు కనబడుతుంది. అసలు తమాషా ఏమిటంటే అతను ఆ పువ్వు ఎందుకు తీసుకువచ్చేవాడో, ఎవరికోసరమో నాకిప్పటికీ అర్థం కాదు!" అని ముగించింది కమల.

సులోచన ఓక్షణం కమల మొహంలోకి చూసి, "మీరు చెప్పేది నిజమే. మీ ముగ్గురిలో ఎవరికోసమైనా అపువ్వు తెచ్చివుంటే తప్పకుండా తన ప్రేమని వెల్లడిచేసేవాడు. దరిదాపు ఆరునెలలు వచ్చినప్పుడల్లా ఆ పువ్వు బల్లమీద పెడ్తున్నవాడు ఆమాత్రం సాహసించి ఉండలేకపోయాడంటారా? పోనీ, భయపడ్డాడేమో అంటే వివాహమయి పిల్లలున్న అతను దీనికి వెనుదీశాడంటారా? ఒకరికాకపోతే ఇంకొకరికైనా తన ప్రేమను తెలిపేవాడు. బహుశా మిమ్మల్ని తమాషాచేయడానికి అలా ప్రవర్తించాడేమో!" అంది.

"అబ్బే! మీరు పొరబడ్డారు. అతనలాంటివాడుకాదు. చాలా సీరియస్‌గా ఉంటాడెప్పుడూ. మమ్మల్ని నిజంగా తమాషాచేసేవాడయితే ఒక్కసారయినా మా ముఖంలో మార్పేమయినా వచ్చిందోలేదో చూడటానికి ప్రయత్నించడా? అసలు మాముఖం చూడటానికే భయమతనికి. కాని అదేమిటో సంపెంగపూవు మటుకు తేవడం మర్చిపోయేవాడుకాదు" తరవాత సెలవుతీసుకుని వెళ్ళిపోయింది కమల.

కమల వెళ్ళినతరవాత ఈ కథంతా విన్న సులోచన, తను నిజంగా ఇది కథగా వ్రాయదలిస్తే ఎలా ముగించటమా అనే సంధిగ్ధావస్థలో పడింది.





# జతపక్షి కోసం

వ్యాధి బాగా మోపయింది. ఇక అలసించ డానికిలేదు. ఇదివరకెల్లా, చేతిలో పైన లేదనో, సహాయంచేసేవాళ్లెవరనో, సెలవు లేదనో, ఏదోకారణంతో వాయిదా వేస్తూవచ్చేడు సత్యమూర్తి. ఇల్లాలిని ఆసుపత్రిలో చేర్చకపోతే అసలు స్వరూపమే దక్కుతుందో లేదో అని భయపడ్డాడు. వున్నపాటున ఆసుపత్రికి తీసుకుపోదలుచుకొన్నాడు. ఆరోజు ఆదివారమయిపోయింది. లేకపోతే అప్పుడే తీసుకుపోయేవాడే! రేపు తప్పదన్నాడు.

అంత బాధపడుతూన్నా ఇల్లాలైన రాధకి ఇల్లు విడిచిపెట్టి వెళ్ళడమంటే బెంగ! తనకోసంకాదు, భర్తకోసం, అంతకంటె ఎక్కువగా బిడ్డకోసం. ఇంకా ఒక రోజు వ్యవధి వుందికదా అని రాధ సంసారానికి అవసరమైనవి చెయ్యడం మొదలుపెట్టింది. అన్నీ తక్షణంజరగాలి. బియ్యం, గోధుమలు బాగుచేయించింది. మరలో పోయించి అవసరమైన పిళ్లు, మొరుము తయారుచేయించింది. గోంగూర పచ్చడి, కరిమేపాకు పచ్చడి చేసిపెట్టింది. మామిడికాయబద్దలు వూరవేసింది. చారుపొడి, కూరపొడి, కొబ్బరిపొడి, కందిపొడి కరిమేపాకుపొడి చేసింది. చిరితిండి లేకపోతే గౌరి అసలు వుండలేదని చెప్పి జంతికెలు, కారపుపూస, బూంది, చెగోడీలు, బెల్లపుమిఠాయి చేసిపెట్టింది. పాపం పొద్దున్న ఆరుగంటలు మొదలు రాత్రి పదకొండింటిదాక ఏదో పాటుపడుతూనేవుంది.

మర్నాడు సత్యమూర్తి కారణం తెలుపుతూ ప్రివిలెజ్ లీవుకి దరఖాస్తు తన పై అధికారియైన ఓవర్శీర్కి అందించేడు. భార్యని, పిల్లని తీసుకొని ఆడవారి ఆసుపత్రికి వురకలువేసేడు.

అక్కడ కొంత తతంగంవుంది. టిక్కెట్టు పుచ్చుకోవాలి. ధర్మాసుపత్రి కాబట్టి టిక్కెట్టుకి డబ్బు అవసరంలేదు. పరీక్షచేసే గదులు నాలుగున్నాయి. టిక్కెట్టు పట్టుకొని రాధ వెళ్ళగా ఈగది కాదు ఆగది, ఆగదికాదు ఈగదిఅన్నారు. చివరికి ఒకగదిలో టిక్కెట్టుతీసుకొన్నారు. పరీక్ష చేస్తామన్నారు.

అవతల సావిటిలో బెంచీమీద కూర్చున్న సత్యమూర్తి అక్కడి జన

వేకుమళ్ళ కామేశ్వరరావు

సమూహాన్ని చూస్తున్నాడు. అక్కడ ఆడ వాళ్లు, వాళ్ళకి తోడుగా వచ్చిన మగవాళ్లు ఉన్నారు. ఈ నవనాగరిక ప్రపంచమంతా ఎంత సుఖపడుతుందో కళ్లకి కనబడు తూంది. కాని దేవుడిదయవల్ల అక్కడికి వచ్చిన అందరి మొహాలలోను దైన్యం మాత్రంలేదు. స్త్రీలు సహజంగా ముస్తాబై ఉన్నారు. మనిషి చేసుకొన్నపాపం కొంత ఇక్కడ అనుభవించివేసి, తక్కినది మాత్రమే నరకలోకానికి పట్టుకు పోతున్నారు.

రాధని లేడీడాక్టరు పరీక్షచేసింది. "ఆసుపత్రిలో చేరతావా?" అని ప్రశ్నిం చింది.

"ఊఁ" అంది రాధ.

లేడీడాక్టరు యిచ్చిన మరొక దరఖాస్తు పట్టుకొని రాధ ఇవతలకి వచ్చింది. సత్య మూర్తి ఆ కాగితం అందుకొన్నాడు. దాని మీద చేరవలసిన వార్డునెంబరు వుంది. రెండో గేటుదగ్గిర గూర్ఖా కావలి అడ్డేడు. కాగితాలు చూపించగా లోపలకి వెళ్ళ నిచ్చేడు. ఆ కాగితం యెక్కడ చూపిం చాలో అడుగుక్కొంటూ సత్యమూర్తి ఒక గుమాస్తాదగ్గరకి వెళ్ళేడు. అతను అందు లోని వైనమంతా తెలియజేసి, సత్య మూర్తిచేత సంతకంచేయించేడు. "ఒంటి మీద యేవీ ఆభరణాలు వుండకూడదు" అంది నర్సమ్మ. ఇంతకీ రాధదగ్గిరున్న ఆభరణాలేమిటి! ముక్కువి, చెవులవి బంగారపు పూతవి! రాధ వాటిని తీసి ఇయ్యగా సత్యమూర్తి తన పర్సులో జాగ్రత్తపెట్టేడు. అతని జీతం తక్కువ కాబట్టి మంచానికి చార్జిలేకుండానే చేర్చు కొన్నారు. అక్కడినుంచి కాగితంమీద గుర్తించిన వార్డుకి వెళ్ళేరు. అక్కడ ఒక నర్సమ్మ కాగితాలు అందుకొంది. రాధ ఆకుపచ్చ చీర కట్టుకొంది. "ఇక్కడ తెల్లటివేగాని రంగువి పనికిరావు!" అంది నర్సమ్మ. రాధ తనతో తేలేదు. నర్సమ్మ ఒక తెల్ల లంగా, ఒక చిరుగుల తెల్ల జుబ్బా తెచ్చియిచ్చింది. వాటిని చూడ గానే రాధకి వొళ్ళు గరిపొడిచింది. తన దగ్గర మరొక గుడ్డలేదు. అందుచేత వాటిని కట్టుకొని, "తిరిగి మీరు వచ్చే టప్పుడు తెల్ల చీర, తెల్ల రవిక తీసుకు రండి!" అని భర్తతో చెప్పి "ఆసుపత్రి అంటే బెంగగా వుంది!" అంది.

"నీకు కొత్తకాదుకదా యిదివరకు చవిచూసేవున్నావు ఇతరచోట్ల!" అన్నాడు భర్త. ఆమెకి ధైర్యవచనాలు చెప్పేడు. అతను గౌరిని వెంటబెట్టుకొని యింటికి వచ్చేడు.

సత్యమూర్తికి అడపదడప యింటిపని తగులుతూంటుంది. కాని యిప్పుడు భారమంతా తనమీదేపడింది. ఇంటి పనులు చూసుకోవాలి. అటు ఆసుపత్రికి వెళ్ళి ఇల్లాలిసంగతి కనుక్కొంటూండాలి.

ఒక్కపూటకే యింటిలో గిన్నెలన్నీ నేలమీద పరిచేశాడు. యెటుచూసినా డబ్బాలే! అంతా కళ్లంలాగుంది.

భార్యని ఆసుపత్రిలో చేరుస్తానని ఒక మిత్రుడితో చెప్పగా, అతను "మీ బిడ్డని మాయింటికి పంపించు, తల్లి తిరిగి వచ్చే దాక" అని సలహాచెప్పేడు. సత్యమూర్తి సంతోషించేడు. ఆరోజు సాయంత్రమే తీసుకువెళ్ళి దిగబెడదా మనుకొన్నాడు.

సాయంత్రం మరొకమాటు అసుపత్రికి గౌరితోకూడ వెళ్ళి చూశాడు. తిరిగి వస్తూండగా దారిలో మరొక స్నేహితు డెదురయేడు. బాతఖానీలోపడ్డాడు. పొద్దు పోయింది. తండ్రి, కూతురు నెమ్మదిగా యింటికి చేరుకొన్నారు.

"నాన్నా! నాన్నా! వాళ్లఇంటికి తీసుకు వెళతానన్నావుకాదూ!" అంది గౌరి.

"ఇవాళ టైములేదులే! రేపు!"

పొద్దున్న వండినపదార్థాలే పుచ్చు కొన్నారు. గౌరి నిద్రపోయింది.

సత్యమూర్తి మనస్సు మనస్సులోలేదు. అట్టిసమయాలలోనేగాని భార్య ఎడబాటు ఎరగడు. అమె కనబడకపోడమే ఒకబాధ. బాధని విమర్శించ దలుచుకొన్నాడు. తగిన కారణాలున్నాయా అని తర్కించేడు. కాని అది దేనికీ లొంగేటట్లాకనబడ లేదు. బెంగకి అంతుకనబడలేదు. తనకిది అంత్యకాలమేమో అనిపించింది. చుట్టు చీకట్లు అతని భయాన్ని బలపరిచేయి. తనపక్క కూతురుండడమే తనకి ఇప్పటి రక్షణగాతోచింది. "ఈబిడ్డ లేకపోతే నేనేమై పోయుండేవాణ్ణో! ఇంకా తీసుకు వెళ్ళి స్నేహితుడి ఇంటిదగ్గర దిగపెట్టేశాను కాదు! దైవం అదొకమేలు చేశాడే! లేక పోతే నాపని మట్టమయేది!" అని కొంత అనునయించుకొన్నాడు. నిద్రపోతూన్న బిడ్డని దగ్గరికిలాగుకొన్నాడు. ఈజీవితానికి అబిడ్డే ఆధారంగా కనబడింది.

తెల్లవారింది. ఇంటిపనులు ఒకంతట తెమలవు! "ఎంతపని! ఎంతపని! అందు చేతే కాబోలు రాధ ఎప్పుడూ తీరికలేదని గోలపెట్టేది. తెముల్చుకొందామన్నా తెమిలే టట్లాకనబడలేదు. అప్పటికీ మడి, తడి అచారం,మొదలైనవాటికిస్వస్తిచెప్పేను."

ఇంత ఉడికించుకోడం పొట్టనింపు కోడం. ఈ ఆశయం నెరవేరితే 'చాలు! అనిపించింది. ఎక్కడి గిన్నెలక్కడ పార వెయ్యగా గౌరి "ఇదేమిటినాన్నా ఇలాగు చేసేవు! నీకు వంటచెయ్యడం రాదే మిటి!" అని నవ్వింది. ఏమి సమాధానం చెప్తాడు. గౌరిని తీసుకొని అసుపత్రికి పరు గెత్తేడు.

అసుపత్రివిధులు కఠినంగాఉన్నాయి. పాస్ సులువుగా ఇయ్యబడదు. అసుపత్రి వారి అన్నం తిననివారికి రొట్టె, పాలు ఇయ్యబడవుట! దేవుడిదయవల్ల శాఖా హారం వేరు! శాఖేతరాహారం వేరు! చూడ వచ్చినవారు రోజుకి ఒక్కసాయంత్రం నాలుగుగంటలప్పుడు తప్పితే తతిమా వేళ లలో వీలులేదు. పొద్దున్న పదిగంటలకి వెళ్ళిన సత్యమూర్తి, భార్యని చూద్దామని తల్లడిల్లుతున్నాడు. "గేట్‌వాడి చేతులలో ఒకఅణా పడెయ్యండి, వాడే పోనిస్తాడు" అని సలహా చెప్పేడు ఒక సోదరుడు. "జేబులో అణాఉంటే నేను ఈ ఊరే కొనేశేవాణ్ణి!" అని సమాధానంచెప్పి, సత్యమూర్తి ఉపాయాంతరం కోసం చూస్తున్నాడు. పదకొండు కొట్టేరు. ఇంతటిలో అహారపాస్‌ఉన్న ఒక అసామి వచ్చేడు. అతన్ని బతిమాలికొని, తిరిగి ఇప్పుడే వచ్చేస్తాననిచెప్పి, ఆ పాస్‌తీసుకొని లోపలకిదూరేడు. ఒకమాటు భార్యని కళ్లతో చూసేడు.

ఆమె "అపరేషన్ రేపు చేస్తారుట!" అని చెప్పింది.

అమ్మయ్య అనుకోడానికికూడ లేకుండ సత్యమూర్తి ఇవతల పడ్డాడు. బిడ్డతోకూడ ఇల్లు చేరుకొన్నాడు. మళ్ళీ సాయంత్రం నాలుగింటికివచ్చి తీరుపాటుగా కూర్చొని మాట్లాడుకొన్నారు. అక్కడ ఉన్న ఒక నర్సుతో "ఆమెకి అపరేషన్ రేపుకదా! నాకు వార్డుదగ్గరికి రావడానికి అనుజ్ఞ ఇప్పించవలసింది" అని కోరేడు.

ఆమె "మీరు లేడీడాక్టరుని అడగండి!" అంది.

అతను లేడీడాక్టరుకోసం వెతికేడు. ఎక్కడాలేదు. సాయంత్రంపూట ఆమె వుండదు అని ఎవరో చెప్పగా ఆసంగతి మళ్ళా నర్సుతో చెప్పేడు. "అయితే రేపు వచ్చి పాస్‌తీసుకోండి!" అంది నర్సు.

ఆమాట అతనికి నచ్చింది. వేళయి పోగా పిల్లని తీసుకొని ఇంటికి బయలు దేరేడు.

గిన్నెలమీదపెట్టిన మూతలన్నీ ఎలకలు తోసివేసి, తిన్నంత తిన్నాయి, పాడుచేసి నంత పాడుచేశాయి. అపూటకి యెట్లాగో తంటాలుపడ్డారు.

ఇంటిలోవున్న మంచినీళ్లయిపోయేయి. అదొక పెద్దసమస్యగా తయారయింది. అతనికి అడుగడుగున భార్య యొక్క చాకిరి విదితమవుతూంది. ఇంటికి నాలు గిళ్ల అవతలే వీధికొళాయి వుంది. సాయింత్రం కాస్తసేపు, పొద్దున్న కాస్త సేపుమాత్రమే నీళ్ళువస్తాయి. అక్కడ గిన్నెలు, బిందెలు, కుండలు, డబ్బాలు రకరకాలవి క్యూగా పెట్టివుంటాయి. తాను అనేకపనులమీద వుంటాడు. కూతురు చిన్నపిల్ల! అక్కడ బిందెపెడితే యెవరి జవాబుదారి? తిరిగి తెచ్చేదెవరు? ఇది మదరాసు! యుద్ధవీరాంగనలకేగాని కొళాయినీరు చిక్కదు. రాధే వాళ్లతో జగడమాడలేక దగ్గరే ఒక స్కూలు ఆవ రణలోవున్న నూతినీళ్ళు తోడి తెచ్చుకొం టుంది. ఇక తనకెలాగు సాధ్యమవు తుంది. అయినా చూద్దామని ఒకచిన్న గిన్నెయిచ్చి కూతురుని నీళ్ళకి పంపిం చేడు. అపిల్ల అక్కడ నిల్చుని నిల్చుని తిరిగి ఏడుస్తూ ఉట్టిగిన్నెతో చేరింది. తండ్రి ఆందోళనపడ్డాడు. ఎవర్తో వీరాం గన బిందెతో పక్కనివేసి కొట్టిందట! "సరి! నీరులేదు సరికదా! చికిత్సచేయ వలసిన అవసరమొకటి ప్రాప్తమయింది!" అనుకొన్నాడు. మూడుపూటల కాపడంతో అది దైవానుగ్రహంవల్ల తగ్గింది.

మంచినీళ్లసమస్య తీవ్రతరమైంది. పక్కనున్న తోటలోంచి రెండురోజులకొక బిందె తెచ్చేటట్లుగాను, నెలకొక రూపాయి ఇచ్చేటట్లుగాను ఒక పనిమనిషిని నిర్ణ యించేడు.

ఆరోజున అపరేషన్‌చేస్తారు. పెందరాడే కడుపులో ఇంతవేసుకొని తండ్రి, కూతురు బయలుదేరేరు. ఇంటికి ఆసుపత్రి దూరం. శ్రమపడి చేరుకొన్నారు. గేటువాడు అడ్డు పెట్టేడు. నిన్న సలహాచెప్పిన నర్సు ఎక్క డుందో! దారీ తెన్నూ కనబడలేదు. ఇల్లాలి అపరేషన్‌కి దగ్గరవుండి ధైర్యంచెప్పుదా మనుకొన్నాడు. కాని లోపలికి పోయేమార్గ మెట్లా? ఏదైనా తిరిగి వెనక్కి రాదలు చుకోలేదు. సాయంత్రం నాలుగింటికిదాకా

అక్కడే పడుండదలుచుకొన్నాడు. వట్టి అదుర్దావల్ల ఏమీ ప్రయోజనంకనబడలేదు. అప్పటిదాక పిల్లతో కాలక్షేపంచెయ్యడం ఎలాగు అని పక్కనేవున్న మ్యూజియం లోకి తీసుకువెళ్ళేడు. కాళ్ళు పీకెట్టేదాకా తిరిగి తిరిగి, కూర్చుని, విశ్రాంతితీసుకొని, తమతో తీసుకువెళ్ళిన ఫలహారాన్ని భక్షిం చేరు. మళ్ళీ మరికొంత తిరిగేరు. పక్కనే వున్న లైబ్రరీలోకి వెళుతూండగా 'లోపలకి చిన్నపిల్లలు వెళ్ళకూడదు' అన్నాడు గేటు ఆసామి. గుమాస్తాతో చెప్పకోగా 'ఊరికే చూపించి వెంటనే బయటికి రండి!' అని సలహాచెప్పేడు. లోపలకి వెళ్ళిచూసి తక్షణం బైటికివచ్చేరు. నాలుగు సమీపిస్తూండగా బయలుదేరేరు. ఆసుపత్రి గేటుదగ్గర పందలకొద్దీ కని పెట్టుకు కూర్చున్నారు. కావలివాడు విడిచిపెట్టగా వరదనీటిలాగు జొరబడ్డారు.

ఇల్లాలు కిందిఅంతస్తులో లేదు. ఆప రేషన్ చేసినతర్వాత మేడమీదికి మార్చే రని విని, కనుక్కొంటూ ఆమె వున్న మంచందగ్గిరకి వెళ్ళేడు. సత్యమూర్తి చిన్న బల్లమీద కూర్చున్నాడు. "కాళ్లు నొప్పులు! చేతులు నొప్పులు!" అంటూ గోలపెడుతూంది రాధ!

సత్యమూర్తి తనచేతులలోకి ఆమె చెయ్యితీసుకొన్నాడు. గౌరి కాళ్లు పట్టింది.

ఇల్లాలు యమబాధ పడుతూంది. పెనిమిటిని తిడుతూంది.

ఇంతటిలో ఒక తోటీది మునిముని నవ్వులు నవ్వుకొంటూ వచ్చింది. "కింది వార్డులో అమ్మగారికి పనిచేసేనండి!" అంది.

"ఏమిపనిచేసేవు! ఆసుపత్రినుంచి వెళ్ళేటప్పుడు కనబడు" అని చెప్పింది రాధ.

సత్యమూర్తి వూరుకొన్నాడు.

ఇద్దరు ఆకుపచ్చడ్రెస్సులవాళ్లు వచ్చి "మేమే అమ్మగారిని ఆపరేషన్‌గదిలోకి తీసుకువెళ్ళేం!" అన్నారు.

"వీళ్ళకి పైస పడవెయ్యాలి! ధన మూలమిదంజగం అని మహాఋషులు ధనం విలువ పుట్టకపూర్వమే దాని విలు వను స్థిరపరిచేరు" అనుకొంటూ జేబు లోంచి ఒక బేడ తీసేడు.

వాళ్ళిద్దరిలో ఒకడు ఆశ్చర్యపోయేడు, రెండోవాడు పెదిమెలు బిగించేడు.

"నాస్తోమత యింతే!" అన్నాడు సత్యమూర్తి.

వాళ్ళిద్దరూ ఆ బేడ పుచ్చుకోకుండానే వెళ్లిపోయేరు. రెండురూపాయలు వాళ్లకి రివాజుట.

"మనం యింటికి వెళ్ళేటప్పుడు పని వాళ్ళకేదేనా పడెస్తేనేగాని వూరుకోరు!" అంది రాధ.

"అంత మంచిరోజువస్తుందా!" అని సత్యమూర్తి మనస్సులో వేదన పాలయేడు.

ఇల్లాలు యమయాతన పడుతూంది. ఆతనేవో మంచిమాటలు చెప్పుతూ ఆరింటిదాక కూర్చున్నాడు. గంటకొట్టగా నెమ్మదిగా లేచి, కూతురిని వెంటబెట్టుకొని

ఆసుపత్రి సరిహద్దులుదాటి, యింటివైపు మళ్ళేదు. అప్పుడు యింక వంటచెయ్యలేక, చిలగడదుంపలు వుడకబెట్టుకు తిన్నారు.

రాధకి ఒక బాధకాదు! అన్నీ బాధలే! ఇంటిదగ్గిర మొగుడేమి అవస్థపడుతున్నాడో, సంరక్షణ చాలక పిల్ల యేమి పాడైపోతుందో, యింటిలో యెవరూ లేక పోగా ఇల్లేమైపోతుందో, డబ్బాలమీద మూతలు సరిగా పెడుతున్నారో లేదో, మొదలైన మనోబాధలు! అపరేషన్ తాలూకు శారీరకబాధ!

సాయింత్రం నాలుగవడంకోసం ఇంటి దగ్గిర సత్యమూర్తి, ఆసుపత్రిలో రాధ కనిపెట్టుకు కూర్చునేవారు.

సత్యమూర్తి వూళ్ళో యేదో పనిచూసుకొని ఆసుపత్రికి కొంచెం ఆలస్యంగా చేరేడు. అక్కడ వున్న నర్సు "మీరు యింకా రాలేదని మీఆవిడ ఏడుస్తూంది!" అని చెప్పింది. "ఇదిగో!" అంటూ సత్యమూర్తి యెదుటపడ్డాడు.

"అమ్మాయిని తీసుకురాలేదేమి?" అని అడిగింది రాధ.

"ఇంకా బడినుంచి రాలేదు. పైగా నేను వూళ్ళోకి పనిమీద వెళ్ళి తిన్నగా యిక్కడికే వచ్చేశాను!

"పిల్లకోసం నేను ఇదైపోతూంటే!"

"రోజూ వచ్చిఛూస్తూనే వుందికదా!"

"అది కళ్ళకి తట్టినట్లుగా వుంటే!"

సత్యమూర్తి ప్రతి మంచంచుట్టూ చేరి మాట్లాడుకొంటూన్న మనుష్యులవైపు చూస్తున్నాడు.

రాధకి ఆపరేషన్‌బాధ కొంచెంతగ్గింది. "ఆ మంచంమీది ముసలిదాని కెవ్వరూ లేరు పాపం! యింటికి పొమ్మన్నా పోవడంలేదు. రేపు వెళ్ళకతప్పదని ఖచ్చితంగా చెప్పింది లేడీడాక్టరు!" అంది.

"పాపం!"

"ఇక్కడ ఈ మంచంమీదిమనిషి కిందికి దిగి నడవవద్దే అంటే వినదు. పచార్లు చేస్తూనే వుంటుంది. కుట్లు విడిపోయేయి. మళ్లావేశారు!" అంది.

"బాగానే వుందిలే!"

"ఈ యెదుటి రెండో మంచంమీది మనిషికి కళ్ళుతిరిగి నోరు పక్కకి పోతూండగా నేను చూశాను. సిస్టరుని పిలవగా వచ్చింది. డాక్టరు వచ్చేలోపల మళ్లీ ఆళ్లాగేవచ్చి ప్రాణంపోయింది."

"అయ్యో! పాపం! ఎంత పనయింది!"

"గదిలో పేషెంట్లంతా మాకు భయమంటే మాకు భయమని గాబరాపడ్డారు. ఒకత్తెవచ్చి నామంచంమీద పడుకొంది. ఇంతటిలో సిస్టరు వచ్చింది. దాని నటన, మాటలు చూచి యేడ్చేవాళ్ళు నవ్వడం మొదలుపెట్టేరు" అంది.

"సరి! సరి!"

"మూడేళ్ళకిందట నేనున్న ఆ ఊరి ఆసుపత్రికంటె ఇదొక అంశంలో నయమండి! ఇక్కడా లోట్లున్నాయనుకోండి. నర్సులు పేషెంట్లనుచూడడం తోటీలమీద విడిచిపెట్టరు. అక్కడనర్సులు రాత్రుళ్లు హాయిగా నిద్రపోయేవారు. అదేమిటమ్మా అని అడిగితే 'నీకు రోగంకాబట్టి నీకునిద్ర రాదు. అంచేత నీవంతు నావంతుకూడ

నేనే 'నిద్రపోతున్నా'నని సమాధానం చెప్పే వారు. కాని ఇక్కడ పాపం శ్రమపడి ఉపచారంచేస్తారు. మా మోళ్ళు ఇచ్చే వాళ్లమీద కొంచెం అభిమాన ముంచినా, లేనివాళ్ళమీద అశ్రద్ధ చూపించరు" అంది రాధ.

నర్సులు చేస్తూన్న ఉపచారానికి సత్యమూర్తి చాలసంతోషించేడు.

"జిహ్వ బొత్తిగా చచ్చిపోయిందండి. కాస్త చింతకాయపచ్చడి నూరితెచ్చి పెడుదురూ!" అంది రాధ.

"అలాగే!"

"మీ ఆరోగ్యం సంగతి జాగ్రత్తగా చూసుకోండి. అక్కడికి ఇక్కడికి ఎండలో తిరుగుతున్నారు. పని పాట్లు! పైగా తిండి సరిగా లేదు!"

"నేనూజాగ్రత్తగానే ఉంటున్నాను!"

గంట కొట్టగా లేచి ఇంటికి బయలు దేరేడు. రెండురోజులయింది. రాధమంచం మీద కూర్చుంటూంది. కాస్త అటుఇటు నడుస్తూంది. ఇంక ఆసుపత్రినుంచి వెళ్ళమనడం రోజులలో ఉందని తెలుసు కొన్నారు. ఆమె కట్టుకొనిరావడానికి ఒక తెల్లచీర తెల్లరవిక తెమ్మనిచెప్పింది.

ప్రతిరోజు సత్యమూర్తి ఇంటెడు చాకిరి చేసుకొనేవాడు. రాత్రుళ్లు ఒళ్ళు నొప్పులుగా వుండేది. నిద్ర సరిగా పట్టేదికాదు. మధ్యమధ్య లేచి కూతురివైపు చూడవలసి వచ్చేది. ఆ పిల్ల నిద్రలో పక్క ఒకచోట, తానొకచోట వుండేది. దానిని తీసుకువచ్చి మళ్ళీ పక్కమీదికి చేర్చేవాడు. తిండి తిప్పలా, సరిగా లేవు! తన ఒంటికి వచ్చే టట్లు కనబడింది. చివరకి రానేవచ్చింది. ఒక లంఖణంచేసేడు, అక్కడ రాధ ఎట్లాగుందో అని గాబరాపడుతూ ఆసుపత్రికి పరుగెత్తేవాడు. "జీవితమే ఇట్లాంటిది. అదుర్దాలతో నిండినది. భగవంతు డనే దిక్కు లేకపోతే జీవితం నిరాధారం!" అని అనునయించుకొన్నాడు.

భర్తకి సుస్తీచెయ్యగా రాధ విచారించింది. "రేపు సాయింత్రం డిశ్చార్జిచేస్తామని చెప్పేరు" అంది రాధ.

సత్యమూర్తి సంతోషించేడు.

గౌరి గంతులువేసింది.

మర్నాడు సత్యమూర్తి కొబ్బరికాయ, పువ్వులు పట్టుకువెళ్ళేడు. పనిమనుష్యుల కొక అర్ధరూపాయిమాత్రమే చెల్లించేడు. ఆసుపత్రి దాటేముందు కొబ్బరికాయ కొట్టి అక్కడివాళ్లకి ప్రసాదం, పువ్వులు ఇచ్చేడు. రాధని రిక్షామీద కూర్చోబెట్టి పూలరథంమీద తెచ్చినట్లుగా యింటికి తెచ్చేడు.



# కలదో లేదో

[రెండంకాల నాటిక]

## 1

[వాసు వయసు 26. బుష్‌కోటూ, నలిగిపోయిన తెల్ల పంట్లామూ వేసుకుంటాడు. క్రోమియం స్ట్రాపుతో వున్న పెద్దవాచీ అతని చేతికి కంకణంలా వుంటుంది. అయినప్పుడూ కానప్పుడూ నవ్వు తెప్పించుకోగలడు. చెదరని మనసు అతనికి అంగరక్ష.

గవరయ్య 50 యేళ్ళవాడు. పల్లెటూరి రైతు. నొప్పించేవిషయమైనా సూటిగా మాట్లాడుతాడు. బనీనుజేబులో పొగాకుచుట్ట ఎప్పుడూ అవసరానికి అందుబాటుగా వుంటుంది.

మాణిక్యాలరావు వయసు 52. ఆరితేరిన ఘటం. కావల్సినంత దేవుడిచ్చాడు కనక, రాజకీయాలు—నష్టం రానంతవరకూ—అతనికి కాలక్షేపం. లొంగడు—బెణకడు. పూర్వులదగ్గిర్నుంచి తెచ్చుకున్న దర్జా మాటలోనే కాక, స్వభావంలోకూడా వెళ్ళబోస్తాడు.

స్థలం: మాణిక్యాలరావుగారి సావిడి. మూడు కర్రకుర్చీలూ, ఒక పొడుగాటి బల్లా, రెండు చేతుల కుర్చీలూ వుంటాయి. గోడకి వేలాడదీసిన బొజ్జ వినాయకుడి పటం కొస్త వంకరగా వుంటుంది. ముగ్గురూ మూడుచోట్ల కూచునివుంటారు.]

(మధ్యాహ్నంవేళ)

వాసు: (రాగయుక్తంగా).

కలడందురు దీనుల యెడ
కలడందరు పరమయోగి గణములపాలన్
కలడందు రన్నిదెసలను
కలడు కలండనెడువాడు కలడో లేడో.

---

యస్. ఆర్. చందూర్

---

గవ: భేషుగ్గా అన్నావయ్యా—బలే భేషుగ్గా అన్నావ్. ఎవడు చూసొచ్చాడు చెప్పా—మట్టి మట్టిలో కలుస్తుంది—అంతే! ఎవడి నోటికొచ్చింది వాడు అంటూంటాడు.

మాణి: అదికాదు గవరయ్యా! భగవంతుడు 'లేడు' అనేందుకంటె 'ఉన్నాడు' అనేందుకు ఎక్కువ ఆధారాలున్నాయి. చార్వాకుడి మతానికి ఈ పవిత్రావనిలో ఆస్కారంలేదు. వేదఘోషలో ఆర్యులూ, ఉపనిషద్వాక్యంలో మహర్షులూ కాలానికి కట్టుబడని సత్యస్వరూపం తెలుసుకున్నారు. శంకరాచార్యుడు తన గీతాభాష్యంలో ఏం చెప్పాడనుకున్నావ్?

గవ: అదే వద్దండి—మాణిక్యాలరావుగారూ! శంకరాచార్యులూ, పురాణం శాస్తుర్లూ ఏంచెప్తే నాకేం! మీరేమంటారు?

వాసు: మామయ్యా—గవరయ్యబాబుకి సెకండ్‌హేండ్ సరుకు పనికిరాదు. అంతా Untouched by hand కావాలి.

గవ: అదేమిటి—సీనయ్యా ఆలా అంటావ్. అంటొచ్చుడా—హరిజన ఫండుకి నేనూ కాస్తో కూస్తో ముట్టజెప్పాను. ఈచేత్తో యిచ్చేది ఆచేతికి తెలియ కూడదన్నారు. కనక పట్టీలో పేరేయించుకోలేదు—అంతే.

వాసు: Untouched by hand—అనగా చేయితగలకుండా తయారైన కంపెనీ సరుకన్నమాట. ఇంతకీ నీ వోటు ప్రగతీ పార్టీకేనా?

గవ: కాక?

మాణి: గవరయ్యా, నీలాంటి హుందా రైతు ఆ పార్టీలో వుండటం మాకు తలవంపుగావుంది. ప్రగతీ పార్టీకి భవిష్యత్తులేదు. ఆ పార్టీసభ్యులకి ముందుచూపు లేదు. నీతీ జాతీలేని వెర్రికుట్టెలువాళ్ళు.

గవ: మాణిక్యాలరావుగారూ, నన్నేమన్నా అనండి పడతానుగాని—మా పార్టీనసకండి. ధర్మపన్నాలు చెబుతూ రైతుల్ని పీల్చి పిప్పిచెయ్యరు మావాళ్లు.

మాణి: ఎంతమాట గవరయ్యా! మన వూరికీ, టంకురోడ్డుకీ కంకరోడ్డు వేయించింది మాపార్టీ—మా సంస్కృతిపార్టీ—కాదూ! మొన్న వేసంగికి చెరువు తవ్వించిందెవరి పార్టీవోయ్! సంస్కృతిపార్టీ ప్రజల హక్కులకోసం పోరాడుతుంది.

గవ: ఎక్కడ—వల్లకాట్లోనా?

వాసు: అక్కడ పరమశివుడు తన జటాజూటంతో విలయనృత్యం చేస్తాడు. మేము తియ్యబోయే పిక్చర్లో అదికూడా వుంటుంది.

గవ: ఏం? సినిమాతీస్తావా—నాయనా! అంత ఖర్మమేమొచ్చింది, నాలుగెకరాలు దున్నకోక!

వాసు: థాంక్స్. నేను కళోద్ధారణకై పుట్టాను.

గవ: మాటలు నేర్చావే—శీనయ్యా!

మాణి: మా శ్రీనివాసమూర్తి పట్నవాసప్పుడర్జా అంతా అలవరుచుకున్నాడు. నాయనా, పట్నంలో అప్పుడప్పుడు మహనీయులిచ్చే లెక్చర్లు వింటూంటావా?

వాసు: దినమూ అదేపని. వినలేక చెవులు హోరెక్కిపోతాయి. వెనక హిట్లరు—చచ్చి స్వర్గానో, నరకానో వున్నాడు—ఒక్కొక్క రోజున పన్నెండు చోట్ల వుపన్యాసాలు యిచ్చేవాడట. నేను నిత్యం పన్నెండు వుపన్యాసాలు వింటాను పట్నంలో.

గవ: పట్నంలో మనుషులకి వూకదంపుగా వాగడం మినహా మరొక పనిలేదు కాబోలు. ఇక్కడ పురాణంశాస్త్రుల్లు యింటింటికీపోయి పిలుచుకొచ్చినా వంద మంది పోగవరు. అదెందుకు పోనిద్దురూ! మాణిక్యాలరావు బాబూ, అబ్బాయి ఎప్పుడొస్తాడు? సీమనుంచి ఒక తెల్లదాన్ని వెంటబెట్టుకురాడుకదా!

వాసు: హృదయానందంబావ ఆమాదిరి పోకిరీ కాదు. మామయ్యా యీ వాడు కాకపోతే రేపైనా మంత్రి అవడం ఖాయం. వాళ్ల నాన్న Political future కు దెబ్బ తగలనివ్వడు.

గవ: అయితే చూస్తూ చూస్తూవుండగా మాణిక్యాలరావుగారు మంత్రి అయిపోతారన్నమాట.

మాణి: మీ అందరి అభిమానం, ప్రాపకం...

గవ: నాలాటివాడి దెంత బాబూ! గుడ్డికన్ను తెరిస్తే యెంత మూస్తే యెంత!

వాసు: ఈ గుడ్డికన్ను గుప్పెట్లోవున్న వోట్లసంఖ్య చెప్పనా?

గవ: కన్నుకి గుప్పెటేమిటయ్యా—మహాషోకుగా మాట్లాడుతున్నావ్!

వాసు: దాన్నే యింగ్లీషులో...

గవ: వొద్దు బాబూ. ఇంగ్లీషువాడు పోయినా భాషాదాస్యం మనల్ని వొదలడంలేదు.

మాణి: చూడు, గవరయ్యా, అక్కడే మీపార్టీ అవకుసులో కాలేసింది. ఒక శుభోదయాన మనం యింగ్లీషు రద్దుచేశామనుకో. ప్రజాజీవితం యేమైపోతుంది?

వాసు: అప్పచ్చి అయిపోతుంది.

మాణి: ప్రజాజీవితం స్తంభించిపోతుంది. కోర్టులూ, రైళ్ళూ, తపాలా వ్యవహారాలూ, విమానశాఖా—ఠక్‌మని బంద్పైపోతాయి. ఇంగ్లీషుస్థానే మరొక భాషని మనం నేర్చుకునేదాకా యీ సమస్యని వోర్పుతో పరికించాలి. ప్రగతి పార్టీ పంథా మేమెంతమాత్రం ఆమోదించలేం.

గవ: ఏంబాబూ—మీపార్టీలోవాళ్ళంతా ధనవంతులు. మీ అబ్బాయిల్ని దూరపుసీమలకి చదువులకని పంపిస్తారు. అసలు సంస్కృతిపార్టీయే భాగ్యవంతుల పార్టీ. వాళ్ళకి మా కష్టసుఖాలు అంటవు.

వాసు: మామయ్యా, నేనేపార్టీకి చెందుతాను?

[సీమంతిని ప్రవేశం, 23 ఏళ్లు. చామనచాయ. కోలమొహంలోని చక్రాల్లాంటి కళ్లు అందరినీ ఆజ్ఞాపిస్తాయి. మాటకి మాట చెప్పగలిగే స్వభావం. చీరె, జాకెట్టూ నవనాగరికత సూచించకపోయినా నాజూకు కనిపింపజేస్తాయి. మాణిక్యాలరావు భార్య చనిపోవడం చేత కూతురు సీమంతినియే యింటికి పెత్తనదారు. ఆడ్డాల్లో బిడ్డగా వున్నప్పుడే సీమంతినిని వాసుకి యిద్దామనుకున్నారుగాని కాలం ఖర్మం కలిసిరాకపోవడంవల్ల ఆ మూడు ముళ్లూ పడలేదు.]

సీమంతిని: (వెటకారం వొలకబోస్తూ)—ఓహో—గుడ్లగూబ యింకా యిక్కడే వున్నాడే! ఏంబావా, పట్నంప్రయాణం వాయిదాపడిందా?

వాసు: కాదు, సీమంతీ, హృదయానందం యీపూట వస్తున్నాడని తెలిసి...

సీమం: నిజమా—నాన్నా!

మాణి: అవును తల్లీ.

సీమం: (యింకా కూచోకుండానే) అన్నయ్య యెంత మారిపోయివుంటాడో! కాస్త తెల్లపడికూడా వుంటాడు—సీమగాదూ వెళ్ళింది!

వాసు: బావ బూడిదరంగుమనిషి. (సీమంతిని పక్కగా వెళ్ళి నుంచుని యేదో ఆలకిస్తున్నట్టు) జట్కాచప్పుడు...(దూరంలోకి చూస్తూ) 'అదిగో ద్వారక... ఆలమందలవిగో...

గవ: హుషారైన మనిషి సీనయ్యబాబు.

సీమం : అదుగో చిన్నన్నకూడా వస్తున్నాడు. అవిడెవరు చెప్మా...యెత్తు మడమలజోళ్ళూ, హాండ్‌బాగూ, మూతిమీద జేబురుమాలూ (వాసుతో ప్రయివేటుగా) బావా, ప్రబంధకన్య మనగృహం పావనం చెయ్యబోతోంది.

వాసు : నా స్వప్నసుందరి యీమే!

సీమం : ఎన్నో స్వప్నసుందరి, బావా?

[ప్రవేశం ముందు సత్యకీర్తి. మాణిక్యాలరావు రెండో కొడుకు. "సుపుత్రా కొంపపీకరా" బాపతు. మొండిఘటం. తిట్లూ దీవెనలూ అతనిని కదిలించలేవు. వాసువయసే. హాఫ్‌సూటూ, కాళ్ళకి చెప్పులూ. రాత్రిళ్ళుకూడా అతను హాట్ తీస్తాడో తియ్యడో అనుమానం. హాట్ యిటూ అటూ సవరించుకోడం, నెత్తిమీదనుంచి చేతిలోకితీసుకోడం, చేతులోనుంచి తీసి నెత్తిమీద పెట్టుకోడం—అతనికి అలవాటు. ఓటమి అనేది అతని నిఘంటువులో లేదు.

అతని వెనక బెరుకుబెరుకుగా నుంచుని సువాసనేకాక కాంతిని కూడా విరజిమ్మే కన్య తటిల్లత. సీమంతిని చెప్పినట్టు ఎత్తుమడమల జోళ్ళు, హాండ్‌బాగ్ ప్లాస్టిక్‌ది, మూతిమీద రుమాలు, చోళీ, ముదురురంగు సిల్కు-చీర, బాబ్‌డ్ హెయిర్ మొదలైన వేషాలన్నీ కలిసి తటిల్లతని స్వప్నసుందరుల లిస్టులో చేరుస్తాయి. ఈ వేషాలన్నిటికీ వెనక ఒక లేత హృదయం లేకపోలేదు. సీమంతినికంటె ఒకయేడు పెద్దదైనా అయివుండవచ్చు—చిన్నదైనా అయివుండవచ్చు.

ఇక హృదయానందం. డబుల్ బ్రెస్ట్ కొటన్ సూటూ, నెక్‌టై. కాలిజోళ్ళ పాలిష్ మెరుస్తూవుంటుంది. ఒక చూపువాసి పొడగరి. వయసు 27–29 మధ్య. మనుషులందరూ కొత్తగా కనిపిస్తూవుంటా రతనికి.]

మాణి : (ఎదురెళ్ళి కొడుకుని కౌగిలించుకోడు — కాని మొహంలో సంతోషం కనిపిస్తుంది) అమ్మాయ్—తొందరగా కాఫీ పెట్టించు. (సీమంతిని లోపలికి వెడుతుంది. సత్యకీర్తి మినహా మిగతావాళ్ళు కూచుంటారు.)

సత్య : నేను మీనంబాకమ్‌లో కాయకపోతే తను తిన్నగా పోయి డ్యూటీలో జాయినవుదా మనుకున్నాడు.

మాణి: (హృదయానందాన్ని) అట్లారా—అబ్బాయ్!

హృ: ఇప్పుడైతే మాత్రం! రానూ పోనూ జట్కా కట్టించుకొచ్చాను. రాత్రి మెయిల్‌కి వెళ్ళిపోవాలి.

గవ: ఏంబాబూ హృదయానందం రంభలాటిపిల్లని వెంటేసుకొచ్చావ్! గవరయ్యమాట పొల్లుగాదు, సీమలో దొరసానులు కాక మన పిల్లలుకూడా వున్నారా, నాయనా!

హృ: గవరయ్యా, పొరబడుతున్నావ్. ఆ అమ్మాయి సత్యకీర్తి స్నేహితురాలు—తటిల్లత.

గవ: అట్లాగా—పొలంబోవాలి మాణిక్యాలరావుగారూ నేనెళ్ళొస్తానండి. (గవరయ్య నిష్క్రమిస్తాడు.)

మాణి: మనం లోపలికివెళ్దాం. (హృదయానందం ఒక్కడే తండ్రిని అనుసరిస్తాడు. సత్యకీర్తి సంజ్ఞ చెయ్యగా తటిల్లతకూడా వారిద్దరి వెనకాలే లోపలికి వెడుతుంది).

వాసు: (ఎవరూ వినడంలేదుకదా అని యిటూ అటూచూచి) కీర్తీ, నన్నుతిట్టి లాభమేమిటి? నెల్లాళ్ళక్రితం పదివేలు పట్టుకెళ్ళాం. మళ్ళీ డబ్బుమాట ఎత్తితే వీధిలోకి తరుముతాడేమోనని, ఆయనపార్టీ మద్దెల మోగిస్తున్నాను. నువ్వు బండి దిగేదాకా, మామయ్యకి నువ్వు వస్తున్నట్టే తెలీదు. ఎంత Dramatic suspense create చేశానూ! నువ్వు బండిదిగడం చూసి మామయ్య నామీదొక glance పారేశాడు. కాని, నేను కళ్ళు కిందికి దించేసుకుని నిలువెల్లా గడగడలాడానంటే నమ్ము!

సత్య: వేసవికాలం—మిట్టమధ్యాహ్నంవేళ గడగడలాడేది నువ్వొక్కడివే! కార్యసాధనకి మార్గం ఆలోచించావా లేక వాజమ్మలా ఆ గవరయ్యతో పొగాకుధర గురించి........

వాసు: ఛట్—నీకు అభంశుభం తెలీదు—కీర్తీ!

సత్య: ఏంచేస్తున్నట్టు — యిక్కడ దిష్టిబొమ్మలా కూచుని. అక్కడ స్టుడియోవాడు........

వాసు: ఫిలిం ప్రొడ్యూసర్‌కి స్టుడియోవాడొక పెనుభూతం—వెంటాడే నీడ.

సత్య: కట్టిపెట్టవోయ్ వెధవకబుర్లు! కార్యసాధనకి మార్గం?

వాసు: క్రితంసారి సీమంతిని కొద్దిగా రికమెండ్ చేసింది. ఇప్పుడా సిఫారసు కూడా వుండదు.

సత్య: అయితే—మన ఫిలిం మధ్య ఆగిపోవల్సిందే!

వాసు: ఎన్ని ఆరడంలేసుకనక!

సత్య: అది జరగదు. సత్యకీర్తి బొందెలో ప్రాణం వున్నంతవరకూ అదిజరగదు.

వాసు: జరగదు.

సత్య: నువ్వు భట్రాజువి, బావా.

వాసు: సీమంతిని సలహా అడుగుదామా?

సత్య: వాసూ, ఈ పల్లెటూరు రాగానే నీకు మతిపోయింది. ఆడవాళ్ళ నెక్కడయినా సలహా అడుగుతారటయ్యా—దేవా! ఆడది ఆభరణం, అలంకారం. 'స్త్రీబుద్ధిః...' అదేవో అంటారు సంస్కృతంలో.

వాసు: తటిల్లత భలే చురుకైన పిల్ల.

సత్య: అప్పుడే కన్నేశావ్! చూడు—తటిల్లతజోలికి పోకు. కింనుమీదైతే మనీద్దరం పాడుచుకోవలసివస్తుంది.

వాసు: అవును—మామయ్యదగ్గిర ఒక్కటే పిస్తోలు వుంది—రెండు లేవుగా. అలా చూడు, తటిల్లతే యిటువస్తోంది.

(మొదట కనిపించినంత ముంగిలా వుండదు తటిల్లత. కొత్త ధైర్యంవస్తుంది. నటకుడు ప్రేయసిని ఆహ్వానిస్తున్నట్టు ముందుకి వెళ్తాడు సత్యకీర్తి "oh—dear" అంటూ.)

తటి: (ప్రవేశించి) మీ నాన్నగారు చాలా మంచివారు. ఎంత ఆదరం, ఎంత మర్యాద! (ఆమె చీరె వేషం మారివుంటాయి, ఎత్తు మడమలజోళ్ళులేవు కాళ్లకి.)

వాసు: (వెకిలిగా చూస్తూ) ఏమనుకున్నారేమిటి? మా మామయ్య ధర్మరాజు.

సత్య: మా నాన్న హరిశ్చంద్రుడు.

వాసు: మా మామయ్య ఆపద్బాంధవుడు.

సత్య: మా నాన్న నలకూబరుడు.

వాసు: మా మామయ్య దేవేంద్రుడంతవాడు.

సత్య: మా నాన్న ఈసారి ఎలక్షనులలో నెగ్గడం ముమ్మాటికీ నిజం.

వాసు: మా మామయ్య మంత్రిఅవడం అక్షరాలా ఖాయం.

తటి: నన్నింకో నాలుగురోజులపాటు వుండమని మీ నాన్నగారూ, సీమంతినీ బలవంతంచేస్తున్నారు.

వాసు: బావుంది. సత్యకీర్తీ, పట్నంలో నీకు తొందరపనులుంటే నువ్వు ముందుపో. రెండురోజులు పోయినతర్వాత తటిల్లతని వెంటబెట్టుకు నేనొస్తాను.

సత్య: అదెలా ?

తటి: అయితే మీరూ వుండండి.

సత్య: అదెలా ?

తటి: లేకపోతే వెళ్ళండి.

సత్య: అదెలా ? (బిక్కమొహంపెడతాడు.)

తటి: అదెలాగో నాకేం తెలుసు!

('తటిల్లతా!' అని లోపల్నుంచి పిలుపు.)

సీమంతిని పిలుస్తున్నారు. (పిలుపుకి సమాధానంగా) వస్తున్నానండి. (తటిల్లత లోపలికి పిట్టలా తుర్రుమంటుంది.)

సత్య: వాసూ—యిదేమిటి కథ యిలా క్రాస్‌గా తిరిగింది!

వాసు: ఏమీలేదు—నువ్వు ముందుపో.

సత్య: తటిల్లతని యిక్కడ వొదిలేసే ?

వాసు: ఆడదానికోసం అంత కరువుహాచి లేరిక్కడ. అంత అల్లాడిపోతావేం ఆవిడకోసం! ఎవరూ కొరుక్కుతినరు.

సత్య: అవునురా—నాయనా—అవును, తటిల్లతని బుక్ చేసేందుకు నేనెంత శ్రమపడ్డానో నీకేం తెలుసు? ప్లాన్—ఎంతపెద్దప్లాన్ వెయ్యవలసి వచ్చింది. సినీమారంగంలోకూడా శీలవతులు వుండటానికి వీలుందని ఆ అమ్మాయి తల్లిని వొప్పించేటప్పటికి నా తలప్రాణం తోకకివచ్చింది. "మా అమ్మాయి బి. ఎ. పాసయింది. ఏదో వుద్యోగంచేసుకుంటుంది. ఈ సినీమాలు మాకెందుకు, నాయనా" అనేది ఆవిడ తల్లి. "అదిగాదండీ—అత్తగారూ! నేను ఫలానా మాణిక్యాలరావుగారి రెండో అబ్బాయిని. మీ అమ్మాయిగురించి నేను హామీ యిస్తున్నాను. తటిల్లతకి ఎల్లవేళలా తోడునీడవలె వుంటూ నేను కాపాడుతాను" అని మాటయివ్వగా, ఆమె అనుమతించింది.

వాసు: మరి ఈసంగతి నాకింతకిపూర్వం చెప్పలేదేం ?

సత్య: చెప్పాను. నీబుర్ర చురుకైనదికాదు. ఒకటి రెండుసార్లు 'ఎక్కడికి వెళ్తున్నావ్' అని నిలవదీసి అడిగావ్—జ్ఞాపకముందా ? నా చిరునవ్వులోని నిగూఢభావార్థం గ్రహింపనేరకపోతివి.

[సూటు మార్చుకుని తెల్లటి కలకత్తాఅంచుపంచె, సిల్కులాల్చీ వేసుకు హృదయానందం ప్రవేశిస్తాడు. కుచ్చెళ్ళకొంగు లాల్చీ జేబులో పెట్టుకోడం హృదయానందానికి అలవాటు.]

హృ : ఏమిటి మంతనాలు సలుపుతున్నారు ! మీరిద్దరూ కృష్ణార్జునులుటగా—సీమంతిని అంది.

వాసు : హృదయానందం బావా, సీమంతిని చిలిపిదని నీకు తెలియదూ ?

హృ : ఏవో ఫిల్ములు తయారుచేస్తున్నారట మీరు !

సత్య : అబ్బే—ఒక్క ఫిలిం, ఈముద్ద దిగితేచాలు.

హృ : మనదేశంలో లక్షోపలక్షలకి సినీమాకి మించిన కాలక్షేపం తెలీకుటగా!

వాసు : ఈమధ్య భరతనాట్యమంటూ వొకటివచ్చింది—నువ్వు వినలేదేమో! బావా, మాఫిలింలో నాట్యమూ, సర్కసే కాకుండా, పప్పెట్‌షోకూడా యిరికిస్తున్నాం.

హృ : బావుంది. కాని యీ దేశంలో సోమరితనం, వృథాప్రయాసా దినదినానికీ పెరుగుతున్నాయి. మీరీఫిలిం యెందుకు తీస్తున్నట్టు ?

వాసు : కళకోసం, బావా.

హృ : ఇదో కొత్త పాతపదమా ? కళకోసం నువ్వెందుకు చెయ్యాలి—నీపని నువ్వు చూసుకోక.

సత్య : కళోద్ధారణే మాపని.

హృ : భేష్ సత్యకీర్తీ, నువ్వు చివరికి యిలా తయారయావేమిటి ?

సత్య : పెద్దలు పిన్నల్ని దిద్దబోవడం సంప్రదాయం.

హృ : ఈదేశం యిక్కడి ప్రజా ఈ నాలుగేళ్ళలోనూ గుర్తుకి రానంతగా మారిపోయారు.

వాసు : మార్పు అభివృద్ధికి మూలకందం.

హృ : పిడుక్కీ బియ్యానికీ వొకటేనా ?

[ముగ్గురూ యెడంచేతివైపునుంచి తెరలోకి పోతూవుండగా కుడిచేతివైపునుంచి మాణిక్యాలరావూ గవరయ్యా ప్రవేశిస్తారు.]

మాణి : పిడుక్కీ బియ్యానికీ వొకటేనా, గవరయ్యా! మాటకి కాస్త సబబు వుండాలి. కష్టానికీ సుఖానికీ యిన్నేళ్ళబట్టీ మనం వొకటయాం. నువ్వు మావైపు మొగ్గావంటే ప్రగతీపార్టీకి ఈ నియోజకవర్గంలో వొక్క వోటు పడదు.

గవ: ఇందుకోసమా పొలంబోతూవుండగా కబురుపెట్టారు! మీరిలా అడగడం యేంధర్మం? మీ మంచిసెబ్బరలు మీరుచెప్పండి. మావాళ్ళకి తోచినది వాళ్ళు చెబుతారు. ఎవరికివ్వాలనుకుంటే ప్రజలు వారికి వోటిస్తారు.

మాణి: అది ప్రమాదకరమైన మార్గం. ప్రజల్నీ ప్రజాబలాన్నీ యింకా నమ్ముతున్నావా, గవరయ్యా! ప్రజలు గొర్రెలు. అందరూ పల్లకీ యెక్కాలనే విచిత్రధోరణి ప్రజలది. సమగ్రుడైన నాయకుడు ప్రజాసందోహాన్ని తనగోటిమీద ఆడిస్తాడు. మనకిప్పుడు సమర్థుడైన నాయకుడు కావాలి. ప్రజలకేం తెలుసు—వెర్రివెంగళాయిలు. నేను వేదికయెక్కి 'గవరయ్య పచ్చిరౌడీ—అతను ఫలానా రోజున యిలాచేశాడు; ఫలానా రోజున అలాచేశాడు' అంటూ యేకరువుపెడితే, అవునంటారు. తక్షణం నువ్వు అదే గద్దెయెక్కి 'ఈ మాణిక్యాలరావుగారు బూటకాలమనిషి. కొంపవుండు వడ్డీలతోనూ, రైస్‌మిల్లులతోనూ సంపాయించిన పాపిష్టిసొమ్ము యీయనిది' అంటే—దానికీ అవునంటారు. తలలూపడమే వారి లక్ష్యం. ప్రజాసమూహమనేది పదార్థమనుకో. ఆ పదార్థంలో చైతన్యం తీసుకు వచ్చేందుకు నాయకుడు అనే శక్తికావాలి. నాయకుడు శక్తి—ప్రజ పదార్థం. నాయకుడు పురుషుడు—ప్రజ ప్రకృతి. నాయకుడులేని ప్రజ జడము. అంచేత ప్రజల విధ్యుక్తధర్మమేమనగా సరిఅయిన నాయకుణ్ణి యెన్నుకోవడం.

గవ: మాణిక్యాలరావుగారూ, నేనంత చదువుకున్నవాణ్ణికాదు. నాకు తోచిన రెండుముక్కలు చెప్పనా? 'ఏమోయ్ గవరయ్యా' అంటే 'ఏమండీ మాణిక్యాలరావుగారూ' అంటూ గడుపుకొచ్చాం. మూడేళ్ళక్రితం మీ దొడ్లో గడ్డివామి అంటుకున్నప్పుడు పార్టీకక్షలు ఎన్నికల్లోగాని యిలాటప్పుడు కాదని మంటలార్పడానికి ముందుకి దూకింది ఈ గవరయ్యే. మా రెండోదానికి ముహూర్తంపెట్టుకున్నతర్వాత డబ్బుదొరక్క గిలగిల్లాడుతూవుంటే, మూడో కంటివాడికి తెలీకుండా మూడువందలూ చేతిలోపోశారు మీరు—అప్పే అనుకోండి. ఆ అదనులో ఆదుకునే నాథుడెవరు? ఆఖరికి మా పార్టీ కార్యదర్శి వెంకుపంతులు పెట్లో నాలుగువేలుపెట్టుకుని నిర్మొగమాటంగా లేదు అన్నాడు. అంచేత నాకు మీమీదెప్పుడూ గురే. మనిద్దరిమధ్యావున్న ఈ మాటా మంతీ మన పిల్లలమధ్యేది చెప్పండి? మా గౌతమయ్యానీ లచ్చన్ననీ, మీ హృదయానందం, సత్యకీర్తీ ఒక్కనాడుకూడా చూడలేదు. ప్రగతిపార్టీ కార్యకలాపాల్లో మా లచ్చన్న వెంకుపంతులుదగ్గిర తరిఫీదవుతున్నాడు. మీవాళ్ళ దృష్టివేరు; మావాళ్లచూపు వేరు.

మాణి : మనిద్దరి దృక్పథాలలో మాత్రం ఆతేడా లేదూ? అయినా యిద్దరం ఒకే గ్రామంలో యిన్నేళ్ళు బతికాం.

గవ: మీ అబ్బాయిలూ అమ్మాయీ ఇక్కడ యెలాగా వుండరు. వాళ్ళ కెప్పుడూ పట్నమే కావాలి. ఇంక మనిద్దరమూ నా? బతికినన్నాళ్ళు బతకం. మనంపోయినతర్వాత నిల్చేది మాటే. మీ పార్టీలోకి మీరు నన్ను రమ్మన కూడదు—నేను రాకూడదు.

మాణి : ఇంత చెప్పినా బూడిదలోపోసిన పన్నీరేనా? అదికాదు గవరయ్యా—నీ సహాయం నాకు కావాలి.

గవ: సహాయానికేం కావల్సినంత చేస్తాను. కాని నా వోటు నాది. అదేం బాబూ, మీకు దేవతార్చనపెట్టె యెంతో, నాకు పోలేరమ్మ అంత! వస్తా—తర్వాత కలుసుకుందాం.

[గవరయ్య వెళ్ళడమేమిటి, హృదయానందం రావడమేమిటి—
ఒక్కసారే జరుగుతాయి.]

హృ : ఏం నాన్నగారూ అలావున్నారు! ఏదో తీవ్రాలోచనలో పడ్డట్టున్నారే!

మాణి : కడుపులో చల్ల కదలకుండా కూచున్నవాడికి, ఈ సంస్కృతి పార్టీ వాళ్ళు ఒక గుదిబండ కట్టారు.

హృ: ఎలక్షన్లా?

మాణి : ఆ. ఓడిపోతే చిన్నతనం—గెలవాలంటే డబ్బు తగలెయ్యాలి.

హృ: ఎలక్షన్లు ఒక స్పోర్టు, నాన్నగారూ! క్రికెట్ గానీ హాకీగాని ఆట అయిపోయినతర్వాత ఆటగాళ్ళందరూ ఒకేబల్లదగ్గిర కూచుని ఖబుర్లాడుకుంటూ కాఫీతాగరూ? ఇవ్వాళ ఒకజట్టు నెగ్గితే రేపు మరోజట్టు నెగ్గుతుంది. రెండు జట్లున్నప్పుడు ఒకటి నెగ్గాలి, ఒకటి వోడాలికదా!

వాసు : (హఠాత్తుగా ప్రవేశించి) మామయ్యా!—జయాపజయములు దైవాధీనములు. కాని ఈసారి మనకి జయము తథ్యము. భగవంతుడు మనపక్షాన వున్నాడు.

హృ: ఎలా తెలుసు నీకు? భగవంతుడెప్పుడూ రెండుపక్షాలా షేవింగు సెట్టులోని బ్లేడుమల్లే వుంటాడు.

వాసు : హృదయానందం బావా, భగవంతుడే మనపక్షాన లేనిపక్షంలో తటిల్లత నిక్కడికి పంపడు.

హృ: అదేమిటి? ఇదొక స్టంట్.

వాసు: ఈ సాయంత్రం యెలక్షన్ మీటింగులో తటిల్లతచేత పాటకచ్చేరీ చేయిద్దాం. సభికులకి చోటుచాలక పోలీసు బందోబస్తు కావల్సివస్తుంది.

హృ: Excellent వాసూ. కొలంబస్ ఖిన్నుడయే డిస్కవరీ. ఈ దేశంలో మనుషులకి పూర్తిగా మతులుపోయాయి. మెయిల్ సరిగ్గా పదీ యిరవైకే గాదూ?

వాసు: మామయ్యా, తటిల్లత వంటింట్లో పీటేసుకు కూచుంది. పద అక్కడికి వెళ్దాం.

[వాసూ, మాణిక్యాలరావూ నిష్క్రమించగా హృదయానందం తను కాని ప్రదేశంలో మసులుతున్నట్టు మొహం పెడతాడు. తటిల్లత ప్రవేశం.]

హృ: నువ్విలా వచ్చావేమిటి? నీకోసం వాళ్ళు వంటింట్లోకి పోతే!

తటి: ఎవరు?

హృ: నాన్నగారూ, వాసూ.

తటి: నాతో యేంపని వారికి?

హృ: ఈ సాయంత్రం యెలక్షన్ మీటింగులో నీ పాటకచ్చేరిటగా?

తటి: ఆ సంగతి యిందాకనే చెప్పారు మీ తమ్ముడుగారు. బండి దిగినప్పట్నుంచి మిమ్మల్ని వొక్కసారికూడా పలకరించలేదు. మీ చెల్లెలు సీమంతిని నాకు వూపిరాడనిస్తేనా?

హృ: సీమంతిని చిన్నప్పట్నుంచీ కబుర్లపోగు.

తటి: ఒక్కసారికూడా పల్కరించలేదని యేమన్నా అనుకున్నారా?

హృ: ఎందు కనుకోడం?

తటి: మాటవరసకి అడుగుతున్నా.

హృ: తటిల్లతా, నువ్వు మెరుపుతీగవే నిజానికి.

తటి: కారణం—ఈ అభినందనానికి?

హృ: హృదయం కారణాలు వెతుకుతుందా? వెతకదు. ఈ యింట్లో నువ్వొకమాదిరి పరదేశివి—నేనింకోమాదిరి పరదేశిని. లండన్‌లో ఒక్కొక్క సాయంత్రం మాతృదేశం జ్ఞాపకంవచ్చేది. ఎన్నో సినీమాలూ, నాటకశాలలూ కాలం పొద్దుపుచ్చడానికి స్నేహబృందాలూ వున్నా యెంచేతో అకారణంగా ఈ పల్లె, చిన్నతనంలో నాతో ఆడుకున్న ఆవుదూడ మెళ్ళోని గంటలూ, అమ్మచేసే

చెగోడీలూ, మా వీధిగుమ్మంలో పడుకునే నల్లకుక్కా జ్ఞాపకంవచ్చేవి. నాకుపదేళ్లు నిండకపూర్వపువి ఈ స్మృతులు. ఈస్మృతిమాల మూడునెలలు అతితీవ్రంగా కలవరపెట్టింది. ఈజ్ఞాపకాలెందుకొస్తున్నాయో నాకు తెలిసేదికాదు. ఒక రోజున అమ్మ చచ్చిపోయిందని కేబుల్ వచ్చింది అకస్మాత్తుగా. బాధపంచుకోడంవల్ల యెంత తేలిక అవుతుందో, ఆ సాయంత్రం మార్గరెట్ వల్ల తెలుసుకున్నాను.

తటి : ఆమెని మీవెంట యెందుకు తీసుకురాలేదు ?

హ్యా : ఒక్కరోజున నా ఆందోళనపట్ల సానుభూతి చూపినంతమాత్రాన నాతో వచ్చేస్తుందా ? ఎంత వెర్రిదానివి, తటిల్లతా ? మన ప్రజలదృష్టి చాలా సంకుచితమైనది. రాజకీయంగా దాస్యబంధాలు సళ్ళాయేగాని మనమింకా బానిసలమే! తరతరాల మూఢాచారాలకీ, అజ్ఞానానికీ, చేతకానితనానికీ బానిసలం.

తటి : మీరు మార్గరెట్ ని ప్రేమించినట్టున్నారు ?

హ్యా : మార్గరెట్ లాంటి మనిషిని ప్రేమించకుండా వుండగలరా ? లండన్ లో ప్రతిమనిషీ మహారాజులా వుంటాడని భావిస్తారు కొందరమాయకులు. మార్గరెట్ కి కాలుపోగొట్టుకున్న ఒక తమ్ముడూ, ఒఖ్ఖ కన్నువున్న తల్లీ వున్నారు. రెండవ ప్రపంచశాంతికి తమ్ముడు కాలూ, తల్లి కన్నూ సమర్పించారు. మార్గరెట్ దినమూ అయిదుగంటలు టైపిస్టుగా పనిచేసి, మూడు కాలేకడుపులు పోషించగా మిగిలినదానితో విశ్వవిద్యాలయంలో చదివేది. మార్గరెట్ ని మర్చిపోలేను. ఆమె దీనవదనం మరపుకిరాదు. మార్గరెట్ ప్రేమానుభవం నాజీవితపరిణామంలో ఒకఘట్టం. ఏది ప్రేమ—దేశంకోసం కాలూ కన్నూ అర్పించిన యిద్దరువ్యక్తుల్ని కనిపెట్టుకువుండటమా, లేక యవ్వన రక్తంలోని పిలుపాలకించి నన్ను అనుసరించడమా ? చెప్పు, తటిల్లతా—నువ్వు కాబోయే ఫిలింస్టార్ వి—ఏది ప్రేమ ?

తటి : నాకు తెలీదు.

హ్యా : మార్గరెట్ ఏంచెయ్యాలంటావ్ ?

తటి : మీప్రేమ పొందగలిగిన మార్గరెట్ రాజమార్గాన్నే పోతుంది.

హ్యా : నాప్రేమలో ప్రత్యేకతా ఘనతా లేవు. నాది సామాన్య మానవ హృదయం. మార్గరెట్ దేవత.

తటి : అవును. అందుకే ఆమె ప్రతిబింబితాలైన దయ, ఓర్పు, సౌశీల్యం మీ కళ్ళలో కనిపిస్తాయి.

హ్ర: మీరంతా కలిసి ఏం సినిమా తీస్తున్నారు, తటిల్లతా ?

తటి: నాకంతగా తెలీదండీ. నేను నిజానికి బి. ఎ. పాసుకాలేదు. ఫస్ట్ యియర్ చదువుతూండగా మా నాన్న పోయారు. అమ్మ నాన్ననెప్పుడూ పట్టు చీరెలూ, రవ్వలఅడ్డిగ కావాలని వేధించేది. పట్నవాసపు జీవితంలో, వచ్చే నూటయేభైరాళ్ళలోనూ అమ్మ గొంతెమ్మకోరిక లెక్కడ తీర్చగలడు నాన్న! ఒకొక్కరోజున ఎవరూ చూడకుండా కన్నీళ్ళు పెట్టుకునేవాడాయన. అమ్మకి ఎందుకంత యింగితజ్ఞానం వుండేదికాదో ఈనాటికీ నాకు వింతగా వుంటుంది. ఆఖరికి ఆయన కష్టాలు గట్టెక్కాయి.

హ్ర: పాపం—సగటుమనిషి.

తటి: మనఃపరిపక్వత లేని ఆడపిల్లలకి సినీమాలలో జేరాలనీ, పదిమందిలో తిరగాలనీ వుండటం సహజం. మాయింట్లో ఈ సూత్రం పల్టీకొట్టింది. అమ్మకి నాన్నచావు యిల్లుమారడం, వూరుమారడం మాదిరి అనిపించిందేగాని ఆమె స్వభావంలో పెద్ద మార్పేమీ రాలేదు. నన్ను సినిమాలలో జేరమని ఆమె ప్రోత్స హించడం మొదలెట్టింది. "కులస్త్రీలు సినీమారంగములో జేరవచ్చునా?" అను శీర్షిక కింద కొందరు కాలేజీవిద్యార్థులూ, కుడీ ఎడమా తెలీని పత్రికా రచయితలూ రాసిన వ్యాసాలు నాకు చదివి వినిపించేది. సత్యకీర్తిగారితో పరిచయం కావడానికిపూర్వం రెండు సినీమాకంపెనీలతో మాకు బెడిసింది.

హ్ర: ఆదర్శమాత! పాపం—మీ అమ్మ సినీమాతార కావల్సిన యోగ్యత తప్పిపోవడంతో ఈ అవస్థ నీకుపట్టింది. మావాడు తీస్తున్న ఫిలిం పేరేమిటి?

తటి: అది నాకుమాత్రమేం తెలుసు? సత్యకీర్తిగారికి సినీమావాళ్ళకి కావల్సిన లక్షణాలన్నీ వున్నాయి. ఒక్కటీ నిజంచెప్పరు. అంతా కళ్ళల్లో ఖారమే. ఎలక్షన్ మీటింగ్‌లో పాటపాడించేందుకు నన్నిక్కడికి తీసుకొచ్చారనేసంగతి మీ నాన్నగారడిగేదాకా నాకు తెలీనే తెలీదు.

## 2

[మాణిక్యాలరావుగారి యిల్లు. లోపలిభాగం. మూడురోజుల తర్వాత. ఉదయం పదిగంటలవేళ. గోడ గడియారం టైము చూపుతూవుంటుంది. దివాసీమీద సీమంతినీ, తటిల్లతా కూచుని వుంటారు. కుర్చీలులేవు—గోడలకి పటాలులేవు.]

సీమం: వెంకుపంతు లేమన్నాడో విన్నావో! వాళ్ళు సినీమాతార్‌ని తెప్పించారు; మనం డ్యాన్సు పెట్టించాలి — అని రాద్ధాంతం చేశాడట.

తటి: నేనూ ఒక సినీమాస్టార్నే! ప్రస్తుతం మనబతుకే ఒక సినీమా అయిపోయింది. ఇవ్వాళటి కప్పుడే నాలుగురోజులు. ఇద్దరూ పరారైపోయారు. మళ్ళీ సిగ్గూ భిడియంలేకుండా నవ్వుకుంటూ ఎలా పాదంపెడతారో! బాబోయ్— తలుచుకుంటే వొళ్ళు జలదరిస్తుంది.

సీమం: చిన్నన్నకి నిరుడు వేసంగిలో ఛక్కటి పెళ్ళిసంబంధం వచ్చింది. పిలిచి పిల్లనిస్తామంటే వొద్దన్నాడు. తనజీవితం కళకే అంకితమట.

తటి: ఇంటిదగ్గిరకూడా యిలాటి పైత్యపుఖబుర్లు చెబుతూవుంటాడా?

సీమం: వినేవాళ్లుంటే చెప్పడానికేం, లతా! ప్రతి మొగాడూ తనో రాజకుమారుణ్ణి అనీ, ఎవరో గంధర్వకన్య తనని వలచి ఎత్తుకుపోయి పువ్వులలో పెట్టి, అగరుధూపంవేసి, హారతియిస్తూ పూజిస్తుందనీ అనుకుంటూవుంటాడు. చిట్టచివరికి ఆ అమ్మాయికి సంవత్సరానికో నాలుగు మంచిచీరెలు కొనడానికి కళ్లు తేలేస్తాడు. ప్రపంచంలో సగటు మొగాడు పశువు—తుంటరి.

తటి: Except మీ అన్నయ్యలూ, నీకొచ్చేబోయే భర్తా.

సీమం: పెద్దన్న తీరువేరు. చిన్నన్నా బావాసంగతి చెప్పాలీ? ఇద్దరూ తోడు దొంగలు. బావ చిన్నన్నకి పురెక్కిస్తాడు. చిన్నన్న టపాకాయలా పేల్తాడు.

తటి: మీ పెద్దన్న మతాబాలా వెలుగుతారుకదూ!

సీమం: అది నీకు తెలియాలి. ఈ నాలుగురోజుల్నుంచీ ఆయనకేం తక్కువవుతుందోనని మహాశ్రద్ధగా కనుక్కుంటున్నావు.

తటి: మా అమ్మ నాగురించి ఏమనుకుంటుందో! సత్యకీర్తి, మీ బావా అమ్మచెవుల్లో అపవాదులు నూరిపోస్తూవుంటారు. ఏకుణానైనా దూకవచ్చు ఆవిడ యిక్కడికి. ఎంచేతనో నాకు మా అమ్మ అంటే ప్రేమలేదు.

సీమం: నీ హృదయానికి విశాలమైన ప్రేమ కావాలి.

తటి: అనగా?

సీమం: లతా, ఎక్కడిదాని వెక్కడికివచ్చిపడ్డావ్? నువ్వు నిజంగా అదృష్టవంతురాలివి.

తటి : ఏమదృష్టం ? జరిగిన సంగతులు తెలుచుకుంటే సిగ్గుగా వుంది.

(తెరలోంచి) ఏమండోయ్.

సీమం : ఎవరు ? చెయ్యూర్కోలేదు.

(తెరలోంచి) ఏమండోయ్.

సీమం : చెయ్యూర్కోలేదూ—పనిమీదవున్నాను.

(తెరలోంచి కటువుగా) ఏమమ్మోయ్.

సీమం : వెంకడూ, దాన్ని గెంటి తలుపెయ్యి.

[హడావిడిగా ప్రవేశిస్తుంది అరుంధతి. వయసు 47. ఆమెకి భర్త లేడని ఎవరూ అనుకోలేరు. పొట్టి—లావు. చెవులకి రవ్వల దుద్దులు. బెంగుళూరు పట్టుచీర కట్టుకుంటుంది.]

అరుం : ఏమఘాయిత్యమమ్మా, తలుపేయిస్తావ్—రత్నంలాంటి నా కూతుర్ని యింట్లోదాచుకొని. (తటిల్లతా, సీమంతిని బెదిరిన లేళ్లలా దిక్కులుచూస్తూ మంచుంటారు) కులం తక్కువవాళ్ళమనుకున్నావా ? తలుపేయిస్తుందట. వేయిస్తుంది—చూస్తాగా.

సీమం : (ధైర్యంతెచ్చుకొని) ఓ మీరా—ఎవరో అనుకున్నాను. రండి—లోపలికిరండి. తెలియక చేసినవి తప్పులుకావు. ఎవరో అనుకుని తొందరపడ్డాను. ఏమీ అనుకోకండేం !

తటి : ఎలావచ్చావే, అమ్మా !

అరుం : ఎలాగా—కాళ్ళతోటి. మీనాన్న పదహారుకాసుల చంద్రహారం అమ్మేశాడుగాని కాళ్ళు నరికెయ్యలేదుగా ? .

తటి : మరో చంద్రహారం చేయించి కాళ్లు విరగ్గొట్టినా నీకు అభ్యంతరం వుండేదికాదు. అంతేనామ్మా ?

సీమం : లతా, అదేమిటంత పెళసరంగా మాట్లాడుతావ్ ?

తటి : మీ యింట్లోగడిపిన ఈ మూడు రాత్రిళ్ళలోనూ నాలోకం మారిపోయింది.

అరుం : పెళ్ళికాకుండానే మూడు రాత్రిళ్ళూనా అప్పుడే ? యింకేం...

సీమం : తమాయించుకోండి, అత్తయ్యా, యిలా తివాసీమీద కూచోండి.

అరుం: నేను నీకు అత్తయ్యనెలా అవుతానే!

సీమం: ఏదో పెద్దవారుగదా అని ఆదరసని పిలిచాను. ఇది మా పుట్టిల్లు. మీరు బయటనించి వచ్చారుగనక అత్తయ్య అయారు.

అరుం: మాటలు నేర్చావుగాని ఈ సాగదీసుకోవడాలు కట్టిపెట్టు. అమ్మాయ్ తటిల్లతా, పద, మనింటికిపద.

తటి: మామయ్యగారు వూరునించి వచ్చేదాకా అటు సూర్యుడిటు పొడిచినా యిక్కడనుంచి కదలను.

అరుం: మామయ్య యెవడే?

తటి: యెవడే అంటావ్వా! మర్యాదయిచ్చి పుచ్చుకోవాలి, ఆ సత్యకీర్తిని యిటు పట్టుకురా.

అరుం: వీధిలో నుంచున్నాడు. లోపలికి రాడట. నిన్నే రమ్మంటున్నాడు.

తటి: నన్ను అతను రమ్మనడం, నేనురావడం—అది కృతయుగంనాటిమాట. వాళ్ళ బావెక్కడ?

అరుం: అతనూ వీధిలోనే వున్నాడు.

తటి: సీమంతినీ యిద్దరూ వాకిటవున్నారటోయ్!

సీమం: నాన్న వచ్చినతర్వాత స్నానంచేయించి లోపలికి పట్టుకొద్దాం.

అరుం: అమ్మాయ్—పదపద. జట్కా సందుచివర వుంది.

సీమం: నూతిదగ్గిరకెళ్ళి కాళ్లుకడుక్కురండి. భోజనం అయినతర్వాత చర్చలు స్తిమితంగా సాగిద్దురుగాని. ఇంతలో నాన్నకూడా వస్తారు.

అరుం: ఈ యింట్లో విస్తరెయ్యడమా—నా కడుపుడకా!

సీమం: సలక్షణంగా సమస్తం జరగనున్నాయి. మాటలే మిగులు.

వాసు: (స్టేజిలోకి తొంగిచూస్తూ) యేమండీ అరుంధతిగారూ...

సీమం: ఏయ్ బావా—ఎందుకొచ్చావ్ లోపలికి? నిన్నూ చిన్నన్ననీ లోపలికి రానివ్వవద్దన్నాడు నాన్న; వస్తే గెంటించమన్నాడు. గౌరవంగా వెడతావా, వెంకణ్ణి కేకెయ్యమన్నావా?

వాసు: కేకెయ్.

సీమం: వెంకడూ...వెంకూ...ఓరి వెధవా—యెక్కడచచ్చావురా!......

(వాసు మొహంలోకిచూసి) మన తెలివికితోడు యిదో నాటకంకూడానా?... పెద్దన్నయ్యా!

వాసు: ఉన్నావేమిటి యింకా వ్రాళ్ళో, మా ప్రాణాలకి శనిలా పోగయ్యావే! (గబుక్కున లోపలికి తప్పుకుంటాడు.)

[రెండోవేపునుంచి హృదయానందం ప్రవేశిస్తాడు. కుచ్చెళ్ళ కొంగు లాల్చీ జేబులో విధిగా వుంటుంది.]

హృ: ఎందుకమ్మా పిలిచావ్?

సీమం: బంధువులొచ్చారు మనింటికి. తెలీడంలా యెవరో! (హృదయానందం తటిల్లత మొహంలోకి చూస్తాడు) ఊ... అవును ఆవిడే తటిల్లత తల్లి.

హృ: అలా నుంచోబెట్టారేమిటి ఆవిడని! రండి—లోపలికి వెళ్దాం. (మంత్రగాడిని అనుసరించినట్టు కిమ్మనకుండా అరుంధతి హృదయానందంవెంట వెడుతుంది)

సీమం: చూశావా, అన్నయ్య ముఖారవింద మట్లాటిది. ఇంక మళ్ళీ పెదవి యెత్తదు—నాకు తెలుసు. పెద్దన్నయ్య యిట్టే కనిపెట్టేస్తాడు మనసులో మర్మం.

తటి: అదుగో—మీ బావా, సత్యకీర్తి వస్తున్నారు. నాకు భయమేస్తోంది, బాబూ. ఎలా తప్పించుకుపోడం? వాళ్ళు దారి అడ్డగించేటట్టు వున్నారు.

[హృదయానందం, అరుంధతీ వెళ్ళినవేపునించే ప్రవేశిస్తారు వాసు, సత్యకీర్తి.]

సీమం: ఆగండక్కడ. ఒక్క అడుగు ముందుకివేశారా మర్యాద దక్కదు. కోపంవస్తే నేను మంచిదాన్ని కాదు.

సత్య: నువ్వెవరు నన్ను శాసించడానికి?

సీమం: అమ్మ చచ్చిపోతూ యిల్లు నాచేతిలోపెట్టింది. అప్పట్నుంచీ నాన్ననీ యింటినీ సాదుకువస్తున్నాను. ఈ యింటిపెత్తనం నాది. ఈ యిల్లు నాదికాక ఎవరిదనుకున్నావ్?

సత్య: తొండ ముదిరి వూసరవిల్లి అయిందే, బావా! అందుకే ఆడవాళ్ళకి స్వాతంత్ర్యం కూడదంటాను.

వాసు : స్త్రీ బాల్యంలో తండ్రివల్ల, వయసులో భర్తవల్ల, వృద్ధాప్యంలో కుమారునివల్ల పోషింపబడటం ఆర్యధర్మం.

సత్య : తాత్పర్యం కాదోయ్—శ్లోకమొకటేడ్చింది. అది మన పిక్చరులో పెట్టాలి.

సీమం : బావా, మీరు చూడటానికీ ముట్టుకోడానికీ అసహ్యంతోపించే గొంగళీ పురుగులు—వానపాములు. తాచు పగపడుతుంది. మనం పగబట్టి చంపుతాం. మానవహృదయంలోని నైచ్యం మీ మొహాన కారుతోంది. కళాసేవకై పట్నవాసపు మురికివీధుల్లోకి పోండి. గ్రామసీమల్లోని కుటుంబసౌభాగ్యంలో మీకు స్థానంలేదు. ఎవరాగుమ్మంలో? గవరయ్యా! వాళ్లు యింటిపైబడి అల్లరిపెడుతున్నారు. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది, గవరయ్యా.

(నెమ్మదిగా అడుగువేసుకుంటూ గవరయ్య ప్రవేశిస్తాడు.)

గవ : పెదతారమ్మా—పెదతారు. అయ్యలువేంచేశారని విని యిటువచ్చాను. మాణిక్యాలరావు మెత్తటివాడు కనక వాళ్ళాటలు సాగుతున్నాయి. బడితె పుచ్చుకుంటే... ఏమయ్యోయ్ సత్యకీర్తయ్యో—భలే పేరెట్టుకున్నావుగాని, నాకు నూటిగాచెప్పు. ఇన్నివేలూ పట్టుకెళ్ళి వారంతిరగకుండా ఈవూరిపొలిమేరలో ఎందుకు కాలెట్టావ్? ఎంగిలికూడు ఎలాగా ఏడ్చావ్! ఆ డబ్బుతో రెండునెలలపాటు ఇటు తొంగిచూడకూడదనే బుద్ధికూడా లేదాయెను. ఇంకా ఎలక్షనులవలేదుగదా మళ్ళీ అల్లరిచేదామనేగా వచ్చావ్? నువ్వు మనిషివా దున్నపోతువా, నాయనా! అసలు మీ బావనిపట్టుకు నాలుగు చితకమోదాలి.

సీమం : ఏంజరిగిందేమిటి, గవరయ్యా?

గవ : ఏంజరగడమేమిటి, బుల్లీ! వెంకుపంతులికి ఆరువేలకి ప్రామిసరీనోటు రాసియిచ్చాడు.

సీమం : అయ్యో! అయ్యో! ఆరువేలే! పెద్దన్నయ్యా...

గవ : ఏదో చిన్నతనంకొద్దీ చేశాడనుకుంటే ఆగడం మరీ ఎక్కువైపోతోంది. వెంకుపంతులికి నామీదిప్పుడు పీకలదాకా వుంది. వందరూపాయిలిస్తాను—సాక్షి సంతకం పెట్టమన్నాడు. 'ససేమిరా' అన్నా. పూజారి భద్రయ్య నూటయాభై పుచ్చుకుని సంతకంపెట్టాడు. ఈ అయ్యలకి సరిగ్గా ఐదువేలైనా ముట్టాయో లేదో

ఆరువేలకి నోటురాసిచ్చారు. అదిగో జట్కా—చప్పుడవుతోంది. మాణిక్యాలరావుగారే అయివుంటారు.

సత్య: గవరయ్యా, యివి కోడిపందాలు కావు. నీ వుడతవూపులకి చింతకాయలు రాలవు.

[మాణిక్యాలరావు ప్రవేశం. మాణిక్యాలరావుకిప్పుడు కోటు, జరీకండువా, గాగుల్సూ, చేతికర్రా వుంటాయి.]

మాణి: ఏమిటీగొడవ? చిన్నబ్బాయ్, వాసూ—మీరింట్లో కెందుకొచ్చారు? ఎందుకు రానిచ్చావమ్మాయ్?

సీమం: గవరయ్యనడుగు కథ.

మాణి: ఏమిటి?

గవ: అయ్యలు ప్రబుద్ధులయారు. నాలుగురోజులక్రితం వెంకుపంతులుదగ్గిర ఆరువేలు ప్రామిసరీనోటుమీద పుచ్చుకుని...

మాణి: ఆరువేలే! ఎన్నాళ్ళు కూడబెడితే అవుతుంది? నిజమా సత్యకీర్తి?

సత్య: అవును. నాకు ఆస్తిలేదూ?

మాణి: ఏమిటీ?

సత్య: నాభాగం.

మాణి: పట్నం కోర్టులో దావా వెయ్యి! గవరయ్యా, వేళకి ఆదుకున్నావ్. వీళ్ళిద్దరినీ బండి ఎక్కించి పొలిమేరదాకా పంపించిరా. అప్రయోజకులు—వాజమ్మలు. మీ మొహాలకి సిగ్గులేదు.

సీమం: నాన్నా, అరుంధతిగారు, తటిల్లత తల్లి వచ్చారు. మేడమీద పెద్దన్నయ్యతో మాట్లాడుతున్నారు.

మాణి: బావుంది. ఆమె రాకకూడా ఒకందుకు మంచిదే అయింది. తటిల్లతకి ఏమైనా సంశయాలువుంటే తల్లి నడుగుతుంది. గవరయ్యా, ఈ ఎలక్షన్ పోటీలోనుంచి నేను విరమించడమే కాకుండా, మన నియోజకవర్గంలో సంస్కృతి, ప్రగతి పార్టీలు ఏకమై నవజీవనపార్టీగా వ్యవహరించాలని విజ్ఞప్తిచేస్తా నీసాయంత్రమే! అమ్మాయిలూ, మీరు లోపలికి వెళ్ళండి. (సీమంతినీ, తటిల్లతా లోపలికి వెళ్ళేందుకు సత్యకీర్తీ వాసూ దారిస్తారు) గవరయ్యా, ఈరాత్రి మెయిల్ కే నేనూ పెద్దబ్బాయితో షోలాపూర్ వెళ్తాను. ఏమిటో—వాళ్ళిద్దరూ చూసుకున్న వేళ.

ఇద్దరి మనసులూ కలిశాయి. అంతకంటె మనకి కావల్సిందేమిటి చెప్పు. ఇల్లా వాకిలీ కాస్త కనిపెట్టి చూస్తూవుండు, నేనువచ్చేదాకా.

గవ: మీరుచెప్పాలా ఆ విషయం? పెద్దబ్బాయి అదృష్టవంతుడు. తటిల్లత ఛలేపిల్లలెండి. ఇద్దరూ చిలకా గోరెంకల్లా వుంటారు. ఏమయితేనేం కుందనబ్బొమ్మలాంటి కోడలు యింటిముందుకొచ్చి వాలింది. అమ్మాయికూడా యేదో మంచి సంబంధం వెతకండి.

మాణి: మనలో ఏముంది? ఆఘుడియ తోసుకురావాలి. ఏమి యెండలు—ఏమి యెండలు. మళ్ళీ కలుసుకుందాం. (లోపలికి వెళ్తాడు)

గవ: పదండి—బాబూ పదండి.

వాసు: నువ్వు పోవోయ్—మహా చెప్పొచ్చావ్!

గవ: అల్లరిపడకండి. ఈ గవరయ్యవాళ్ళోపడే మహాద్భాగ్యమేమిటోను.

(తప్పుకుంటాడు)


వాసు: మనకివి చెడ్డరోజులు, 'నిరాశపడకే మనసా'! Hope—let us live on hope.

సత్య: ఛట్. We live on two meals, three tiffins and a dozen coffees.

వాసు: ముందు మనం, కీర్తి అండ్ వాసూ లిమిటెడ్ చేదాం. ఆపైన ముష్టికి దేశంమీద విరుచుకుపడదాం. షేర్లు పోగుచెయ్యలేకపోం.

సత్య: ఒ.కె. కళోద్ధారణలో ప్రేమకి వ్యవధిలేదు. ఆకారణంగా తటిల్లత ప్రేమలో వుక్కిరిబిక్కిరై జోగ్గిలపడ్డాను. పిట్టని మనంకొట్టాం; తన్నుకుపోయింది మరొకరు. దేవుడులేడూ, సత్యం జయించదూ—దేవుడులేడూ?

వాసు: కలడందురు దీనులయెడ
కలడందురు పరమయోగి గణములపాలన్
కలడందు రన్నిదెసలను
కలడు కలండనెడు వాడు కలడో లేడో!



Edited and published by B. Nagi Reddi for Chandamama Publications, Madras-26
Printed by him at The B. N. K. Press Ltd., Madras-26. Founder: B. N. Gupta